UNIVERSAL LIBRARY
OU_204272
UNIVERSAL LIBRARY

వ్యాకరణో... గ్రంథమాల. 6 వ గ్రంథము.

**Approved by the Text Book Committee**

(Vide Fort St. George Gazette Part I B,
dated 19th April 1927 Page 228.)

# సత్కథామంజరి

ద్వితీయభాగము.

ఆంధ్ర వ్యాకరణ నాటకలక్షణ కావ్యమీమాంసాది
కృతికర్తలును, చిత్తూరు హైస్కూల్
ప్రధానాంధ్రోపాధ్యాయులును నగు

## గొల్లపూడి శ్రీరామశాస్త్రిగారిచే

విరచితము.

తృతీయముద్రణము.

కేసరి ముద్రాక్షరశాల,
మదరాసు.

**1929.**

[కాపీరైటు రిజిష్టరు] [వెల రు. 0-8-0

# విజ్ఞాపనము.

---

బాలురకై వ్రాయఁబడిన నీతికథల పుస్తకము లిప్పటికి కెన్నియో వెలువడినవి. కాని నేనెఱిఁగినంతవఱకు నీతిబోధకము లుండవలసినరీతి నుండలేదని తలఁచెదను. మఱియు, అందలికథ లతివిస్తారముగనో అతి సంక్షేపముగనో యుండి ప్రధాన విషయమిదియని సులభముగఁ దెలిసికొనఁ దగిన స్థితిలోఁగూడ లేవని చెప్పవచ్చును. మిక్కిలి విస్తరించినకథవలె మిక్కిలి సంగ్రహించి వ్రాయఁబడినకథయు నంత లాభకారి కానేరదు. ఒకవిషయమునె రెండుమూఁడుసారులుగఁ జదువునప్పటివలె, రెండుమూఁడు ముక్కలలోఁ జదివి ముగించినపుడును, అందలి ముఖ్యాంశము చక్కగా బోధపడుట కష్టసాధ్యము.

నీతిబోధకమగు నొకకథను జదువఁబోవునప్పుడే యందలి తాత్పర్యము చదువరి కేర్పడెనేని, చదువునపు డతనిమనసు దానియందె నిలిచియుండును. కథను సమగ్రముగఁ జదువునప్పటి కతని కాభావము స్థిరపడును. చిరవనున్న సారాంశమా తాత్పర్యమునె మఱింత దృఢపఱచును. బాలురు చదువఁదగిన గ్రంథములిట్టున్ననే ప్రయోజనకారులని నాయాశయము.

ఈ చిన్నిపొత్తము పైమార్గము ననుసరించియే వ్రాయఁబడినది. శీర్షికను జదువునప్పుడే కథలోని ప్రధానాంశము ఫలానిదని తేటపడును. దానివివరమునే మొదటిపద్యము దృష్టాంతపూర్వకముగా బోధించుచున్నది. మఱియు, కథాసారాంశమును, దాని బలపఱచు నొక ప్రసిద్ధపద్యమును గలవు. ఆద్యంతములయందుండు పద్యములను బాలురచే నావృత్తిచేయించినచో వారికి నొక్కొక్కకథయు నెప్పటికిని జిహ్వాగ్రమందుండు ననుటకు సంశయములేదు. కనుక, ఈగ్రంథము పాఠశాలలలోఁ గ్రిందితరగతులలోఁ జదువువిద్యార్థులకుఁ బాఠ్యముగ నేర్పాటుచేయుట కెంతయుఁదగియున్నదని మనవిచేయుచున్నాఁడను.

ఇట్లు,

గ్రంథకర్త.

# భగవత్ప్రార్థనము.

---

శ్లో॥ జ్ఞానానందమయం దేవం । నిర్మల స్ఫటికాకృతిం
ఆధారం సర్వవిద్యానాం । హయగ్రీవ ముపాస్మహే॥

శ్లో॥ శారదా శారదాంభోజ । వదనా వదనాంబుజే
సర్వదా సర్వదాస్మాకం । సన్నిధి స్సన్నిధిం క్రియాత్॥

ఉ॥ ఏ విభు వందనార్చనము లే విభుచింతయు నామ
కీర్తనం । బే విభులీల లద్భుతము లెప్పుడు సం
శ్రవణంబు సేయ, దో । షావళిఁ బాసి లోకము
శుభాయతవృత్తిఁ జెలంగు నట్టి, నే । నా విభు
నాశ్రయించెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్॥

ఉ॥ ఎవ్వనిచే జనించు జగ, మెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ, బరమేశ్వరుఁ డెవ్వఁడు,
మూలకారణం । బెవ్వఁ, డనాది మధ్యలయుఁ
డెవ్వఁడు, సర్వము దానయైనవాఁ । డెవ్వఁడు, వాని
నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్॥

క॥ లోకంబులు లోకేశులు
లోకస్థులుఁ దెగినఁ దుది, నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుఁగు, నతని నే సేవింతున్॥

క॥ నీపాదకమల సేవయు,
నీపాదార్చకులతోడి నెయ్యమును, నితాం
తాపార భూత దయయును,
దాపస మందార! నాకు దయసేయ గదే॥



శ్రీరామా!

# సత్కథామంజరి.

## దయనుమించిన ధర్మములేదు.

గీ॥ ఆర్తులను గావఁ బూనినయట్టివాని
శుభము లెంతైన వరియించుఁ జూవె వెదకి,
అడవినున్న జీమూతవాహనుఁడు దీను
లైన నాగులఁ గాచుట నందె శుభము.

### జీమూతవాహనుఁడు.

హిమాచలమునందు జీమూతకేతువను నొకగంధర్వరాజు వాసముచేయుచుండెను. ఆతనియింట వంశపారంపర్యముగఁ గోరినకోరికలనిచ్చు కల్పవృక్షమొకటియుండినది. బిడ్డలులేని జీమూతకేతువు దేవతాస్వరూపమగు నాకల్పవృక్షమును యాచించి, సద్గుణమూర్తియగు నొకపుత్త్రుని గనెను. ఆ బాలుఁడు 'జీమూతవాహనుఁడు' అను పేరుతోఁ బరఁగుచు, సర్వభూతదయగలిగి పెరుగుచుండినవాఁడు. ఇట్లుండ నాతఁడు క్రమముగా యువరాజయి యొకనాఁడు తండ్రితో నిట్లనియె.

'తండ్రీ! మనుజుని భాగ్యభోగ్యములన్నియు నెప్పుడో యొకప్పుడు నశించిపోవునవేకదా! విచారింప నిర్మలమైన

కీర్తియొక్కటియే శాశ్వతముగా నిలుచునది. ఆ కీర్తియుఁ బరోపకారమువలనఁ గలిగినట్లయిన నింకఁ జెప్పవలసినదియే లేదు. కనుక, మన పెరటిలోనున్న కల్పవృక్షమును నిరాటంకముగా వినియోగింతుమేని, మనజన్మము సార్థకమగును. మన కీర్తియు దిక్కులయందు వ్యాపించును. మీ యాజ్ఞ యగునేని, నే నాకల్పవృక్షముచేఁ బ్రపంచములోని జనులదారిద్ర్యమును బోఁగొట్టెదను. ఏమి సెలవు?''

జీమూతకేతువు పుత్త్రుని యౌదార్యమునకు మిగుల సంతసించి, నీయిష్టముచొప్పునఁ జేయుము'' అనెను. అంత జీమూతవాహనుఁడు కల్పవృక్షమునొద్దకుఁబోయి, ''దేవా! ఇపుడు నాకోరిక నొకదానిని నెఱవేర్పవలయు. ఈ ప్రపంచమున నెక్కడను దారిద్ర్యమనుమాట లేకుండఁ జేయుట నాయభిమతము. ఇదే నిన్ను ధనార్థులకు ధారపోసితిని'' అని నుడివెను. ఇట్లాతఁడు పలుకఁగా నాకల్పవృక్షము భూలోకమున విస్తారముగా బంగారమును వర్షించెను. దానిచే జనులందఱును ధనవంతులైరి. జీమూతవాహనునికీర్తి లోకమందంతట నల్లుకొనెను.

జీమూతకేతుని దాయాదులు సమయమును నిరీక్షించుచున్నవారగుటచేఁ గల్పవృక్షము పరాధీనమయినదని తెలిసినతోడనే, అందఱొకటిగఁగూడి జీమూతకేతువుపై దండెత్తి వచ్చిరి. అపుడు జీమూతవాహనుఁడు సవినయముగా జనకునకిట్లనియె, ''తండ్రీ! ఈ శరీరము నీటిబుగ్గవంటిది. అట్లే సంపదయును. ఇట్టితుచ్ఛమునకాసించి యితరులను బాధపెట్ట

జగునా? కావున మనమిపుడు దాయాదులతోఁ బోరి, వారిని వధించుట యుక్తముగఁ దోఁపదు. మనమే యీ రాజ్యము నొదలి యెక్కడికైనఁ బోవుదము. ఆ దీనులనే బ్రతుకని మ్ము.'' పుత్త్రుని వచనముల నాలించి జీమూతకేతువు ''వత్సా! యౌవనవంతుఁడవైన నీవే రాజ్యమునువిడిచిపోవు టకు సిద్ధముగ నుండ, ముసలినైన నాకేలయీ రాజ్యము'' అనెను. అంతట జీమూతవాహనుఁడు తల్లిదండ్రులఁ దోడ్కొ ని మలయపర్వతమునకుఁబోయి, అచట నొకకుటీరమునందు వారికి సేవచేయుచుఁ గాలముగడపుచుండెను.

ఇట్లుండ నాకొండయందు వసించు గంధర్వరాజు కొమారుఁడు 'మిత్త్రావసువు' అనునతఁడు, జీమూతవాహనున కాప్తమిత్త్రుఁడయ్యెను. ఆ మిత్త్రావసువునకు 'మలయవతి' అనునొక చెల్లెలుగలదు. ఒకనాఁడు మలయవతియు జీమూ తవాహనుఁడును నొంటరిపాటునఁ జూచుకొని పరస్పరము మోహించిరి. తరువాతఁ గొన్నిదినములకు మిత్త్రావసువు జీమూతవాహనునితో, ''సఖుఁడా! నాచెల్లెలిని మలయవతిని నీకిచ్చి వివాహముచేయ నెంచితిని. నాకోరికను త్రోసివేయకు ము'' అనెను. ఆమాటకు జీమూతవాహనుఁడు మనసులో సంతసించి ''నీకోరిక నెఱవేఱవలయునన్న నా జననీజనకు లంగీకరింపవలయుఁగదా! వారి నడుగుము'' అని చెప్పెను. మిత్త్రావసు వతనితల్లిదండ్రుల నడుగ వారును మఱుమాటా డక సమ్మతించిరి. పిమ్మట నొకసుముహూర్తమున జీమూత వాహనుఁడు మలయవతిని వివాహమయి, ఆపర్వతమునందే

సుఖముగఁ గాలక్షేపము చేయుచుండెను.

ఒకనాఁడు జీమూతవాహనుఁడు సముద్రతీరమున విహరించుచుండెను. ఆసమయమున నచట నొక స్త్రీ యొక బాలుని గౌఁగిలించుకొని 'హాపుత్రా!' యని యేడ్చుచుండినది. అంతలో నొకపురుషుఁడేతెంచి బలాత్కారముగ నాబాలుని దల్లినుండి విడిపించి తీసికొనిపోయి యొకఱాతిపై నెక్కించెను. పిదప నతఁడా స్త్రీని దోడ్కొని పట్టణమునకుఁ బోయెను. జీమూతవాహనుఁ డదియంతయుఁజూచి, ఆబాలుని సమీపించి, వత్సా! నీవెవరవు? నీతల్లియేల యేడ్చుచున్నది? అని యడిగెను. అంత నా బాలుఁడు తనవృత్తాంతము నిట్లు చెప్పెను.

"తల్లిదాస్యముచేఁ గుపితుఁడైన గరుత్మంతుఁడు మహావిష్ణువలన నాగులు తనకాహారమగునట్లు వరము గైకొని, అదిమొదలు సర్పముల భుజింప నారంభించెను. కొలఁదికాలములోనె పాతాళలోకమంతయు పాడుచెడెను. అంత నాప్రభువగువాసుకి ఒకమాత్రే నాగలోకము నాశమగునేమో అని భయపడి గరుత్మంతునితో 'అయ్యా! ఒక పర్యాయమే యందఱను వధింపఁ బూనకుము. అట్లయిన, శీఘ్రకాలములోనే నీయాహార మడుగంటును. ఆవల నీకును గష్టముగుఁగదా! కనుక, నేఁడుమొదలు దినమున కొకనాగుని చొప్పున నీవు చెప్పినచోటునకుఁ బంపుచుండెదను. నామాటవిని యికమీఁదట పాతాళమునకు రావలదు.' అని ప్రార్థించెను. గరుడుఁడును దాని కంగీకరించెను. తాను జెప్పినరీతి వాసుకి ప్రతిదినము నొక్కనాగునిఁ బంపుచుండ నాతఁడు భుజించుచున్న

వాఁడు. అవసరమున యీదినము నావంతు వచ్చినది. దీనికే మాయమ్మ యేడ్చినది. నన్ను శంఖచూడుఁ డందురు.

జీమూతవాహనుఁ డా సమాచారమును విని మిగుల దుఃఖించి, పౌరుషహీనుఁడైన వాసుకి ప్రభుత్వమును గూర్చియు, కనికరమించుకైన లేని గరుత్మంతుని దుష్కార్యమును గుఱించి యు నిందించి, "మిత్రుఁడా! నీవు దుఃఖింపవలదు. నా శరీర మర్పించి, గరుడునినుండి నిన్నుఁ గాపాడెదను" అని చెప్పెను. ఆమాటకు 'శంఖచూడుఁడు' వలదు వలదు. నేనే పోయె దను" అని నుడివి తనకు మరణకాలము సమీపించుటచే, చేరువనున్న గోకర్ణేశ్వరుని మ్రొక్కఁబోయెను. దయానిధి యగు జీమూతవాహనుఁడు, ఆత్మార్పణముచే నాగుని రక్షిం పఁ దనకవకాశము లభించినదికదా! అని సంతోషించుచు, వధ్యశిలపైకెక్కి గరుడుని రాకకు నిరీక్షించుచుండెను.

ఇంతలో నా సర్పవైరి వచ్చి, బండపైనుండు గంధర్వు ని క్షణములో ముక్కునఁ గఱచుకొనిపోయి, మలయశిఖరము పై నుంచుకొని యారగింపసాగెను. అప్పు డాకసమునుండి పూ లవాన కురిసెను. గరుత్మంతుఁడు దానినిజూచి యాశ్చర్యపడి తినుట మాని, కారణమాలోచించుచుండెను. ఇంతలో శంఖ చూడుఁడు దేవాలయమునుండి వచ్చి, వధ్యశిలపై నెత్తురుండు టగని మిక్కిలి దుఃఖించి, నెత్తురుజాడనుబట్టి గరుత్మంతుఁడుం డు స్థలమునకుఁబోవుచు, దూరమునుండియే "గరుత్మంతుఁడా! ఆతనిఁ జంపవలదు. అతఁడు నాగుఁడు కాఁడు. నేను నాగుఁ డను' అని యఱచెను. ఆమాట విని గరుడుఁడు విభ్రాంతుఁ

డయ్యె. తనకోర్కె పూర్ణముగ నెఱవేఱినందులకు జీమూత వాహనుఁడు ఖేదపడఁదొడఁగె.

పిమ్మట గరుత్మంతుఁడు శంఖచూడునివలనయావద్వృత్తాంతము నెఱిఁగి, తనపొరపాటునకు మిక్కిలి పరితపించి, “ఇతరులకుఁగా నీమహాత్ముఁడు తనప్రాణములఁ గోలుపోవ సంసిద్ధుఁడయ్యెఁగదా! నేనింతవఱకుఁ జేసిన పాపమునకుఁ బ్రాయశ్చిత్తముగ, ఇదే యీయగ్నిలోఁ జొచ్చి దేహత్యాగ మొనరించెదఁగాక.” అని యట్లొనరింప సాహసించెను. అంతలో జీమూతవాహనుఁ డతని వారించి, “పక్షీంద్రుఁడా! ఏల ప్రాణత్యాగమును జేయ నిశ్చయించితివి? పాపమునకు నెఱతువేని ‘ఇఁకజీవహింస చేయ’ నని యొట్టుపెట్టుకొనుము’ ఇంతవఱకుఁ జేసిన పాపమునకుఁగాఁ బశ్చాత్తాపము నొందుము. దానిచే నీపాపము శమించును” అని బోధించెను.

గరుడుఁడాతని వచనమును గురూపదేశముగ భావించి, తానంతదనుకఁ జంపినపాములను బ్రతికింప నమకట్టి, అమృతమును దీసికొనితా స్వర్గమునకుఁబోయెను. ఇంతలో పార్వతీదేవి మలయవతి భక్తికి మెచ్చి వచ్చి, జీమూతవాహనునిపై నమృతమును వర్షింప, దానిచే నతనిదేహము వజ్రదేహమాయెను. కొంతసేపటికి గరుత్మంతుఁ డాకసమునుండి యాకొండపై నమృతవర్షమును గురిసెను. అంత నచటిపాముల యెముకలు బ్రతికిలేచెను. అపుడా కొండ శిఖరము పాతాళలోకమువలెఁ జూపట్టెను.

జీమూతవాహనుఁ డక్షతదేహుఁడై సుఖముగ ను

న్నాఁడని విని, బంధువులందఱు సంతసించిరి. శంఖచూడుఁడు గంధర్వరాజుకడ సెలవుఁదీసికొని, పాతాళమునకుఁ బోయెను. జీమూతవాహనునికీర్తినాకర్ణించి, గౌరీకటాక్షముచే నాగములు ప్రీతిమనస్కులై వచ్చి, తాము గైకొనిన రాజ్యమును మరల నాతని కొసఁగి, హిమాచలమునకు రమ్మని ప్రార్థించిరి. దాని కతఁడు సమ్మతించి, తల్లిదండ్రులతోడను భార్యతోను నిజనివాసమునకుఁ బోయి, చిరకాలము సుఖముగనుండెను.

కనుక, దీనజనులయెడఁ గనికరముగలవారి కొకప్పుడు దుఃఖములు గలిగినను, అవి సుఖములుగనే తుదకుఁ బరిణమించుచుండును. అట్టివారు వనములో నున్నను, శుభములు వారిని వెదకికొనిపోయి యాశ్రయించును.

గీ॥ దిక్కులేనివాని దీనతఁ బాపిన
పురుషుఁ డిహమునందుఁ బూజ్యుఁడగును,
బరమునందు వానిభాగ్యమేమనవచ్చు?
విశ్వదాభిరామ వినుర వేమ.

తా॥ దిక్కులేనివానియెడఁ గనికరించి యతని దైన్యమును బోగొట్టినయతఁడు ఈలోకమున నందఱచే గౌరవింపఁబడును. అట్టివానికిఁ బరలోకమునఁ గలుగుసౌఖ్య మింతయని చెప్ప శక్యముగాదు.

# 2. చేసినపాపము చెఱుపక విడువదు.

---

సీ॥ ఎఱుఁగ కొనరించినను పాప మెవరు గాని
కట్టికుడుపక పోదది యెట్టులైన,
బాల్యమందుఁ దూనిఁగల బాధపఱచి
యనుభవింపఁడె మాండవ్యుఁ డాఫలంబు?

ఆణిమాండవ్యుఁడు.

పూర్వము మాండవ్యుఁడను నొక బ్రాహ్మణుఁడుండెను. ఆతఁడు సకలధర్మములఁ దెలిసినవాఁడును, సత్యముఁ దప్పనివాఁడునై, సమస్తతీర్థముల సేవించి యొకచోట నొక యాశ్రమము నేర్పఱచుకొని, తపస్సు చేసికొనుచుండెడివాఁడు. ఇట్లు కొంతకాలము గడచెను. ఒకనాఁడతఁడు తన కుటీరము దాపున నుండు నొక చెట్టుక్రింద, చేతులు పైకెత్తి మౌనవ్రతముఁ దాల్చి నిలిచి, తపస్సుచేసికొనుచుండెను. ఆ సమయమునఁ గొందఱు దొంగలు, దొంగిలిన ధనముతోఁ గూడఁ బఱుగిడుచు, రక్షకభటులవలని భయమునఁ దాము పోవు త్రోవలోనున్న యా మాండవ్యుని యాశ్రమములోఁ దూఱి, అందొకచోట నా ద్రవ్యమును పాఁతిపెట్టి యుండే యొకమూల దాఁగియుండిరి.

ఇంతలోఁ దలవరులు చోరులను దఱుముకొనుచువచ్చి, తపస్సుచేసికొనుచున్న మాండవ్యుని సమీపించి, "బ్రాహ్మణోత్తమా! ఇటు పరుగెత్తివచ్చిన దొంగ లేదారిని బోయిరి? మేము వారిని శీఘ్రముగ వెంబడింపవలసియున్నది. ఆలసింపక

తెలుపుఁడు." అని యడిగిరి. అట్లు వా రెన్నితూరు లడిగినను సమాధిలోనున్న యాముని యొకపలుకైనఁ బలికినవాఁడు కాఁడు. అంత నా తలారులు కుపితులై, బలాత్కారముగ నతని యాశ్రమములోఁ జొరబడి, నలువైపుల వెతికి, ఒక మూల దాఁగియున్న దొంగలను, వారందుఁ బాఁతిపెట్టిన ధనమును గనుగొనిరి. దానిచే వారికామునిపైనను సంశయము గలిగెను. వారపుడు దొంగలతో మునినిగూడఁ బట్టుకొని పోయి తమరాజున కొప్పగించిరి. రాజును విచారణలేక, అందఱను గొఱుతవేయ నాజ్ఞాపించెను. రాజాజ్ఞనుబట్టి తలారులామునినిగూడఁ గొఱుతవేసిరి.

కొఱ్ఱునం దుంపఁబడినను, ఆ మునిశ్రేష్ఠుఁడు చాల కాలమువఱ కన్నే యాహారములేకను మరణింపకను ఉండి తపస్సు చేసికొనుచుండెను. ఆతని కష్టమును జూచినవారు మిగులఁ బరితాపపడుచుండిరి. ఆ ఋషివరుని మహిమను గాంచి, కావలివారు జడిసి, ఆ సమాచారము ఉన్నదియున్నట్లుగా రాజునకుఁ దెలిపిరి. రాజప్పటికిఁ దెలివిదెచ్చికొని, ఆతనిని గొప్పఋషిగ నిశ్చయించి, వెంటనే మంత్రులతోఁ గూడ నచటికిఁబోయి, కొఱ్ఱుననున్న ఋషికి సాష్టాంగపడి "నాతప్పును మన్నింపుము" అని వేఁడుకొనెను. మునిశ్రేష్ఠుఁడాతనియపచారమును 'మన్నించితి' ననెను. అంత నా తలారులు రాజానుమతిచే నామునిని మెల్లగదింపి శూలమును దీసి వేయుటకుఁ దమశక్తికొలఁది యత్నించిరి; కాని సాధ్యము గాకపోయెను. వారపుడు చేయునదిలేక, దానిని నడుగుమట్టు

మునకు విఱిచివేసిరి. ఆ ముని శూలపుఁదునుక తనలోనే నిలిచి యుండినను దానితోఁ దిరుగుచుండెను. అతఁడా శూలపుఁ గొనకుఁ బూలబుట్టను దగిలించుకొనవచ్చును గదా! అని మీఁదు మిక్కిలి సంతసించెను. ఆ శూల మొల్లుండుటవలననే 'అణిమాండవ్యుఁడు' అను ప్రసిద్ధి యాతనికిఁ గలిగెను.

అణిమాండవ్యుఁ డొకనాఁడు యమలోకమునకుఁ బోయి, సింహాసనమునందుఁ గూర్చుండియున్న ధర్మదేవతను జూచి, "నే నిట్టి దుష్ఫలము ననుభవించితిని గదా! దీనికి నేను దెలియకుండఁ జేసిన పాపమేమి?" అని యడిగెను. అందుకా యమధర్మరాజు "ఓ తపోధనా! నీవు బాల్యమున తూనీఁగలఁబట్టి వాని తోఁకలకు ముండ్లు గ్రుచ్చి, యాడించుచుండెడివాఁడవు. ఆ పాపకర్మమునకు ఫలముగ నిప్పుడీకష్టము ననుభవించితివి." అని చెప్పి "బ్రహ్మర్షీ! దానము స్వల్పముగ నీయఁబడినను బెక్కుమడుఁగు లెట్లగునో, పాపము నట్లే కొంచెమైనను నధికదుఃఖము నొసఁగును." అని నుడివెను. పిదప వారికిఁ గొంతసేపు సంభాషణము జరిగెను. ఆవలమాండవ్యుఁడు యమునికడ సెలవుదీసికొని నిజాశ్రమమున కేగెను.

కనుక నెవరుగాని యెప్పుడైన ఏజంతువునకేని వేఁదుకకైన బాధఁగలుగఁజేసినచో, ఆపాపకార్యమునకుఁ దగిన ఫల మెప్పటికైన ననుభవింపక తీఱదని స్పష్టమగుచున్నది.

ఆ॥ పాపమనఁగ వేఱె పరదేశమునలేదు|
తనదు కర్మములను దగిలి యుండు,
కర్మి జనుఁడు తాను గన్నులఁ జూచిన; (విశ్వ.)

# 3. ఆలోచించి పనిచేసిన హానిరాదు.

తే॥ ఎట్టిపనినైన యోజించి యేర్పడంగఁ
జేయునాతఁడు శుభములఁ జెందు నెప్పుడు,
అరయఁ జిరకారి చిరకారి యగుటచేత,
మాతృవధమును దప్పించి మాన్యుఁడయ్యె.

చిరకారి = ఆలోచించి పనిచేయువాఁడు. మాన్యుఁడు = పూజ్యుఁడు.

## చిరకారి చరిత్రము.

పూర్వము మేధానిధియను నొకమునిశ్రేష్ఠునకు "చిరకారి" అను నొక పుత్త్రుఁడుండెను. అతఁడు పనులనెల్లఁ జాల విచారించి చేయువాఁడగుటచే నతని కాపేరు సుప్రసిద్ధమయ్యెను. ఒకనాఁ డొక కారణమున మేధానిధి భార్యపైఁ గోపించి చిరకారినిబిలిచి "నీ తల్లిని జంపుము" అని యాన తిచ్చి వెడలిపోయెను. ఎందును వేగిరపాటులేనివాఁడగు చిరకారి యప్పు డిట్లని వితర్కింపఁ దొడఁగెను.

"ఈ సమయమునఁ దండ్రియాజ్ఞ మీఱరాదు. తల్లిని జంపుటయుఁ దగదు. హా! 'జనకునితలంపుఁ దప్పింపఁ బూనెదఁగాక.' అని యోజించితినా? అది పాపకార్యము గదా! ఎల్లను నీపట్టున మాతృరక్ష యవశ్యకర్తవ్యము. తల్లి దండ్రులకుఁ బొత్తులవాఁడ నగుటచే నిరువురును నాకు సమానులే యగుదురు. మాతృవధము నరకకూపమునఁ బడఁద్రోయకమానదు. అట్లని విడిచితిని బో; తండ్రి నవమానపఱచిన

వాఁడుమాత్రము నరకమును దప్పించుకొనఁగలఁడా?" అని కొంతసేపు విచారించి, మరల నాతఁ డిట్లు తలపోయఁ జొచ్చెను.

"తండ్రియే పుత్త్రరూపమున జన్మించునని శాస్త్రములు ఘోషించుచున్నయవి. అట్లగుటచే జనకుఁడే నేనుగఁ బుట్టినవాఁడ ననుటకు సంశయము లేదు. మఱియు జనకునాజ్ఞఁ బాలించిన పుత్త్రునిపాపములన్నియు నశించునని పెద్దలవలన వినియున్నాఁడను. వేయిమాటలేల? జనకుఁడే తపము, ధర్మము, విద్య, పరమదైవతమును. అట్టి జనకుని కిష్టమగు కార్య మొనరించినవానియెడ, దేవతలును దృప్తినొందుదురు. కనుక, తండ్రియాజ్ఞను బాలించుటయే యీసమయమున నా కుచితమని తోఁచుచున్నది."

ఇట్లా మునిపుత్త్రుఁ డూహించుకొని పిదపఁ దల్లిని గూర్చి యాలోచింపఁ గడంగెను.

"అగ్నికి *నరణివలెఁ గరచరణాది విశిష్టమగు నీ శరీరమునకుఁ దల్లియే కదా కారణము! తన దేహసౌఖ్యమును గూడఁ బాటింపక, భరింపశక్యముగాని గర్భదుఃఖమున కోర్చి కొడుకునకై తల్లి పడుపాటు లిన్నియని చెప్పఁదరమా? తండ్రి వచ్చిపోయి చూచువాఁడుగాక, తల్లివలెఁ గొమారునితో సకలకష్టముల ననుభవించునా? కనుకనే వేదములును దండ్రికంటెఁ దల్లియే గౌరవమున నధికురాలని చెప్పుచున్నవి.

*అరణి = నిప్పుపుట్టించుటకొఱకు మఱియొకకొయ్యచేఁ జిలుకుటకుఁ దగినకొయ్య.

బాలుఁడైనను, ప్రౌఢుఁడైనను, వృద్ధుఁడైనను, కొడుకును దల్లి యొకవిధముగనే ప్రేమించుచుండును. తల్లికి సర్వ ప్రపంచమును దనపుత్త్రుఁడేకదా! దుమ్ములోఁబడిపొర్లు నల్ప జంతువులు మొదలు రాజాధిరాజువఱకు నందఱకును దల్లి యత్యంతావశ్యకమై యున్నది. కలవాఁడు, లేనివాఁడు, బల వంతుఁడు, బలహీనుఁడు, బుద్ధిమంతుఁడు, మూర్ఖుఁడు, అను వ్యత్యాసము లేక యెల్లరకును దల్లికలిమి సౌఖ్యదాయకమై యుండును. మాతృవియోగము సంభవించినంతనే యెట్టివాఁ డును నసమగ్రుఁడును దుఃఖియు నగును. అతనికిఁ బ్రపంచమే పాడైనట్లు తోఁచును. ఇట్టి తల్లిని వధించుట ఘోర నరక కూపమునఁ బడఁద్రోయునని పసులకాపరిగూడ నెఱుఁగఁ డా? ఎట్టి కఠినాత్మునకేని యిట్టిపాపకార్యమును జేయ చేతు లెట్లాడును?''

అని చిరకారి పెక్కురీతుల విచారించుచుండఁ జాల సేపు గడచెను. అంతలోపల నతని తండ్రియగు మేధాతిథి పశ్చాత్తాపతప్తుఁడై, "అయ్యో! కోపములో నోడలు తెలి యక 'తల్లిని జంపు' మని కొడుకున కాజ్ఞ చేసి వచ్చితినిగదా! ఎంతటి ఘోరపాపమున కొడిగట్టితిని? ఇఁక నాతపస్సు కాల్పనా? ఇంతకు నాతఁడు తనపనిని ముగించి యుండునేమో!'' అని తహతహపడుచుఁ గన్నులనుండి నీరు కాల్వలుగట్టఁ గాళ్ళు తడఁబడుచుండఁ బరుగిడుచు, నయము నయము చిర కారి యెందును దనచిరకారితను జూపుఁగాక; ఇట్టిపనికి వేగ పడునా? అని కొంత ధైర్యముఁ దెచ్చుకొనుచు, పుత్త్రు

నుద్దేశించి తనలో "తనయా! నేను మూఢత్వమున నకార్యమునకుఁ బురికొల్పినను, నిన్నుఁ గని పెంచి పెద్దవానిఁ జేసిన తల్లినిఁ జంపక యుంటివేని, నీపేరు సార్థకమగును. లోకులు నిన్ను మెత్తురు." అని తలంచుచుఁ బుత్త్రునిఁ జేరఁబోయెను.

చిరకారి యాత్రముతోఁ దన్నుసమీపించిన జనకునిఁ జూచి, చేతనున్న కత్తిని దిగువవిడిచి యతనిపాదములపైఁ బడెను. భార్యయు భర్తకు సాఁగిలఁబడెను. అప్పుడామునివారిరువురను లేవనెత్తి, కొడుకును కౌఁగిలించుకొని దీవనలిచ్చి, "నాయనా! నాకును నాతపమునకును నిందరాకుండఁ జేసితివి. నరకకూపమునఁ బడకుండ నిన్ను నీవు రక్షించుకొంటివి. నీ చిరకారితను మెచ్చవలదా?" అని పొగడి వారిని దోడ్కొని చనియెను.

కనుక, బుద్ధిమంతుఁడగువాఁడు ఏపనినైన దూరాలోచనముచేసి చేయవలయు. అట్టివాఁడె సర్వశుభముల నొంది, అందఱచేఁ బొగడఁబడును.

ఆ॥ తామసించి చేయఁదగ దెట్టికార్యంబు
వేగిరింప నదియు విషమ మగును
పచ్చికాయఁదెచ్చి పడవేయ ఫలమౌనె?
విశ్వదాభిరామ వినుర! వేమ.

తా॥ ఏపనినైనను దొందరపడి చేయరాదు. అట్లుచేసినచోఁ బచ్చికాయను మాఁగవేసినఁ బండనియట్లులు వ్యర్థ మగును.

# 4. విమర్శింపక చేయుట వెఱ్ఱితనము.

---

గీ॥ ముందు వెనుకల నరయక మోసపోయి,
కార్యమొనరించువాఁ డొందుఁ గష్టములను,
సెట్టిసంగతి తెలియక చేసి యట్లు
మంగలి యొకండు పిమ్మట నంగలార్చె.

క్షౌరకుఁడు కొట్టఁబడుట.

పూర్వ మొక వైశ్యుని పుత్త్రుఁడు బాల్యముననే తల్లిదండ్రులఁ గోల్పోయి, దాదిచేఁ బెంపఁబడి యుక్తవయస్కుఁడాయెను. అతఁ డొకనాఁడు తన పెంపుడుతల్లిని బిలిచి, "మాయయ్య యార్జించినట్టి ధన మెచటఁ బోయెను? ఇట్టి వయసున లేమిడి ననుభవించుచు నలుగురిలోఁ దలయెత్తి యెట్లు తిరుగువాఁడను? ఉండ నిల్లును గుడువఁ గూడును గట్టఁ గుడ్డయు, లేక యీ బ్రతుకు బ్రతుకుటకంటెఁ జచ్చుటయో మేలని తోఁచెడి. లేదా! అడవికిఁబోయి మునివృత్తి నవలంబించి యాకలములఁ దినుచుఁ దపస్సుచేసికొనియైనఁ బుణ్యలోకమునకుఁ బోవువాఁడ" అని కన్నీరుగార్పఁదొడఁగెను.

అపు డా దాది యిట్లనియె. "కుమారా! దుఃఖింపవలదు. నే నిట్లు చూచుచుండగనే నీవు సకలైశ్వర్యములతోఁ దులఁదూఁగుచు, బంధువులచే గారవింపఁబడు కాలము రానున్నది. ఈ రహస్య వృత్తాంతమును వినుము. నీవు పుట్టినవేళనుగూర్చి ఫలాఫలములఁ జెప్పుమని యొకయోగి

వరుని నడిగితి. ఆతఁడు దీర్ఘాలోచనముచేసి 'ఇన్ని సంవత్సరములు, ఇన్నిమాసములు, ఇన్నిదినములు, గడచినపిదప నీ బాలునకు సంపద చేకూరు' అని చెప్పెను. అది మొదలు సంవత్సర మాస దినము లెన్నుకొనుచున్నదానను. ఆ గడువు నేఁటితో సరిపోయినది. నీవు నేఁడో రేపో గొప్పధనవంతుఁడవు కాఁగలవు. జాగరూకుఁడవై యుండుము."

అంత నాసెట్టిబిడ్డఁడు దాదిచెప్పిన మాటల కూఱటఁ జెంది, రాత్రి సుఖనిద్రఁ జెందెను. నాల్గవజామున గజచర్మమును ధరించి, తలపైనుండు జడలలో బాలచంద్రుఁడు వెలుఁగుచుండ, తెల్లని శరీరముతోడ నొకసిద్ధుఁ డాతనికి స్వప్నములో నగపడి యిట్లనియె.

"వత్సా! సాహసించి ప్రాణములఁ బోఁగొట్టుకొనఁ బ్రయత్నించితివేల? నే నుండ నీకేమికొదవ? పూర్వజన్మమున నీవు నన్ను మిగుల భక్తితో నారాధించితివి. అది కారణముగా రేపే నీవు ధనవంతుఁడవు కాఁగలవు. నిశ్చింతుండవై యుండుము. ఇది యొక కలయని భావింపక నేఁజెప్పినట్లు తెలివితోఁ బ్రవర్తింపుము. అదేమన:—నేఁ డరుణోదయమున నే మేల్కాంచి, భగవన్నామసంకీర్తనముచేసి, తెల్లవాఱగనే క్షౌరాభ్యంగనాదులఁ గావించుకొని, మడుఁగుదోవతి కట్టినవాఁడవై యొకచోటఁ గూరుచుండుము. అపుడు ముగ్గురు భిక్షుకులు నీయెదుటికి వచ్చి నిలుతురు. వారికిఁ దగినవిధమునఁ బూజచేసి తృప్తుల నొనర్చి, జంకక దుడ్డుకఱ్ఱతో వారి తల పగులునట్లు మోఁదుము. తరువాత నీవట్లు చూచు

చుండగనే, ఆముగ్గురును గోట్లసంఖ్యతో మాడలుగల మూడు నిధు లగుదురు. ఆ ధనముచే దేవాలయములను, గొప్ప చెఱువులను, మనోహరములైన యారామములను, గట్టింపుము. మఱియు బ్రాహ్మణోత్తముల కగ్రహారము లొసఁగుము. పండితశ్రేష్ఠుల నాదరించి, తగినవిధమున వారికి ధనమొసఁగుము. ఇట్లు చేయుటచే నీకీర్తి లోకమంతట వ్యాపించును. మఱియు, బంధుమిత్రాదులు నిన్నాశ్రయించి సుఖజీవనముఁ జేయుచుండ, నీవు పుత్త్రపౌత్త్రాభివృద్ధిగలిగి సుఖముండుము.''

ఇట్లు నుడివి యా సిద్ధుఁడు కనఁబడకుండఁబోయెను. ఆ సెట్టికొమరుఁడు సిద్ధుఁడు చెప్పినదంతయు నమ్మి, ఆ దేవిధముసఁ జేయఁదలఁచి, అరుణోదయముననే పడకనుండి లేచి, భగవన్నామ సంకీర్తనముచేసి, తన పెంపుడు తల్లిని బిలిచి, ''నీవు స్నానమొనరించి గృహదేవతల నర్చింపుము. మనకు నేఁడు శుభము గలిగెడిమార్గము గలదు. మఱియు నేను క్షౌరాభ్యంగనాదుల నాచరింపవలసియుండును. ఆలస్య మొనరింపక నేర్పరియైన యొక మంగలినిఁ బిలువఁ బంపుము.'' అని చెప్పెను. ఆముదుసలియుఁ గొడుకుచెప్పినవిధమున సర్వము సిద్ధముచేసెను. ఆవైశ్యుఁడు సూర్యోదయము కాఁగానే క్షురకర్మ చేసికొని, మంగలితో ''నీ వింతదనుక నావలన నెట్టియుపకారమును బొందినవాఁడవు కావు. ఈ దినము కొంతసేపు మాయింటనే యుండుము'' అని చెప్పి, పిమ్మటఁ దైలాభ్యంజనముఁ గావించికొని మడుఁగువస్త్రము ధరించి, శివపూజ సలిపి తిన్నెపైఁ గూరుచుండెను.

ఇంతలో దైవయోగమున ముగ్గురు భిక్షుకు లాతని ముందటవచ్చి నిలిచిరి. వారి కతఁడు తగినవిధమున సపర్యలు చేసి, తృప్తులఁగావించి, దుడ్డుకఱ్ఱతో వారితలపై మోఁదెను. వెంటనే యామువ్వురును మూఁడుసిద్ధులైరి. అపుడా సెట్టి యా ధనమును దనగృహమున నిండించుకొని, ఆ సమాచారము నెవరికిని జెప్పకుండుటకై యామంగలికి నూఱువరహాల నిచ్చి పంపెను. ఆ క్షౌరకుఁ డా ధనమునుగొనిపోయి, తన భార్యచేతి కిచ్చి యిట్లనియె. "ఓసీ! మనకు నేటితోఁ గష్టములు తీఱిన వని నమ్ముము. నేఁడు సెట్టిబిడ్డఁడు నేను గన్నులారఁ జూచు చుండఁగనె పరదేశులైన యోగుల ముగ్గురినిఁ జావమోఁది, అంతులేని ధనమును బొందియున్నవాఁడు. కనుక నేను నట్లొన రించి భాగ్యవంతుఁడ నయ్యెదను."

మఱునాఁ డామంగలియు, వైశ్యునివలెనే క్షౌరాభ్యంగనాదులఁ జేసికొని, గృహదేవతలకు మ్రొక్కి, భిక్షువులకై యెదురుచూచుచుండెను. ఇంతలో నాయూరఁ గాపురమున్న పెద్దజంగమయ్య యామంగలివాని వాకిట నిలిచి, 'ధర్మమే సంచితార్థము' అని గొంతెత్తి పలికి భిక్షమడిగెను. అంత నా క్షౌరకుఁ డాతని లోనికిఁ బిలిచి, "ఓయీ! నాకొక వ్రతము గలదు. నీవుగాక మఱియిద్దఱను వేవేగఁ బిలిచికొనిరమ్ము మువ్వురకును దృప్తిఁగ భిక్షఁ బెట్టెదను." అనెను.

అంత నా జంగమయ్య యామాటకు మిగుల సంతోష పడి పరుగెత్తిపోయి మఱియిద్దఱను దోడ్కొనివచ్చి నిలిచెను. అపుడా మంగలి యామువ్వురకును బూజచేసి, తృప్తిగ భోజ

నముఁబెట్టి, వారు లేవఁగనే వాకిటితలుపు బిగియించి, మూలనున్న దుడ్డుకఱ్ఱను జేతఁబూని, వారిలోఁ బొడుగుగ నున్న యొక జంగమయ్య తలపై చేతికొద్ది మోఁదెను. ఆదెబ్బ కాతఁడు నేలఁబడి విలవిల తన్నుకొనుచుండ, వెలుపలికిఁబోవ వీలులేక తక్కిన యిద్దఱును 'మొఱ్ఱో' యని యిటు నటు పఱుగిడుచున్నను వారిని వెంబడించి కొట్టసాగెను. ఈ సందడి విని రక్షకభటులు మదురుగోడదూఁకి లోనఁబ్రవేశించి, ఆమంగలిని పెడరెక్కలు విఱిచికట్టి, జంగాలను మోయించుకొని రాజుకడకుఁ దీసికొనిపోయిరి. రాజు దానిని విచారించి, మంగలినిఁ గొఱుతవేయ నాజ్ఞాపించెను.

కనుక నెవరుగాని యే విషయమునైన ముందువెనుకల విచారింపక చేయరాదు.

క. పదిలముగ వినక చూడక
మొదలఁ బరామర్శచేసి మొనయక, పరుసం
బొదవించు; నెవ్వఁ డాతం
డదయత క్షౌరకుఁడుపోలె నాపదఁ బొందున్ ॥

పదిలముగన్=చక్కగా, పరామర్శచేసి= చక్కగా విచారించి, మొనయక=పూనక, పరుసంబు=కాఠిన్యము, ఒదవించున్=కలుగునట్లుచేయునో.

తా॥ ముందువెనుకల విచారింపక కార్యమును జేయఁబూనువాఁడు మంగలివలెఁ దప్పక యాపదఁ జెందును.

# 5. గుణములుగలవాని కులమెంచగానేల?

---

గీ. కులము గొప్పదైనంతనె గుణము లేదు.
హీనకులుఁడైన, సద్గుణుఁడెందు ఘనుఁడు,
నీచకులమునఁ బుట్టియు, నిర్మలాత్ముఁ
డై నెగడిన ధర్మవ్యాధుఁ డందె ఘనత.

హీనకులుఁడు=తక్కువకులమునందుఁ బుట్టినవాఁడు, ఘనుఁడు=గొప్పవాఁడు, నిర్మలాత్ముఁడు=మంచిమనస్సుగలవాఁడు.

ధర్మవ్యాధోపాఖ్యానము.

పూర్వము కౌశికుఁడను బ్రాహ్మణుఁడొక యగ్రహారమునకు సమీపమున నుండు వనములో వాసముచేయుచుఁ దపస్సు చేసికొనుచుండెడివాఁడు. ఒకనాఁడాతఁడు తనకుటీరమునకుఁ జేరువనున్న చెట్టునీడఁ గూరుచుండి, తపముచేసికొనుచుండ, ఆ చెట్టుపై నుండు కొంగయొకటి యాతనిపై రెట్టవైచెను. దానికతఁడు కోపదృష్టితోఁ జూడ, అది వెంటనే బూడిదయై నేలఁబడెను. నిష్కారణముగా నొక పక్షిని జంపితినిగదా! అని యావిప్రుఁడు పశ్చాత్తాపంబునొందె.

అంత మధ్యాహ్నముకాఁగా నాతఁడగ్రహారంబునకువచ్చి యొకబ్రాహ్మణుని యింటికిఁబోయి భిక్షనడిగెను. ఆ యింటి యిల్లాలు భిక్షనిడుటకై లోనికిఁ బోవునంతలో, ఆమె భర్త యాఁకటితో నింటికి వచ్చెను. ఆయమ తడవుచేయక, అతని కుపచారములుచేసి భోజనమిడి, అతఁడు శయనించినపిదప, వాకిట నిలిచియున్న భిక్షుకుఁడు జ్ఞప్తికిరాఁ దటాలున నాతనికి

భిక్షనిడుటకుఁ బోయెను. ఆబ్రాహ్మణుఁడు గ్రుడ్లెఱ్ఱఁజేసి, ఆలస్యముగ భిక్షవేయవచ్చిన యాయిల్లాలిని గోపముతోఁ జూడసాగెను. అప్పుడా పతివ్రత 'మునీ! నేను కొంగనుగాను జూమా!' అని హెచ్చరించి. 'నాకు ముఖ్యమైన భర్తృశుశ్రూష యొనరించివచ్చుట కించుక యాలస్యమైనది. క్షమింపుము.' అని నుడివెను. ఎచటనో జరిగిన సమాచారమును జూచినట్లు చెప్పుటచే నతఁడా పతివ్రతయొక్క కాశ్చర్యపడి, ఆమెకు వందనములాచరించి, "నాతప్పు మన్నింపుము" అని ప్రార్థించెను. ఆయమ శాంతముతో 'బ్రాహ్మణోత్తమా! కోపము నణఁపకున్న నెన్నితపస్సులుచేసినను వ్యర్థములే యగును. నీవు మిథిలాపట్టణములోనుండు ధర్మవ్యాధుఁడను బోయకడకుఁ బోయితివేని, ఆమహనీయుఁడు నీకు సకల ధర్మముల బోధింపఁగలఁడు, కనుక నచ్చోటికిఁబొమ్ము; నీకు మేలగును.' అని చెప్పెను.

అంత నాబ్రాహ్మణుఁ డాపతివ్రత యానతిని శిరసావహించి, మిథిలకుఁబోయి మాంసవిక్రయ మొనరించు ధర్మవ్యాధుని సమీపించెను. ఆ బోయయు నావిప్రునిఁ జూచినంతనే లేచివచ్చి కేలుమోడ్చి, "స్వామీ! పతివ్రత పనుపగా నీవుధర్మములఁ దెలిసికొనఁగోరి, నాయున్నయెడకు వచ్చియున్నాఁడవని తెలిసికొంటిని. చాల సంతోషమయ్యె. నా గృహమునకు రమ్ము" అని వెంటఁబెట్టుకొని పోయెను.

కౌశికుఁ డాతనిమహిమ కబ్బురపడుచు, అతఁడుచేయు సపర్యలఁ గైకొని తగినయాసనముపైఁ గూరుచుండి, అతనితోఁ

గొంతసేపిష్టగోష్ఠి సలిపి, పిదప "ఆర్యా! నీవు సకల ధర్మములఁ దెలిసినవాఁడవు కదా! ఇట్లు జీవహింస బ్రతుకుఁదెరువుగఁ జేసికొనఁ దగునా?" అని వినయముతో నడిగిన నా బోయ యిట్లు చెప్పఁదొడఁగెను.

"విప్రవర్యా! బ్రాహ్మణుల కధ్యయనాదులవలె మాకిది కులవృత్తి. మఱియు, వంశపారంపర్యముగ వచ్చుచున్నది. ఇట్టిదాని నేనెట్లు విడుతును? నేనిట్టివృత్తి నవలంబించి యున్నను, ఒకప్పుడును జీవహింసఁ జేసి యెఱుంగ. ఇతరులు చంపి తెచ్చిన మాంసమును గొని, తగినవెలకమ్మి బ్రతుకుదు. అతిథిపూజ నొకప్పుడు నేమఱక చేయుచుందును. సత్యశౌచముల విడువను. పరలోపములఁ దడవను. కనుక నే తక్కువకులమునందు జన్మించియు, నేను బూజ్యులకయుఁ బాత్రుఁడఁగాఁజాలితిని. ప్రస్తావముపై నింత చెప్పవలసి వచ్చెను. నీవు నాయొద్దకు ధర్మములఁ దెలిసికొనుటకై వచ్చితివిగాన, వానిఁ గొన్నింటిని దెలిపెద. సావధానుఁడవుగమ్ము.

'తన కులాచార మెప్పుడు విడువక యొనరించుట యుత్తమ ధర్మమండ్రు. సర్వభూతదయ యెల్లర కావశ్యకము. ఏవిషయమునందుఁగాని యత్యాశ యుంచఁదగదు. సజ్జనులతోడి సాంగత్య మందఱకు క్షేమకరము. సుఖదుఃఖములయందు సమబుద్ధిఁ గలిగియుండుట లెస్స. తన కపకారమొనరించినట్టి వానికైన నుపకారముచేయుటయె యుత్తమ కార్యము. ఒకప్పుడు పొరపాటునఁ బాపకార్యముచేయుట సంభవించెనేని పిదప పశ్చాత్తాపమునొంది సగమును, ఇఁక

మీఁదట నట్టికార్యము చేయనని నిర్ణయించుకొనుటతోఁ దక్కినసగమును బోగొట్టుకొని, మనుజుఁ డట్టిపాపమునుండి విముక్తుఁ డగును. కోపము లోభము అనునవి యన్నింటిలో నెక్కుడు పాతకములని తెలియుము. వానిరెంటిని జయించినవాఁడె పుణ్యాత్ముఁ డనఁ దగినవాఁడు. మఱియు, సర్వ ధర్మములలో సత్యవ్రతము ముఖ్యమైనది. అసత్యమునకంటెఁ బాపకార్యమొండు లేదు. ఇట్లు ధర్మములు బహుప్రకారములై యుండును. వానిఁ దెలిసి నడిచినవాఁడె పోఁ బుణ్య పురుషుఁడు.'

ధర్మవ్యాధుఁడిట్లు ధర్మముల బోధింపఁ గౌశికుఁడు మిగుల సంతుష్టుఁడై, ఆతనిఁ బెక్కువిధముల స్తుతించి, 'ప్రాజ్ఞుఁడా! నీకిట్టి పరమజ్ఞాన మలవడుటకు ముఖ్యమైన కారణమేమో యానతీయవలయు' అని కోరెను. అపుడాబోయ కౌశికుని నభ్యంతర మందిరమునకుఁ దోడ్కొనిపోయి, వెల లేని సౌఖ్యములతోఁగూడి నిత్యసంతుష్టులై యాసనములందుఁ గూర్చుండియున్న తన జననీజనకులఁ జూపి యిట్లనియె.

"వీరు నా తల్లిదండ్రులు. వీరిసేవచేతనే నేనిట్టిజ్ఞానము నొందఁగల్గితిని. అందఱు దేవతలకుఁ బూజలు సలుపుదురు. నేనో! ఇతరదైవము నొల్లక, వీరె సకలదైవతములను తలంపుతోఁ బత్రపుష్పములు, గంధ మాల్యాంబరములు, భక్ష్య భోజ్యాదులు, మొదలగువాని వీరికెపుడు నివేదింతును. ఆలుబిడ్డలతోఁగూడి యెల్లపుడు సంతసముతో నేమఱక వీరిసేవలు చేయుచుందును. వేదములు, తపములు, యజ్ఞములు, వ్రత

ములు, సర్వము నాకీ మహనీయులే.''

కౌశికుఁడు ధర్మవ్యాధుని పలుకు లాలించి, తాను ముదుసలులైన తల్లిదండ్రులసేవ విడిచి వచ్చినందుకు మిక్కిలి చింతించి, అతనితో ''మహాత్మా! నీసహవాసమున నేను ధన్యుఁడనైతిని. నీవలె నేనును దల్లిదండ్రుల సేవించి కృతార్థుఁడ నయ్యెదను. నాకు సెలవిమ్ము,' అనినుడివి చూాతనివీడ్కొని, తన నివాసమునకుఁ బోయి, వృద్ధులైన జననీజనకులకు నత్యంత భక్తితో సపర్యలుచేసి, ఉత్తమోత్తమగతిఁ జెందెను.

కనుక, నెంతతక్కువకులమునందుఁ బుట్టినవాఁడైనను తాను జేయఁదగిన కార్యముల నిర్వర్తించుచు, మంచినడవడితో మెలఁగునేని, ఆతఁ డంగటిలో మిన్నయై నెగడును.

ఆ॥ పూజకన్న నెంచ బుద్ధి నిదానంబు,
మాటకన్న నెంచ మనసు దృఢము,
కులముకన్న మిగుల గుణమె ప్రధానంబు,
విశ్వదాభిరామ వినుర వేమ.

తా॥ పూజకంటె బుద్ధియు, మాటకంటె మనసును ముఖ్యములైనట్లు, కులముకంటె గుణమే ముఖ్యమైనది. ఎట్టికులమునందుఁ బుట్టినను మంచిగుణములు గలవాఁడయ్యెనేని పూజింపఁ దగినవాఁడే యగును.

# 6. సత్కీర్తియే సద్గతికి మూలము.

గీ॥ అవని సత్కీర్తి యెందాక నతిశయిల్లు,
పురుషుఁడందాక సుఖియించుఁ బరమునందుఁ
బుడమి కేతెంచియును బూర్వపుణ్య మెఱిఁగి,
మరలఁ జనఁడె యింద్రద్యుమ్నుఁ డరయ దివికి?

ఇంద్రద్యుమ్న చరిత్రము.

తొల్లి యింద్రద్యుమ్నుఁ డనెడిరాజు కీర్తికాయుఁడై స్వర్గమున బహుకాలముదాఁక సకలైశ్వర్యముల ననుభవించుచుండె. అట్లుండ నాతనికీర్తి భూలోకమునఁ గ్రమముగ మఱపునకు వచ్చెను. అపుడు దేవత లాతనిఁ జూచి, 'నీవింక నిచటనుండఁ దగవు. నీ కీర్తిని మర్త్యలోకమున స్మరించు వారగపడరు.' అని చెప్పి యాతని భూమికిఁ ద్రోచిరి. అంత నా రాజు ఖిన్నుఁడై, చిరంజీవియైన మార్కండేయమునియొద్దకుఁ బోయి, నమస్కరించి 'మునిపుంగవా! ప్రసిద్ధ పుణ్యశాలినై, 'ఇంద్రద్యుమ్నుఁడు' అను పేరుగల నన్ను నీవెఱుఁగవా ?'అని ప్రశ్నించెను.

ఆ మునివరుఁడు 'నేను నిన్నెఱుఁగఁజాల. హిమాచల శిఖరమున 'ప్రావారకర్ణుఁడు' అను పేరుగల యొకగూబకలదు. అది నాకంటెఁబెద్ద. కనుక నా గూబ నిన్నెఱిఁగి యుండును' అని చెప్పెను. పిదప నారాజామునిని గూడఁ దనతోరమ్మని ప్రార్థించి, ఆతనిఁ దనమూఁపున వహియించి యా యులూ

కము పాలికరిగి, మునినడిగినట్లే దానినిగూడ నడిగెను. అది కొంతసేపు విచారించి, 'నేనునిన్ను స్పష్టముగ నెఱుఁగఁజాలకున్నదాన. ఇంద్రద్యుమ్న మను కొలనియందు 'నాళీకజంఘుఁడు' అనుపేరుగల యొకకొంగ కలదు. అది నాకంటె నెంతయో పెద్ద. నిన్నది తప్పక యెఱిఁగియుండవచ్చును' అని నుడివెను. అంత నారాజు ఆ ఘూకమునుగూడఁ దనతో రమ్మని కోరి, దానిని గూడ మోఁచికొని నాళీకజంఘునొద్దకుఁ జని, తనపేరుచెప్పి 'నన్నెఱుఁగుదువే?' అని యడిగెను. అదియుఁ గొంతవడి విచారించి, 'నేను నిన్నెఱుఁగుదునని దృఢముగఁ జెప్పఁజాల. చిరకాలజీవి యగు అకూపారుఁడను కూర్మము నాకంటె నెంతయో పెద్ద. అదియు నీకొలనియందె వాసముచేయుచున్నది. దాని నడిగిన నీవృత్తాంతము స్పష్టమగును. అడిగెదము రమ్ము' అని నుడివి, ఆ తాబేలున్న చోటునకు వారిని దోడ్కొనిపోయి, 'మిత్రమా! ఈ పూజ్యులు నిన్నొకసందేహ మడిగి తెలిసికొనఁగోరి వచ్చియున్నారు. నీవు దయచేసి వెలుపలికి రావలయు' అనెను.

అపుడా కూర్మరాజు జలమునుండి వెలికి విచ్చేయ, వారలు 'ఇంద్రద్యుమ్నుఁడనెడి రాజును నీవెఱుఁగుదువా?' అనిరి. అంత నాకచ్ఛపము కొంతసేపు మౌనముఁదాల్చియుండి, పిదప కన్నీరు జొటజొటరాల హీనస్వరముతో నిట్లనియె. 'ఔరా! ఎంతమాటాడితిరి! సుగుణములకు గనియైన యింద్రద్యుమ్ను నే నెఱుంగనా? ఆ మహానుభావుఁడీకొలనియందుండు నన్ను నెన్నియో కష్టములనుండి దయ

తోఁ గాపాడెను. అట్టి పుణ్యాత్ముని నెన్నండేని మఱువ నగునా? ఆ మహాత్ముఁడు బహువిధములైన యాగములుచేసి, అందు బ్రాహ్మణబృందములకొసఁగిన గో సహస్రముల గొరిజలచేత నేకదా మొదట నీ సరస్సేర్పడినది.'

ఆ కూర్మరాజట్లు చెప్పినతోడనే, దేవదూతలు విమానమునుగొని యారాజునొద్దకు వచ్చి 'మహాత్మా! నీకీర్తి భూలోకమున సుస్థిరముగ నిలిచినది. నీకు స్వర్గవాసమును శాశ్వతమయ్యె, కనుక, ఈ విమానము నధిరోహింపుము.' అని వాక్రుచ్చిరి. అపుడారాజు, 'ఈ వృద్ధతాపసుని, ఈ వృద్ధవిహగమును, కార్యార్థ మిచ్చోటికిఁ దీసికొనివచ్చితినిగదా! వీరిని స్వస్థానములఁ జేర్చివచ్చుదాఁక దయతో సలువుఁడు' అని వేఁడికొని వారియనుమతి నొంది, ఆ మునిని నా గూబను నెప్పటి నెలవులఁ బెట్టివచ్చి, విమానారూఢుఁడయి మరల దేవలోకమునకుఁ బోయెను.

కనుక, భూలోకమున నెంతకాలము సత్కీర్తి ప్రసిద్ధముగ నుండునో, అంతకాలమును నరుఁడు పుణ్యలోకముల వాసముచేయును. అదికారణముగా మానవుఁడు తనకీర్తి లోకమున శాశ్వతముగనుండుటకై తగిన సత్కార్యములను సలుపుచుండవలయును.

క॥ ఇల కీర్తి యెంతకాలము
గలిగి ప్రవర్తిల్లు; నంతకాలంబును ని
త్యులుగారె కీర్తిగల పు
ణ్యులు? కీర్తివిహీనుఁ డెందునుం బూజ్యుండే?

# 7. గురువు లేక విద్యగుఱుతుగాదొరకదు.

---

గీ॥ గురువునే దైవముఁగ నెంచి కూర్మితోడ
నభ్యసించిన విద్యయె యతిశయిల్లు,
వేఱువిధమునఁ బొందిన విద్యలెల్ల,
అల యవక్రీతునకుఁ బోలెఁ గలఁతఁబెట్టు.

కూర్మితోడన్ = ప్రీతితో, అతిశయిల్లున్ = వృద్ధిఁబొందును. కలఁతఁబెట్టున్ = దుఃఖమును గలిగించు.

### యవక్రీతచరిత్రము.

పూర్వము రైభ్యుఁడు భరద్వాజుఁడు అను నిరువురు మునులు పరస్పరస్నేహముతో నొకవనములో వాసముచేయుచుఁ దపస్సు చేసికొనుచుండిరి. అందు రైభ్యునకు అర్వావసువు, పరావసువు, అను నిరువురు పుత్త్రులును, భరద్వాజునకు 'యవక్రీతుఁడు' అను నొకపుత్త్రుఁడును నుండిరి. సకలశాస్త్రములనేర్చి ప్రసిద్ధికెక్కిన రైభ్యునిపుత్త్రులను జూచి, విద్యావిహీనుఁడగు యవక్రీతుఁ డసూయాపరుఁడై, 'చదువకయె తపోబలమున వేదశాస్త్రముల సాధించి వన్నెకెక్కెదఁగాక' అని తలఁచి నిష్ఠతోఁ దపము చేయ సాఁగెను.

ఇంద్రుఁడు యవక్రీతునితపస్సును గాంచి సహింపనోపక, అతనికడకేగి 'కుమారా! నీ వేమి యుద్దేశించి యిట్టి తపము చేయుచున్నాఁడవు' అని యడిగిన నాతఁడు తనకోరికను దెలిపెను. అప్పుడు దేవరాజు 'ఓయీ! గురుముఖమున

నభ్యసింపవలసిన విద్యలను దపస్సుచే సాధింపఁ దరమా? ఒకవేళ వేఱువిధమున వచ్చినవిపో, అవి మద మాత్సర్యములఁ గలిగించి, అధోగతిపాలు చేయునని వినలేదో? కనుక విద్యలను సాధింప నీవు పూనినయుపాయ మపాయకరమైనదని తెలియుము' అని చెప్పి వెడలిపోయెను. యవక్రీతుఁడు దేవరాజు మాటలను పాటింపక, ఎప్పటియట్ల తపస్సు చేయుచునే యుండెను. ఎట్లయిన నాతనితపమును వారింపఁ దలఁచిన దేవేంద్రుఁడు, వృద్ధబ్రాహ్మణ రూపమును ధరించి, రక్తమాంసము లుడిగి దుర్బలమైయుండు శరీరముతోడ మరల వచ్చి, యవక్రీతునకు సమీపమున నిసుకపిడికిళ్లతో గంగాప్రవాహమున సేతుబంధనముఁ గావింప నారంభించెను.

మునిపుత్త్రుఁ డాతని కృత్యమునుజూచి నవ్వుచు మనస్సున జాలి పొడమ నా బ్రాహ్మణునితో నిట్లనియె. 'అయ్యా! నీవు శతవృద్ధుఁడవు, మీఁదుమిక్కిలి యశక్తుఁడవును. ఇట్టి యసాధ్యకార్యమును బూని, వ్యర్థముగ నేల శ్రమనొందెదవు? ఈ కార్యమెట్లు కొనసాగునని తలఁచితివి? నామాటవిని యింతటితోనైన నీప్రయత్న ముడుగుము' ఆ మాట కింద్రుఁడు 'నీవలె నేనును గానికార్యమునకుఁ బూనిన యొక మూఢుఁడను' అని నుడివి, నిజరూపమును జూపి, 'వత్సా! ఇంకను నిట్టి నిరర్థకప్రయాసమున కేలఁ బాల్పడెదవు? ఇంతటనైన నీపని విడువుము.' అని బోధించి యంతర్ధానము నొందెను. నిరుత్సాహకరములగు నింద్రుని వచనముల నాలించియు, యవక్రీతుఁడు తనపట్టును విడువక, తపస్సుచేయుచున్నె

యుండెను. ఆవలఁ గొంతకాలమునకు దేవరాజాతని మనో
నిశ్చయమునకు సంతసించి ప్రత్యక్షమై యాతనికోరికను నెఱ
వేర్చిపోయెను.

అంత యవక్రీతుఁడు సంతృప్తుఁడై నిజనివాసమునకుఁ
బోయి, తనవృత్తాంతమును గర్వముతోఁదండ్రి కెఱిఁగించెను.
భరద్వాజుఁడు పుత్త్రుని విద్యాప్రావీణ్యమున కంతరంగమున
సంతసించియు, అతని గర్వమును జూచి సహింప నోపక,
హిత ముపదేశింపఁ దలఁచి యతనితో నిట్లనియె.

'కుమారా! గర్వమెట్టివానికేని విపత్తును గలుగఁ
జేయు. పూర్వము 'బాలిధి' అనునొక మునివరుఁడు ఘోర
తపస్సుచేసి, చిరంజీవియైన యొకపుత్త్రుని బడసెను. ఆ కుమా
రుని పేరు మేధావి. ఆ మునిపుత్త్రుఁ డాయుష్యగర్వమున
యుక్తాయుక్త విచారములేక, అందఱ నవమానించుచుండెడి
వాఁడు. ఒకనాఁడు 'ధనుషాక్షుఁడు' అను మునిశ్రేష్ఠునొద్ద
నా మేధావి గర్వించి పలుకఁగా, ఆముని కుపితుఁడై శపించెను.
ఆ శాపముచే నతఁడు కాలధర్మ మొందెను. కనుక, నీవును
గర్వముడిగి వర్తింపుము. మఱియు, కోపనుఁడైన రైభ్యుని
తోడను, అతని పుత్త్రులతోడను, మత్సరము లేనివాఁడవై
మెలఁగుము.'

జనకుని హితోపదేశము నాకర్ణించి, యవక్రీతుఁ డప్ప
టికట్లే చేయుదునని తలయూఁచెను; కాని యతఁడు తననైజ
మును విడువఁజాలఁడయ్యెను. అతఁడొకనాఁడు రైభ్యాశ్రమ
మునకుఁ బోవునప్పటి కామునిశ్రేష్ఠుఁడు కొడుకులతోఁ

గూడ స్నానార్థము నదికిఁ బోయియుండెను. ఆ సమయమున నతని కోడలు 'కృష్ణ' యను నామె వనములోఁ బూలు కోయుచుండెను. యవక్రీతుఁ డామెను జూచి, మోహించి, తనమనోగతము నామె కెఱిఁగించెను. ఆమగువ శాపభీతిచే నప్పటికొడఁబడినట్లు నటించి, తప్పించుకొనిపోయి. నదినుండి తనమామగారు వచ్చినతోడనే యతని కాసమాచారమును దెలిపెను.

రైభ్యుఁడు యవక్రీతుని దుశ్చరితము నాలించినంతనే మండిపడి ప్రతిక్రియఁ జేయఁదలఁచి, అప్పుడే యగ్నిగృహమున కేగి, తనశిరమందలి యొకజటను ద్రెంపి యగ్నియందుంచెను. పిదప నగ్నికుండమునుండి యందకత్తెయగు నొక స్త్రీ యుద్భవించినది. అట్లే మఱియొక జడను ద్రెంపి మరల హోమముఁ జేయ, భయంకరాకారుఁడగు రాక్షసుఁ డొకఁ డుద్భవించె. అట్లుపుట్టిన యిరువురును గేలుమోడ్చి మాకుఁ బనియేమని రైభ్యుని నడుగ, అతఁడు 'మీరుపోయి దురాత్ముఁడైన యవక్రీతునిఁ జంపిరండు' అని యానతిచ్చె.

రైభ్యుని యాజ్ఞాప్రకారమా రక్కసి ముందుగఁబోయి, మంచిమాటలతో యవక్రీతునిచేతనున్న కమండలువును దీసికొనెను. ఉదకపాత్రము లేకపోవుటచే నపవిత్రుఁడైయున్న యాతనిడాసి యారాక్షసుఁడు పట్టుకొనఁబోయెను. అతఁడాక్రోశించుచుఁ బరుగులిడి నిజాశ్రమమును సమీపించెను. ఇంతలో నారక్కసుఁడు శూలముతోఁ బొడిచి యతనిజంపి పోయెను. తరువాతఁ గొంతసేపటికి భరద్వాజుఁడు వనమునుండివచ్చి

పుత్త్రుని మరణవృత్తాంతమును విని దుఃఖితుఁడై, ఆతనికగ్ని సంస్కారము గావించి, పుత్త్రశోకమును బట్టఁజాలక, ఆ యాగ్నియందె తన దేహమును గూడ నుంచెను.

ఇట్లుండ, 'బృహద్ద్యుమ్నుఁడు' అను రాజు యాగమును జేయఁదలంచి, రైభ్యునిపుత్త్రులగు అర్వావసు పరావసువులను ఋత్విజులుగనుండఁగోరెను. వారద్దానికంగీకరించి యాగమును జేయింపఁ గడఁగిరి. ఒకనాఁడు సంజచీకటివేళ పరావసువు యాగశాలనుండి తన యాశ్రమమునకుఁ బోవుచు, పులితోలుకప్పుకొని యెదురుగవచ్చు తనతండ్రియగు రైభ్యుని జూచి శార్దూలమని భ్రమించి, ప్రాణరక్షణార్థము చేతనున్న దుడ్డుకఱ్ఱతో నాతనితలపై మోఁదెను. ఆ దెబ్బచే నా రైభ్యుఁడు మృతుఁడయ్యె.

ఆవల నిజమెఱిఁగి పరావసువు మిగులదుఃఖించి, తండ్రికిఁ బ్రేతకార్యములుదీర్చి, ఆ సమాచారమును దన యన్నకుఁ దెలిపెను. అర్వావసువును దండ్రి మరణమునకై చాలఁ జింతించి, పిమ్మటఁ దన ప్రియసోదరుని బ్రహ్మహత్యాదోషమంటునని వెఱచి, 'వత్సా' నీవీయజ్ఞమును జేయించుచుండుము. నీకుఁగా నేను బ్రహ్మహత్యాదోషమును బోగొట్టఁజాలు వ్రతమును సలిపి శీఘ్రముగ వచ్చెదను.' అని చెప్పి వెడలి పోయెను.

పరావసువు యాగమును జేయించుచుండెను. యజ్ఞము ముగియుసమయములో, అర్వావసువు దీక్షతో బ్రహ్మహత్యా ప్రాయశ్చిత్తములఁ జక్కగ నిర్వర్తించి, మగిడి

యాగశాలకు వచ్చుచుండెను. అపుడు కృతఘ్నుఁడగు పరావసువు తన యాగదక్షిణలో నర్వావసువునకును బంచి పెట్టవలసివచ్చునని తలఁచి, వెంటనే రాజుకడకుఁ బోయి, 'రాజేంద్రా! బ్రహ్మహత్యాదోష భూయిష్ఠుఁడగు మాయన్నను యాగశాలను బ్రవేశింపకుండఁ జేయుఁడు' అని చెప్పెను. అతనిమాట నమ్మి రాజు అర్వావసువును వెడలఁగొట్టించెను.

తనసోదరుఁడు కృతఘ్నుఁడై తనవిషయమునఁ జేసిన యపకారమునకు మనస్సున నించుకైనఁ గలఁతనొందని యర్వావసునిఁ జూచి, యాగమునకై యేతెంచియున్న దేవతలంతరంగముల సంతసించి, ఆ మునిపుత్త్రునకు సాక్షాత్కరించి, 'కుమారా! నీశాంతమున కెంతేయు మెచ్చితిమి. నీయిష్టము వచ్చిన వరముల నడుగుము, ఇచ్చెదము.' అనిరి. అపుడర్వావసువు దేవతలకు మ్రొక్కి, 'నాతండ్రియు, భరద్వాజుఁడును, అతని పుత్త్రుఁడగుయవక్రీతుఁడును, సజీవులగునట్లు వరమనుగ్రహింపుఁడు.' అని ప్రార్థించెను. దేవతల వరప్రభావమున రైభ్య భరద్వాజ యవక్రీతులు పునర్జీవితులైరి.

ఆ సమయమున యవక్రీతుఁడు దేవతలఁగాంచి, 'మహాత్ములారా! నేను సకలవిద్యల నెఱిఁగి, సర్వవ్రతముల నాచరించియు, రైభ్యునిచేఁ జంపఁబడితినిగదా! నాకంటె రైభ్యున కధికశక్తి గలుగుటకుఁ గారణమేమి?' అని యడిగెను. అపుడు దేవతలు 'మునీ! గురువునే దైవముగ భావించి, శుశ్రూషసలిపి కష్టమున సంపాదించిన విద్యలువీర్యవంతము

లై యొప్పనుగాని, వేఱువిధముగ నార్జించిన విద్యలు నిర్వీర్యములై చను. నీవు తపోబలమున విద్యల సాధించితివి గాన, నీవిద్యలు వీర్యశూన్యము లయ్యెను. రైభ్యుఁడు గురువుల యనుగ్రహమున విద్యలనేర్చినవాఁడు కాన, అతఁడట్టి శక్తిమంతుఁడయ్యె'' అని చెప్పి దివమున కరిగిరి.

కనుక, గురుకులవాసముచే నేర్చినవిద్యలే ఫలవంతములగును. గురుసేవ విడిచి, వేఱువిధమున నొందిన విద్యలక్కఱకు రావు. విద్యార్థులకు గురువుకంటె గొప్పదైవము వేఱొండు లేదు.

ఆ॥ గురుని శిక్షలేక గుఱుతెట్లుకల్గు నా
యజునికైన వానియబ్బకైన?
తాళపుఁజెవి లేక తలుపెట్లు లూడును?
విశ్వదాభిరామ వినుర వేమ.

తా॥ గురుని యనుగ్రహములేక బ్రహ్మదేవు నంతటివానికైనను లక్ష్యము సిద్ధింపదు. తాళము చెవిలేక తలుపువచ్చునా? రాదుకదా.

# 8. ఆత్మస్తుతి హానికరము

———

గీ॥ తన్నుఁదాఁ బొగడుకొనుట, తనదు పుణ్య
పదముఁ గూలఁద్రోయుటె యగు మదిఁ దలంప;
ఆత్మ సంస్తుతిచేత యయాతిరాజు
పుణ్యపదమును గోల్పోయి భువిని బడఁడె?

కూలఁద్రోయుట=పడునట్లు త్రోయుట, మదిన్=మనస్సునందు, ఆత్మసంస్తుతి=తన్నుఁ బొగడుకొనుట, కోల్పోయి=పోగొట్టుకొని.

యయాతిచరిత్రము.

పూర్వము 'యయాతి' అను రాజు చిరకాలము రాజ్య పాలన మొనరించి, ముసలితనమునఁ దన కడగొట్టు కొమరుఁడైన పూరుని రాజ్యమున కభిషిక్తుఁ గావించి, తపముచేయ నడవికిఁబోయెను. అచట నాతఁడు వానప్రస్థ మవలంబించి కాయగూరలఁ దినుచుఁ గ్రమముగ జితేంద్రియుఁడై ఘోర తపముచేసి, తనకీర్తి భూమ్యాకాశములునిండ స్వర్గమునకుఁ జని దేవతలు తన్ను సేవించుచుండ మహావైభవముతో నందు వసించుచుండినవాఁడు. ఇట్లు బహుకాలము గడచెను. ఒక నాఁడు దేవరాజు యయాతితో ముచ్చటించుచు, 'రాజర్షి! నీపుత్త్రునకు రాజ్యమొసఁగునపు డేమి బోధించితివి?' అని యడిగెను. అందుకు యయాతి యిట్లు చెప్పెను.

"కుమారా! గంగాయమునలకు నడుమనున్న దేశము నకు నీ వధిపతివి. నీ యన్నదమ్ములు దేశముచివరలకుఁ బ్రభు

వులు. 'దైన్యమునొందుట, రహస్యముగ నితరుల కపకార మొనరించుట, కోపముఁ గలిగియుండుట, కపటముతోనుండుట, మాత్సర్యమును బూనియుండుట,' అనునవి యేరికిఁగాని మేలొనఁగూర్పఁ జాలవు. అట్టి గుణములుగలవారిని బుద్ధిమంతుఁడు దగ్గఱకుఁగూడఁ జేర్పరాదు. మఱియు, తల్లిదండ్రులను గురువులను బెద్దలను మునులను శాంతచిత్తులను, ఒకప్పుడును నవమానింపరాదు. నాలుగు వర్ణములవారిలో మంచి నడవడికగలవాఁడె యందఱకుఁ బూజనీయుఁడని తెలియుము. తనయా! నీయన్నదమ్ము లజ్ఞానులై ధర్మపరులు గాకపోవుట చేతనే దేశముచివరలకుఁ బ్రభువులైరని నీవెఱుంగనిది కాదు. అని బోధించితిని.''

ఇట్లు యయాతిరాజు చెప్పగావిని, దేవరాజు 'రాజర్షి! నీవు సకలధర్మముల నెఱిఁగినవాఁడవు. కనుక, ఇంకను గొన్ని ధర్మముల నుడువుము' అని కోరెను. అంత నారాజు మరల నిట్లు చెప్పఁదొడఁగె.

''కోపముగలవానికంటెఁ గోపములేనివాఁడు మిగుల నధికుఁడు. అట్లె యోర్పులేనివానికంటె నోర్పుగలవాఁడును, అవిద్వాంసునికంటె విద్వాంసుఁడును అధికులు. ఒకరు తన్నుఁ దిట్టుచున్నను బదులు తిట్టరాదు. తిట్టుతినువాని దుఃఖమే తిట్టినవానిని గాల్చివేయునని ధర్మశాస్త్రములు నుడువుచున్నవి. మఱియు, తిట్టుపడినవాఁడు తిట్టినవానిపుణ్యమును నపహరించుననియుఁ బెద్దలనెదరు. ఎవరినిఁగాని కఠినపుమాటలచే నొప్పింపరాదు. నోటినుండి వెలువడిన పరుషవాక్కు

లనెడి బాణములచేఁ గొట్టఁబడినట్టి యయాతియు రేయింబవలు దుఃఖించును. అవి యితరుల మర్మస్థానములయందు తప్పక నాటుకొనును; కాన దెలిసినవారు వానిని నోరులపైఁ బ్రయోగింపరు. మఱియు, తక్కువవానివలన నెక్కువ పుచ్చుకొనుటయు మిగులఁ బాపకార్యము. సజ్జనుల నడవడికను బూని వర్తింపవలయు. అట్టివాఁడు రెండులోకములయందును బూజ్యుఁడగును. తనశక్తికొలఁది నితరులకు దాన మొనరించుచుండవలయు.''

ఇట్లు యయాతి ధర్మపద్ధతుల నుడువ నింద్రుఁడు సంతసించి, అతనితో 'రాజా! నీవు సమస్త కర్మములను జేసిన పిదప నే వనమునకుఁ బోయితివి కాదా? నిన్నొకటి యడిగెదను. తపస్సున నీ వెవరికి సాటి వగుదువు?' అందుకు రాజు 'దేవనాథా! దేవతలయందుఁగాని, మానవులయందుఁగాని, గంధర్వులయందుఁగాని, మహర్షులయందుఁగాని, తపమున నాకు సాటియగువాఁ డొక్కఁడును గనఁబడఁడు'' అని చెప్పెను.

ఇంద్రుఁ డామాటల విని యలిగి, 'రాజా! నీకు సమానులైన వారిని నీకంటె నధికులైనవారిని దక్కువవారైన వారిని దెలిసికొనకయే యందఱ నవమానపఱిచితివి. కనుక, నేటితో నీకుఁ బుణ్యలోకములు నశించినవి. నీవిప్పుడే యీలోకమునుండి దిగువఁబడఁగలవు' అనెను. అపుడు యయాతి చింతాకులుఁడై 'భూలోకమున సజ్జనులనడుమ నుండ నన్ననుగ్రహింపుమా!' అని ప్రార్థించెను. ఇంద్రుఁడు

రాజుతో "నీయిష్టప్రకార మట్లే యుండుము. ఆ సజ్జనసాంగ త్యమే మరల శీఘ్రముగ నిన్నుఁ బుణ్యలోకమును బొందింపఁ గలదు. ఇఁకమీఁదటనైన నిజగుణస్తోత్రములచేఁ బూజ్యుల నవమానింపఁ బూనకుము." అని హెచ్చరించెను. పిమ్మట యయాతి దేవరాజు పాలించు పుణ్యలోకమును వీడి దిగువఁ బడియెను.

కనుక, తన్నుఁబొగడుకొనుట, ఇతరుల దూషించుట, అను చెడుగుణములుండినచో, మంచిగుణము లెన్నియున్నను వ్యర్థములేయగును. ఆ రెండు గుణములు గలవాఁడు శ్రేయస్సుల నెన్నటికిని నొందఁజాలఁడు.

గీ॥ తగినవేషంబు, తనుదాన పొగడుకొనమి,
నొచ్చియును గీడుపలుకమి, యిచ్చి వగవ
కునికిఁ, దనకెంత నడువక యున్నఁ బథముఁ
దప్పకుండుట, నడవడి కొప్పుసేయు.

తా॥ తనకులమునకును తనయంతస్తునకును తగినవేషము ధరించుట, తన్నుఁ దాను బొగడుకొనకుండుట, ఇతరు లెంతనొప్పించినను వారికిఁ గీడుకల్గునట్లు తిట్టకుండుట, ఒకరికిచ్చినదానింగూర్చి దుఃఖింపకుండుట, తన కెన్నికష్టములు వచ్చినను న్యాయముదప్పకుండుట అనునవి నడవడికకు నలంకారములు.

# 9. శ్రద్ధ సర్వార్థ దాయకము.

గీ॥ శ్రద్ధ యొక్కటి యుండినఁ జాలు; దాన
సకల కార్యసిద్ధిని నొందఁజాలు నరుఁడు,
పూజయందలి శ్రద్ధచే బోయ యొకఁడు
భార్యతో శివసన్నిధిభాగ్య మొందె.

శబరోపాఖ్యానము.

పూర్వము పాంచాలమను పట్టణమును బరమదయాళుఁడును బరాక్రమోపేతుఁడును నగు 'సింహకేతుఁడు' అను రాజు పాలించుచుండెను. ఆతనికి బలశాలియగు 'దుర్జయుఁడు' అను పుత్త్రుఁడుండెను. ఆ రాజపుత్త్రుఁ డొకనాఁడు విల్లునంబులఁబూని పెక్కండ్రు బోయలు తన్నుఁగొల్చుచుండ నేఁటకై యొకయరణ్యమునకుఁ బోయెను. అచట నాతఁడు సింహశార్దూలాది మృగముల నేయుచు విహరించుసమయమున, ఆతని భటుఁడొకఁడు 'చండకుఁడు' అను నాతఁ డావనమునఁ గలయఁ దిరుగుచు, ఒకచోట పాడుపడిన దేవాలయమగపడ నచటికరిగి గర్భగృహమున శిథిలమైపడియున్న శివలింగమును జూచి, దానిని నాదరముతో నెత్తుకొనివచ్చి రాజపుత్త్రునకుఁ జూపి, 'ప్రభూ! ఈ లింగమునకు నేను బూజ చేయఁదలఁచితిని. ఎట్లు పూజింపవలయునో విశదముగ నానతీయవలయు.' అని వేఁడుకొనెను. దాని కా రాజనందనుఁడు సవిలాసముగ నిట్లనియె.

"ఓరీ! నీవీశివలింగమునకుఁ బూజ సలుపఁ దలఁచితివేని చెప్పెద విను. మొదట సంకల్పమును జెప్పించుకొని స్నానముచేయవలయు. తరువాత నుతికి యారవేసిన వస్త్రమును గట్టుకొని, ఈ శివలింగము నొకపీఠమందుంచి, గంధము, పూలు, అక్షతలు, మొదలగువానిచేఁ బూజచేసి ధూప దీపములనొసఁగి, మనస్సులో శివునిఁ జక్కఁగా ధ్యానముచేసికొని, నీవు భుజింపఁబోవు నాహారమును నైవేద్యము చేయవలయు. ముఖ్యముగఁ బ్రతిదినమును శ్మశానములోని బూదిగను స్వామి కర్పింపవలయుఁ జుమా! అట్లు చేసిననే శివుఁడు సంతుష్టిఁజెంది శీఘ్రముగఁ బ్రత్యక్షమగును."

ఆ బోయ, రాజపుత్త్రిని మాటలను దృఢముగ నమ్మి తనయింటికిఁ బోయి, అదిమొదలు భార్యతోఁగూడ నధిక భక్తితో నీశ్వరారాధనముచేసి చితిభస్మము సమర్పించుచు, పిమ్మటఁ దాను దినఁబోవు నాహారమును నివేదించి తత్ప్రసాదమును శిరముసఁదాల్చి యావల భుజించుచుండెను. ఇట్లు భక్తితాత్పర్యములతో నతఁడా శివలింగమునకుఁ బూజసలుపుచుండ, కొన్నిదినములకుఁ బాత్రలోని చితాభస్మము నయిపోయెను. శబరుఁడు మరల దానిని దీసికొనివచ్చుటకై బయలుదేరి నలుదెసలువెతకి, ఎందును లభ్యపడకపోగా మరలి వచ్చి, పట్టరాని దుఃఖముతో నొకచోట కన్నీరుగార్చుచుఁ గూరుచుండెను. అంత నాతనిభార్యవచ్చి, 'నాథా! ఈదినమేల యిట్లు దుఃఖముతోనుంటిరి? ఇంకను శివపూజ చేయకుండుటకుఁ గారణమేమి? మీమనోగతమును దెలియఁజెప్పఁ

గూడదా?' అని దీనాతిదీనముగాఁ బ్రార్థించెను.

అపుడా శబరుఁడు 'కాంతా! ఏమిచెప్పుదును? ఈ దిన మెంత ప్రయత్నించినను చితాభస్మము దొరకినదికాదు. ఉన్నట్టుండి శివపూజకు గొప్పయాటంకము సంభవించినది. నేనేమిచేయుదును? చితాభస్మము లేక నే శివపూజచేయుదమన్న గురువచనము నతిక్రమించినవాఁడ నగుదును. దానిచేఘోర పాతకము సంభవింపదా? కనుక నేఁడైనసరియే. చితాభస్మము దొరకి శివునిబూజించు నంతవఱకు నేను భుజింపఁ దలఁచు కొనలేదు' అనెను. ఆ మాటల కాతనిభార్య 'నాథా! ఇపుడు నాకొక సదుపాయము తోఁచినది. ఈయిల్లు పెక్కు కొయ్యలతో నిండియున్నదికదా! దీనిని గాల్చి, ఇందు నా శరీరమును దగ్ధముచేసెదను. దానితో మీరు శివపూజచేయ వచ్చును.' అని చెప్పెను.

శబరుఁడు భార్యచెప్పిన మాటల కాశ్చర్యపడి, 'ప్రేయసీ! ధర్మార్థకామమోక్షములకు సాధనమై, సకలభోగముల ననుభవించుటకుఁ దగి, యౌవనమైన నీశరీరమును సంతాన ముఁగూడ లేనిదానవై, యెట్లు విడువఁదలఁచితివి?' అనిన శబరి యిట్లనియె. 'ప్రాణనాథా! పరులకుఁగాఁ దనశరీర మిచ్చిన నెంతయో సుకృతము గలుగునని పెద్దలనెదరు. అట్లుండ నాశరీరమును సాక్షాత్పరమేశ్వరునకే యొసఁగినచోఁ దానిచేఁ గలుగు పుణ్యమింతయని చెప్ప నాబ్రహ్మదేవునకైన సాధ్యమా? నేను బూర్వజన్మమున నెన్నిపుణ్యకార్యముల నొనరించితినో, అడవులలోనుండి యెన్నితపస్సులను జేసితినో, ఎన్ని

తీర్థములను సేవించితినో, ఈజన్మమున నీశ్వర ప్రీత్యర్థము నాశరీరము నర్పింప నోచుకొంటిని.' అని పెక్కుగీతులఁబలికి, ఎట్టకేలకు భర్తను సమ్మతి పఱచెను.

పిమ్మట నాబోయత పసుపు, కుంకుమ, గంధము, పూలు, మొదలగువానిచేఁ జక్కగ నలంకరించుకొని, తన యింటివాకిట నిప్పుదరికొల్పి, మూఁడుప్రదక్షిణములఁ గావించి గురువునకు నమస్కారముచేసి, మహాదేవుని నిశ్చలమనస్సుతో ధ్యానించుచు నిట్లు స్తుతించె. "దేవాదిదేవా! నా యింద్రియములు మంచిపుష్పములు, దేహము వాసనగల ధూపము, నామనస్సు దీపము. పంచప్రాణములును హవిస్సులు. వీనిచే నీకిపుడు జీవితపూజను సలుపఁబోవుచున్నదానను. దయతో గ్రహింపుమా! నాకు సర్వలోకాధిపత్యముగాని, స్వర్గముగాని, బ్రహ్మపదముగాని, పనిలేదు. ఒక్కొక్క జన్మమునందును నీపాదభక్తి నామనస్సులో సుస్థిరముగ నిలిచినఁ జాలును.'

అని ప్రార్థించుచు నాచెంచెత సంతసముతోఁ దన శరీరమును ఆనిప్పునందు దహింపఁజేసెను. శబరుఁడు వెంటనే యాచితాభస్మముఁగొని, తనయింటియెదుటఁ గూరుచుండి, యుల్లాసముతో శంకరునకుఁ బూజసలుపుచుఁ బరవశుఁడై, ప్రసాదము గ్రహించుట కెప్పటియట్ల తనభార్యను బిలిచెను. పిలచినదే తడవుగా నాబోయెత చేతులుజోడించుకొని వచ్చి యెదుట నిలిచినది. అపుడాశబరుఁ డాశ్చర్యమనస్కుఁడై భార్యనుజూచి 'అగ్నిలో బూది గావింపఁబడిన నీవెట్లు నురల

రాఁ గలిగితివి? కాలి మసియైన యీ మనయిల్లు మరల యథాప్రకార మెట్లుండఁ గలిగెను? ఇదంతయు నాకొక్కంటి మహిమగాని వేఱుకాదని తోఁచెడి' అనెను. అప్పుడు బోయత 'నాథా? మీరనినట్లి యిదంతయు నా శంకరుని కృపావిశేషము. నేనట్లు దహింపఁబడి సుఖనిద్రఁజెంది, ప్రసాదమును దీసికొనుటకై మీరు పిలిచినంతనే మెలఁకువ వచ్చి ఇటకేతెంచితిని' అనినది.

ఆవల నా శబర దంపతులు పరమేశ్వరుని మహిమను బహువిధములఁ బొగడుచుండు నవసరమున, వారాశ్చర్యపడునట్లు దివినుండి దేదీప్యమానమగు విమాన మొక్కటి వచ్చెను. అంత నందుండిన రుద్రభటు లాయిరువుర లేవనెత్తి విమానమునందుఁ గూర్చుండఁబెట్టుకొనిరి. రుద్రానుచరుల సంస్పర్శనమున వారు దివ్యదేహములఁ దాల్చి, సకలలోక సేవ్యమైన సదాశివ లోకమును జేరిరి.

కనుక, కులవిద్యా విచారములతోఁ బనిలేకయే యెవరుగాని శ్రద్ధాభక్తులతో నాపరమేశ్వరునిఁ బూజించినచో అనాయాసముగ శాశ్వతసుఖమును నొందవచ్చును. దీనింబట్టి శ్రద్ధయనునది యొక్కటియున్నచో నెట్టివాఁడైన నెట్టికార్యమునైన, సులభముగా సాధింపవచ్చునని తెల్లమయ్యెడి.

క॥ శ్రద్ధయె లోక హితంబగు,
శ్రద్ధయె నిజ జననిపగిది సౌఖ్యములొసఁగుఁ
శ్రద్ధాపరుల నభీష్ట స
మృద్ధులఁగా జేయుచుందు రెల్లసుపర్వుల్॥

# 10. మదముంమించిన మన్ననచెడును.

గీ॥ ముందు గర్వంబునడువ నెప్పుడును దాని
వెనుకనే యవమానంబు చనుచునుండు,
మున్ను, గర్వించియున్న దంభోద్భవుండు
ప్రాఘ్ను నోడింప సమకట్టి భంగపడఁడె?

మున్ను = పూర్వము. ప్రాఘ్నుఁడు = అజ్ఞుఁడు. సమకట్టి = యత్నించి
భంగపడఁడె = అవమానము నొందడా?

దంభోద్భవ చరిత్రము.

పూర్వము మహాబలశాలియగు 'దంభోద్భవుఁడు' అను రాజశ్రేష్ఠుఁ డొకఁడుండెను. అతఁడు శత్రురాజుల నందఱ జయించి, నిష్కంటకముగా రాజ్యపాలనముఁ జేయుచున్న వాఁడయ్యు, యుద్ధాభిలాషమాత్రమాతని విడిచినది కాదు. ఆకోరికయే క్రమముగా నొకవ్యసనమై పరిణమించి, ఆతని మనస్సును సదా వేధింపసాగెను. దానిచే గర్వితుఁడైన యాతఁడగపడినవారినెల్ల నాత్రముతోఁ జేరఁబిల్చి, 'నాతో యుద్ధముఁ జేయఁజాలినశూరుఁ డెవ్వఁడేని గలడా?' అని యడుగుచుండెడివాఁడు. ఇట్లహంకారమునఁ గన్నుగానక, అందఱను బరిభవించు నాదంభోద్భవున కొక్కనాఁడు నారద మునీంద్రుఁడు గనఁబడెను. ఆరాజు వాడుక ప్రకారం మా మునినిగూడ నడిగెను. గర్వితుల గర్వము నెట్లయినఁ బోఁగొట్టఁజూచు నామునివరుఁడు దంభోద్భవునిఁ జూచి యిట్లనియె,

'రాజేంద్రా! స్వర్గ మర్త్య పాతాళముల నెందును నీతో సమానుఁడైన శూరుఁడు గానఁబడఁడు. అయిన నరనారాయణు లను మును లొకవేళ నీకు దీటగుదు రేమో! అని నాకొక సంశయము గలదు. వారిప్పుడు బదరికావనములోఁ దపస్సు చేయుచున్నవారు. ఆ మునులు నీతో యుద్ధముఁ జేయ నిష్టపడి రేని నీకోర్కె కొనసాగును. నా సంశయమును దీఱును.' అని చెప్పి పోయెను.

పిమ్మట నా రాజు తనకు నేఁటికి సమానులతో యుద్ధము చేయ సమయము దొరకినదికదా! అని యుప్పొంగుచు, అప్పుడె బయలుదేరి బదరికావనమును బ్రవేశించి, తపోనిష్ఠలోనున్న యా మునిశ్రేష్ఠులను గొంకులేక యుద్ధమునకుఁ బిలిచెను. అహంకారమున యుక్తాయుక్త విచారణము మాని, తమదాపునకు యుద్ధమును గోరివచ్చిన యా దంభోద్భవుని నరుఁ డలక్ష్యభావముతోఁ జూచుచు, 'రాజా! నీతో యుద్ధము చేయఁదగినవారు క్షత్రియవీరులుగాని, యుద్ధమన నేమో యెఱుఁగక, అడవిలో నొకచోటఁ గూరుచుండి, తపస్సు చేసికొనుచున్న మేమా తగినవారము? కనుక, వచ్చిన త్రోవనే మరలిపొమ్ము!' అని చెప్పెను.

ఆ మునిశ్రేష్ఠుఁ డెన్ని నుడివినను దనపట్టుదలను విడువక, ఆ రాజు వారిని మరల మరల యుద్ధమునకుఁ బిలువఁ జొచ్చెను. అంత నా నరుఁడు కుపితుఁడై దంభోద్భవుని బాణవర్షమున ముంచెను. అతనిచే వేయఁబడిన యొక్కొక్క బాణమును మండుచున్న యగ్నివలె శరీరమును దహింప మొదలిడ,

ఆబాధకోర్వఁజాలక యాతఁడు దైన్యముతో మరల నానగునే శరణుచొచ్చెను. తన్నాశ్రయించినవాఁ డెట్టివాఁడైనను గాపాడఁ గంకణముఁ గట్టుగొనిన నరుఁడు దయాళుఁడై వెంటనే బాణప్రయోగమును మానెను. గర్వముతోఁగూడఁ జిరకాలమునుండి మానసమును బాధించుచున్న యుద్ధాభిలాషయు మొదలంట నశింప, ఆరాజు వంచినతల యెత్తకుండఁ దనపట్టణముఁ జేరెను.

కనుక, గర్వమెట్టివారికేని యవమానమునకే కారణమగుట నిశ్చయము.

క॥ తనకెంత మహిమయుండినఁ
దనకెంతటి భాగ్యమున్న దర్పంబున్నన్
వినయము దగు; గర్వించినఁ
గను నాశము; నాశచిహ్న గర్వంబె సుమీ.

తా॥ తనకెంత సామర్థ్యమున్నను, ఎంత భాగ్యమున్నను, వానికిఁ దగినట్లు అణఁకువ యుండవలయును. అట్లుగాక తానే యెంచుటకంటె గట్టివాఁడనని విఱ్ఱవీగినచోఁ దప్పక నశించు. చెడిపోవుటకు గర్వమే ముఖ్యకారణము.

# 11. కానున్నది కాకమానదు.

గీ॥ విధితలంపని దాసిని వివిధ గతుల
యత్నమొసరించియును నరుఁడరయలేఁడు,
మున్ను నాగార్జునుఁడు తనపూన్కిచేత
సమకూలను జేయఁగలిగెనె యరయ నరుల?

### నాగార్జునుఁడు.

పూర్వము చిరాయువను నగరములో 'చిరాయువు' అనురాజు సార్థకనాముఁడై, సకలసంపదలతోఁ దులఁదూఁగుచుండెను. ఆతనికి నాగార్జునుఁడు అనునొక మంత్రివరుఁడుండెను. ఆ మంత్రి విజ్ఞాననిధియుఁ బరమదయాళువును సకలౌషధి యోగముల మర్మమెఱిఁగినవాఁడునై రసాయనము సాధించి, తన్నుఁ దనరాజును దీర్ఘాయుష్మంతులనుగాఁ జేసికొనెను. అట్లుండఁ గొంతకాలమున కామంత్రిశ్రేష్ఠుని పుత్త్రులలో నతనిమనసున కెక్కినవాఁడు కాలధర్మము నొందెను. దానిచే నతఁడు దుఃఖస్వరూపము ననుభవించినవాఁడై, మనుష్యులకుఁ జావనునది లేకుండఁ జేయ సంకల్పించి, తపస్సు, దానము, ఓషధులు, మొదలగువాని ప్రభావముచే నమృతమును జేయ సమకట్టెను. సర్వము సిద్ధమైనది. ఇఁక నందుఁ జేర్పఁదగినది యొకమూలికమాత్రమే. దానిని జేర్చుటకుఁ దగిన కాలమును నిరీక్షించుచుండెను.

ఇంతలో నీవృత్తాంతము దేవనాథుని చెవినిబడెను.

అతఁడు వ్యాకులమనస్కుఁడై, అశ్వినీదేవతలను రావించి వారి
తో నిట్లనియె. "మీరు భూలోకమునకుఁ బోయి, నాగార్జును
నితో నామాటలుగ నిట్లు చెప్పుఁడు. 'ఆర్యా! నీవు యుక్తా
యుక్తములఁ దెలిసినమంత్రివరుఁడవు కదా! అట్టినీవే బ్రహ్మ
సృష్టికి విరుద్ధముగ నిట్టియత్నమును జేయఁ జనునా? జరా
మరణములతోఁ గూడినవారినిఁగ మనుజులను బ్రహ్మసృష్టించి
యుండ, నీవమృతమును సాధించి, వారిని నమరులనుగఁ
జేయఁ జూచుచున్నాఁడవు. అట్లయిన దేవతలకును, మాన
వులకును, వ్యత్యాసమేమి యుండును? అదియుఁగాక, దానిచే
లోకమునకుఁ బాటిల్లు కష్టనష్టములఁగూర్చి యించుకైన
విచారించితివా? కనుక, దూరమాలోచించి నీప్రయత్నము
ను మానుము. మానవేని దేవతలు కుపితులై నిన్ను శపిం
తురు. ఏ పుత్త్రుని శోకకారణమున నీవీ ప్రయత్నమున
కారంభించితివో, ఆ నీపుత్త్రుఁడు స్వర్గమున సుఖముగ నున్న
వాఁడు. అని"

అశ్వినీదేవతలు వెంటనే భూలోకమునకువచ్చి, నాగార్జు
నునితో దేవనాథుని మాటలనట్లే విన్నవించిరి. అంతట
నతఁడు దుఃఖితుఁడై 'ఇంద్రాజ్ఞను పాలింపనేని యాతఁడు
నన్ను శపింపక విడువఁడు. అతనిదాఁకఁబోనేల? ఈ యశ్వి
దేవతలే నన్ను శపింపఁ గూడదా? నాపుత్త్రుఁడు పూర్వపుణ్య
మునఁ జేసి స్వర్గమున సుఖముగ నున్నాఁడఁట. ఇఁక వానికై
చింతింపనేల?' అని యాలోచించి, వారితో 'నేను దేవేం
ద్రుని యాజ్ఞను తలఁదాల్చితిని. ఇంతటితో నమృతప్రయత్న

మును మానుదును' అనిచెప్పి, వారియిష్టప్రకారము సిద్ధ ప్రాయమైయున్న యాయమృతమును నేలఁ బాఁతిపెట్టెను. అశ్వీదేవత లాతని బహూకరించి, స్వర్గమునకుఁబోయి దేవ రాజున కావృత్తాంతమును జెప్ప నాతఁడు సంతసించెను.

ఆవలఁ గొంతకాలమునకుఁ జిరాయువు తనపుత్త్రుఁ డగు జీవహారుని యౌవరాజ్య పట్టాభిషిక్తుని గావించె. అభి షిక్తుఁడైన యారాజపుత్త్రుఁడు సంబరముతో వచ్చి తల్లికి నమస్కరించెను. ఆమె 'తనయా! ఏలసంతోషపడియెదవు? ఈ యౌవరాజ్యము రాజ్యప్రాప్తికొక మెట్టనికదా నీవుకొని సంతసించుట. అట్టి రాజ్యప్రాప్తిగా లేనప్పుడు దీనితోఁ బ్రయోజనమేమి? ఇప్పటికి నీయట్టియువరాజు లెందఱో గతించిరి. ఒకఁడైనను రాజ్యమొందినవాఁడు గనఁబడఁడు. నాగార్జునుఁడిచ్చిన రసాయన ప్రభావమున నీతండ్రి యిప్ప టికి నెనమన్నూఱు వత్సరములు బ్రతికియున్నవాఁడు. ఇంక నెందఱి యువరాజులను జేయునో యెవరికిఁ దెలియును? నీకు రాజ్యము వలయునన్న నేఁజెప్పిన యుపాయమును జేయుము. నాగార్జునుఁడు ప్రతిదినమును భోజనసమయమందు దాన మిచ్చువాఁడై 'ఎవరికేమికావలయును?' అని ఘోషించును. ఆ సమయమును గనిపెట్టియుండి, నీవతనితో 'నీతలనిమ్ము' అని యడుగుము. సత్యసంధుఁడగు నతఁడు తప్పక తనతలను నతనికి నిచ్చును. మంత్రిమ్రుతుఁడైనచో నీతండ్రి చావనైనఁ జచ్చును. లేదా! అడవికైనఁ బోవును. తరువాత నీవు రాజ్యము నేలవచ్చును. అని యుపదేశించెను.

తల్లి చేసిన దుర్బోధము తలకెక్కఁగా, ఆజీవహారుఁడు తన పేరును సార్థకముఁగావింపఁ దలఁచినవాఁడుపోలె నట్లుచేయ నిశ్చయించుకొని, మఱునాఁడే భోజనసమయమునకు నాగార్జునుని యింటికిఁ బోయి కాచుకొనియుండి, 'ఎవరికేమి కావలయు?' అని యాతఁడడిగినతోడనే 'నీతల నిమ్ము' అని యడిగెను. మంత్రిశ్రేష్ఠుఁ డాశ్చర్యపడి 'కుమారా! మాంసాస్థిమయమైన నాతలతో నీకయ్యెడు ప్రయోజనమేమి? అట్లయినను నీకు ముఖ్యముగ వలయునేని, ఇదే కోసి తీసికొనిపొమ్ము' అని మెడను జాఁచెను. రసాయనపానముచే దృఢమైన యానాగార్జునుని మెడ నారాజపుత్రుఁడు నఱుకుటకు మొదలిడ నెన్నియో కత్తులు విఱిగిపోయెను. ఇట్లుండ రాజు ఈవృత్తాంతమును విని, వేగముగ నచ్చటికివచ్చి యాయకార్యమునుండి జీవహారుని మరల్ప యత్నించెను; కాని మంత్రి రాజునునట్లు చేయనీయక, 'రాజా! నాకుఁ బూర్వజన్మస్మృతి కలదు. నేనిదివఱకు తొంబదితొమ్మిది జన్మమునందును మాఱులు నాతలను ఖండించి యిచ్చియున్నాఁడను. ఇది నూఱవ శిరోదానము. నన్ను యాచించినవాఁడు వ్యర్థముగఁ బోఁగూడదు. నీదర్శనమునకుఁగా నింతదనుక నాలస్యము చేసితిని.' అని చెప్పి యాతనిఁ గౌఁగిలించుకొని, పిమ్మట నొక చూర్ణమును దెచ్చి రాజపుత్రుని కత్తికిఁబూసి నఱుకుమనియె. అతఁడట్లు చేయ క్షణములోఁ దలతెగి క్రిందబడియెను.

మంత్రి మరణమునుజూచి, రాజు ప్రాణత్యాగముచేయ సంసిద్ధుఁడయ్యె. అపుడు 'రాజా! సాహసింపకుము. నీచెలి

కాఁడు దుఃఖింపఁ దగినవాఁడు కాఁడు. అతఁడింతటితో జన్మ రాహిత్యము నొందెను.' అని యశరీరవాణి వినఁబడెను. ఆ మాటవిని రాజు మరణసన్నాహమును మానినను, రాజ్య పాలనము సేయనొల్లక వనమునకుఁ బోయి యచటఁ జిరకాలము నిష్ఠతోఁ దపముచేసి మోక్షము నొందెను. తండ్రి వనమునకుఁబోయినతోడనే తన యిష్టప్రకారము జీవహారుఁడు రాజ్యమును బొందెను; కాని కొన్నిదినములకే నాగార్జునుని పుత్త్రిలు పగఁబూని యతనిం జంపిరి. పుత్త్రి శోకమున నతని తల్లియు వెంటనేగుండెపగిలి చచ్చెను. తరు వాత మంత్రులు మఱియొక రాజపుత్త్రుని రాజునుగఁ జేసిరి.

చూచితిరా! నాగార్జునుని తీవ్రప్రయత్నమేవిధముగఁ బరిణమించినదో! ఎట్టివాఁడుగాని విధి విధానమును దప్పింప నేరఁడు. ఎవరెన్ని యత్నములు గావించినను, కానున్నది కాకమానదు.

ఆ॥ కాఁగల పనులెల్లఁ గాకెట్లు పోవును ?
కానిపనులు భువిని గానె కావు,
మహిమ వేఱెయుండ మనతోడ నున్నదా ?
విశ్వదాభిరామ వినుర వేమ.

తా॥ దైవబలమునకు మాఱెచ్చటను లేదు. దైవము సంకల్పించి నదియే కొనసాగును గాని, ఇతర మెన్నడును గానేరదు. కాఁబట్టి కార్య ఫలము మనవశము గాదని తెలియునది.

# దైవబలమే బలము.

ఆ॥ బుద్ధిహీనుఁ డయ్యుఁ బూజ్యతఁ గనవచ్చు
దైవబలము మిగులఁ దనరెనేని,
మూఢ విప్రుఁ డొకఁడు పూజ్యుఁడై నెగడఁడా?
దైవ బలముచేత ధరణి మున్ను.

తనరెనేని=ఒప్పెనేని - నెగడఁడా=వర్ధిల్లఁడా? ధరణిన్=భూమియందు.

—❀ హరిశర్మ చరిత్రము. ❀—

పూర్వము 'హరిశర్మ' అనునొక బ్రాహ్మణుఁ డుండెను. అతఁడు దరిద్రుఁడును, విద్యాగంధము లేనివాఁడును, బహుకుటుంబియు నై యుండెను. ఆతఁడు సకుటుంబముగ బయలుదేరి భిక్ష మెత్తుకొనుచు నొక పట్టణమునకుఁ జేరి, అచట ధనవంతుఁడగు 'స్థూలదత్తుఁడు' అను గృహస్థుని నాశ్రయించి జీవించుచుండెను. ఇట్లుండ నా స్థూలదత్తుని కొమారితెకు వివాహముహూర్తము నిశ్చయించిరి. పెండ్లిలో నైదు దినములు యథేష్టముగ భక్ష్యభోజ్యముల నాప్యాయనముగా మెక్కవచ్చునుగదా! యని యా బ్రాహ్మణుఁ డది మొదలు లువ్విళ్ళూరుచుండెను. ఇంతలో ముహూర్తదినము వచ్చినది. పెండ్లివారు మహావైభవముతోఁ దరలివచ్చిరి. మన హరిశర్మ తొలిబువ్వమునకుఁ జేసిన పిండివంటలను దలఁచితలఁచి, నిమిషమొక యుగముగ గడపుచు సమయమును నిరీక్షించుచుండెను. కాని; ఆనాఁడీ బ్రాహ్మణుని దలఁచినవాఁడొక్కఁడును

లేరు. పిలువని పేరంటమునకుఁ బోవుట యతని కెంతమాత్ర మిష్టము లేదు. పాపమతఁడు మిగుల ఖిన్నుఁడై నిరాశ చేసికొని యేకాంతమున భార్యతో నిట్లనియె.

'దారిద్ర్యము, పై పెట్టు చదువు లేకపోవుట, అను కారణములచే నేఁడు నాకీ యమర్యాద జరిగినది. అయిన నేమాయె? ఏదో విధముగా గట్టివాఁడననిపించుకొని, ఈ స్థూలదత్తునివలననే గౌరవము నొందెదఁగాక. నీవు సమయము తెలిసి యతనితో 'నాభర్త మహాజ్ఞాని' యనిమాత్రము నచ్చఁ బలుకుము.' అని చెప్పి ఆ హరిశర్మ కొంతసేపు తనకర్తవ్యమును గూర్చి యాలోచించి, అందఱును నిద్రించిన పిమ్మట నాదినము అల్లుఁడెక్కివచ్చిన గుఱ్ఱమును దోలుకొనిపోయి యొక చోట దాఁచెను. తెల్లవాఱఁగనే పెండ్లికొడుకువారు గుఱ్ఱమగపడలేదని తహతహపడసాగిరి. వెదకవలసిన చోటులన్నియు వెతకి వేసారి, అమంగళమునకుఁగా విచారింపఁగడఁగిరి.

స్థూలదత్తుఁ డెట్లయిన గుఱ్ఱపుదొంగను సాధించి, తన మర్యాదను నిలుపుకొనవలయునని, సర్వవిధములఁ బాటుపడుచుండెను. ఆ సమయమున హరిశర్మభార్య 'అయ్యా! నా భర్త జోస్యము చెప్పుటలోఁ జాలప్రసిద్ధి నొందినవాఁడు. ఆయనను నడిగి తెలిసికొనరాదా?' అనెను. అతఁడు వెంటనే హరిశర్మను బిలిపించి, గుఱ్ఱముపోఁబడి చెప్పవలసినదని యడిగెను. అప్పుడు హరిశర్మ 'నిన్నటి భోజనపువేళ నేను జ్ఞప్తికి రాకపోయినను, గుఱ్ఱమగపడక పోగానైన స్మృతికి వచ్చినం

డులకుఁ జాలసంతోషము.' అని యెత్తిపొడిచి, వారు 'మా పొరపాటును క్షమింపుఁడు.' అని ప్రార్థించుచుండ, నేల నడ్డదిడ్డముగఁ గొన్నిగీతలుగీచి, మిన్నువంకఁ జూడఁజూచుచు వ్రేళులలెక్కపెట్టి, 'ఈగ్రామమునకు దక్షిణపువైపునఁ బొలిమేరదగ్గఱ దొంగలు గుఱ్ఱమును గట్టివేసియున్నారు. ఆలస్యముచేయక పోయి తెచ్చుకొనుఁడు.' అని చెప్పెను. వెంటనే వారచటికిఁబోయి, కట్టియున్న గుఱ్ఱమును దోలుకొని వచ్చిరి. అందఱును హరిశర్మజ్ఞానమునుగూర్చి వేనోళ్లఁ బొగడిరి. అదిమొదల యెల్లరచేత గౌరవింపఁబడుచు నతఁడు సుఖముగా జీవనముచేయుచుండెను.

తరువాతఁ గొన్నిదినములకు రాజగృహము నందలి ధనము నెవరో దొంగలించిరి. ఎంతయత్నించినను రక్షకభటులకు దొంగలను బట్టుకొనుట సాధ్యము గాకపోయెను. అంత రాజు జ్యోతిశ్శాస్త్రమునఁ బ్రసిద్ధికెక్కియున్న హరిశర్మను బిలిపించి శకునమడిగెను. హరిశర్మయు నాముప్పుఁ దప్పించుకొనఁ దలంచి, 'రేపువచ్చి చెప్పెద' నని విన్నవించెను. 'అట్లయిన నీవు రేపటివఱకిచటనే యుండవలయు' నని చెప్పి, ఆరాజాతని నొకగదియందుఁ బ్రవేశపెట్టించె.

రాచనగరులో నుండు 'జిహ్వ' అను నొకదాసియు, దానియన్నయు, ఆధనమును దొంగిలించియుండిరి. కనుక, జిహ్వ, హరిశర్మ విజ్ఞానమునుగూర్చి యిదివఱలోనే వినియున్నది గాన భయపడి, అందఱును నిద్రించినపిదప హరిశర్మయుండు గది దగ్గఱకుఁబోయి, ఆతనిమాటలను వినుటకుఁ బొంచి

యుండెను. ఆసమయముననే హరిశర్మ తనకు రానున్న కష్టములఁ దలంచి చింతించుచు, లేనివిజ్ఞానమును జెప్పుకొన్న తననాలుకను దేశించి, "ఓసీ! పాపి జిహ్వా! తిండికాశించి, ఎంతపనిచేసితివే! రానిదాని కాశపడి లేనిదిచెప్పుకొని నీకునీవే యురిదెచ్చుకొంటివి కదే! నీవొనరించిన దుష్కార్యమునకుఁ దగినఫలము నేఁడే యనుభవింతువులే." అని నిందించుకొనుచుండెను.

ఆసమయమున వాకిటనున్న జిహ్వ యామాటవిని అతఁడు తన్నుగుర్తించినాఁడని నిశ్చయించి, మెల్లగ నతని కడకుఁబోయి పాదములపైఁబడి, 'స్వామీ! దీనురాలను నన్ను రక్షింపుము. మీరుగనిపెట్టిన దొంగను జిహ్వను నేనే. ఆ ధనము ఈయింటికి వెనుకపార్శ్వముననుండు తోటలోఁ బాఁతి పెట్టియున్నదానను. నాచేతనున్న యీ స్వల్పబంగారము నిదే మీరే గ్రహింపుఁడు' అని వేఁడికొనెను. అంతట హరిశర్మ లోలోన సంతసించుచు బెట్టువదలక 'ఓసీ! నన్ను సామాన్యుఁడని తలఁచితివా? నే నీయూరనుండునది నీకుఁ దెలియదా? భూత భవిష్యత్తులఁ జెప్పఁగలవాఁడనని విన లేదా? ఇంకనైన బుద్ధిగలిగియుండుము. పాపమని యీపర్యాయము నిన్ను వదలి పెట్టఁదలఁచుకొన్నాను. నీచేతనున్న బంగారము నిక్కడనే యుంచి, తిరిగిచూడకుండ మఱిపొమ్ము.' అని పలికెను. ఆ దాసియు నట్లుచేసి వెడలిపోయెను.

అంత హరిశర్మ దైవబలమున్న నెట్టికష్టమునైన ననాయాసముగ దాఁటవచ్చునని తలఁచుచు నారాత్రిగడపి, మఱునాఁడు తెల్లవాఱఁగనే తనవిజ్ఞానమును నటించుచు, ఆరాజును

ఉద్యానమునకు వెంటఁబెట్టుకొనిపోయి యొకచోటుఁ జూపి 'ఇచటఁ ద్రవ్వింపుఁడు. మీధనము దొరకును. కాని కొంత ధనముమాత్రము దొంగలు దీసికొనిపోయియున్నారు.' అని చెప్పెను. రాజచటఁ ద్రవ్వించి హరిశర్మ చెప్పినవిధముననుండుటనుజూచి, పరమానందమొంది, అతనికిఁ గొన్నిగ్రామముల నీయఁగలఁచెను.

అంతలో మంత్రి 'ప్రభూ! శాస్త్రపరిచయ మేమాత్రము నీబ్రాహ్మణునకు లేనట్లు తోఁచుచున్నది. అట్లుండ నీతఁడిట్లు చెప్పుటచూడ వింతగనున్నది. ఒకవేళ నితని కాదొంగలతో సంబంధము గలదేమో! అనియు సంశయమయ్యెడి. కనుక వారముదినములవఱ కీతని నిచటనేయుండ నియమించి, మఱొక పరీక్షచేసి బహుమానమిచ్చుట మంచిది. ఆవల దేవరవారిచిత్తము.' అని రహస్యముగఁ బలికెను.

రాజందుల కంగీకరించి, మఱునాఁడె యొకమిడుతను గుప్పిటిలోఁ బెట్టుకొని, హరిశర్మను బిలిపించి, 'ఆర్యా! ఈ చేతిలో నేమున్నదో చెప్పితిరేని మీకు గొప్పబహుమానము చేసెదను' అనెను. ఆ మాట వినినతోడనే హరిశర్మకు శరీరము చల్లఁబడియెను. పాపమతఁడు లోలోన [illegible]చుచు, తాను జిన్నతనములోఁ జదువుకొనక పోయినందులకుఁ దగిన ఫలమిప్పుడే యనుభవింపఁ బోవుచున్నానని తలపోయుచు, బాల్యమున నిల్లుపట్టకుండఁ దిరుగుచుండ, తనతండ్రి కోపముతోఁ బిలుచు 'మిడుతంభొట్లు' అను పేరు స్మృతికిరా, పరవశుఁడై గట్టిగా 'చిక్కెరా మిడుతంభొట్లు' అనెను. ఆ మాట

వినినతోడనే రాజబ్బురపడి చేతిలోనున్న మిడుతను వదలి, హరిశర్మకుఁ గొన్ని గ్రామములు బహుమతిగ నిచ్చుటయేగాక, పెక్కు వస్తువాహనములఁగూడ నొసఁగి గౌరవించెను. దానిచే హరిశర్మ గొప్ప శ్రీమంతుఁడాయెను.

కనుక, దైవానుకూలముండినచో నెట్టికష్టములనైన సులభముగ దాఁటి, శుభములఁబొందవచ్చును.

తే॥ సారమతిఁ బరికింపంగఁ బౌరుషంబు
కంటె దైవంబు ముఖ్యంబు, కార్యసిద్ధి
కెచట నేనియుఁ బౌరుష మొసక మొసఁగ
నేసి నది దైవదత్తంబ; యింతనిజము॥

సారమతిన్ = మంచి తలంపుతో, పరికింపంగన్ = ఆలోచింపఁగా, ఒసఁక మొసఁగ నేని - మీఱి యిచ్చేని దైవదత్తము = దైవముచేత నీయఁబడినది.

తా॥ చక్కఁగా విచారించినచోఁ బురుషప్రయత్నమునకంటె దైవమే బలవత్తరమైనది. కార్యసిద్ధి పౌరుషముచే నైనట్లు గనఁబడినను, అది యు దైవముచేతనే యాయినదని తలంపఁజను.

# 13. అపకారి కుపకరించుటయే యాధిక్యము.

---

గీ॥ పూని యుపకార మొనరించు వాని కేని
భక్తి నుపకారమే చేయువాఁడు ఘనుఁడు,
మున్ను పావుర మొక్కటి బోయవాని
కొనరమేల్చేసి సద్గతి నొందెఁ గాదె?

### —మృగయుఁడు కపోతములు.—

పూర్వ మొకబోయ పక్షులనుజంపి, వానిలోఁ గొన్నింటిసిదిని, తక్కినవాని నమ్ముకొనుచు, అదియే బ్రతుకుఁదెరువుగఁ జేసికొని యుండెను. ఒకనాఁ డతఁడు వల, ఉరులు, మొదలగు సాధనములఁ గూర్చుకొని, యొకయడవిలోఁ దిరుగుచుండగా, గొప్ప తుపానొకటివచ్చి, ఆ యరణ్యమంతయు జలమయము గావించెను. ఆ శబరుఁడా గాలి వానకు జడిసి యొకచోట వలఁబన్ని, దాపున మిట్టపైనుండు నొక మఱ్ఱి చెట్టుక్రిందికిఁ జేరి, అచట నొకఱాతిపై గడగడ వణఁకుచు బరుండెను.

ఆ చెట్టుతొఱ్ఱలోఁ గాఁపురముచేయు నొక పావురము, తనభార్య మేఁతకుఁ బోయి రాక యాలసించినందుకు దుఃఖించుచు నిట్లనియె. 'ఎచటి కేగినదోకదా నా ప్రేయసి! నన్నువిడిచి యొకనిమిషమైన నుండునా? అది లేకపోయిన నాజీవితము నిష్ప్రయోజనమే యగుఁగదా! ప్రేమగలభార్య

గుణములే పతి యైహికాముష్మిక సుఖము లొనఁగూర్చునని పెద్దలనెదరు. ఇంతెదనుక మసలుటకుఁ గారణమేమై యుండ నోపు? ఈపాడుగాలివానవలన నెచటనైనఁ బడిపోయినదేమో! ఇల్లు పాడుపడినట్లున్నది. ఇప్పుడేమి చేయుదును? ఎందుఁ బోదును? అని యంగలార్చుచున్న తనమగని పలుకులను జెంచువలలోఁ జిక్కుకొనియున్న యాఁడుపావురము విని, మనస్సు సంతోష సముద్రమున నోలలాడ, "పతిప్రేమ నిట్లు పడసిన సతి నేఁ గదా పుణ్యవతి. మగనిమాటల నిట్లు మనసార వినఁగలిగితిని. నా జన్మము సార్థక మయ్యె. ఇఁక నాకు మృత్యుభయముగూడ లేదు. అని తలఁచి, భర్తకుఁ దనయునికిని విన్నవించి, 'దైవకృతముఁ దప్పింప నెవరితరము? చింతింప వలదు?' అని పలికి, మఱియు నిట్లనియె.

'నాథా! అపకార మొనరించువానికైన నుపకారము చేయుట యుత్తమధర్మమని శాస్త్రాలు వచించెదరు. కనుకఁ జలిచే వణఁకుచు మిక్కిలి గాసిఁజెందియున్న యీబోయకు నీ యోపినకొలఁదిఁ బరిచర్యచేసి యితనిని గాపాడుమా!' అని చెప్పెను. అంత నా మగపావురము శోకమును విడిచి, ఆ లుబ్ధకునిఁ జేరి సవినయముగాఁ దన జాతిచెప్పి, మనుష్యవచనముల నతనితో నిట్లనియె. 'ఓయన్నా! నీవు మిగుల శ్రమనొంది మాయింటి కతిథివై వచ్చినాఁడవు. తడవుసేయక నీ కాతిథ్యము చేయవలయు. నీకోరిక నెఱిఁగింపుమా!' అపుడా పక్షివైరి మిగుల నానందమొంది, 'చలిచే నంగములన్నియు వశముఁ దప్పినవి. ఈ యాపదను దొలఁగించి

రక్షింపుము!' అనెను. అంత నాపావురము చేరువనున్న పుల్లలను ముక్కునఁ గొని వచ్చి కుప్పఁబోసి, వెంటనే సమీపముననున్న పల్లెకుఁబోయి యొకకొఱవికట్టెను దెచ్చి యాపుల్లల ప్రోవులో నుంచి మంటఁజేసి, ప్రీతితో నాబోయను జూచి 'పూజ్యుఁడా! ఈ నిప్పున నీశరీరమును గాచుకొనుటకై లెమ్ము' అనెను. అపుడా బోయ గువ్వహృదయము సంతసించునట్లు, తనశరీరము నా నిప్పునందు మెల్లమెల్లగాఁ గాచుకొనెను.

పిమ్మటఁ గొంతసేపటికి వానికిఁ జలిబాధ తగ్గి యాఁకటిబాధ హెచ్చెను. ఆసమాచారమును వెంటనే పావురమునకెఱిఁగించె. అది యేమిచేయుటకును దోఁచక, మనసులోఁ జింతనొందుచు, వానితో 'అయ్యా! పక్షులకు దాఁచియుంచిన యాహారమని యొకటి యుండునా? ఆఁకటికి దొరకినదెల్లఁ దిని, కాలము గడుపుచుందుము. అయిన నీవిపుడు మిక్కిలి డస్సియున్నవాఁడవు. వేయేల? నీకిపుడాహార మావశ్యకమైయున్నది. నాశరీరమునే నీకాహారముగ నొసఁగెద. దయతో గ్రహింపుమా!' అనుచు నచటనున్న యగ్నికిఁ బ్రదక్షిణ మొనర్చి, సంశయింపక యందుఁ దనదేహము నుంచెను. ఆ విచిత్రముఁ గని బోయ నిశ్చేష్టుఁడై కొంతసేపుండి పిదప నిట్లు తలఁచె.

'లోకములో నిట్టి యద్భుత మెందైనఁ గలదా? ఈ పులుఁగు వెనుదీయక, ఇతరులకుఁగాఁ దనశరీరము నిచ్చెను. నా నడవడికనుగూర్చి యాలోచింప మిగుల నీచమైనదికదా! ఇట్టి యుపకారమునకేని తగియున్నదా? ఇంతటనైన నాదుష్ప్ర

వర్తనమును మానెదఁగాక. ఈ పక్షియే నాకు గురువై సద్బోధమును గలిగించె. ఔరా! ఈ విహంగ మాలుబిడ్డల విడనాడి యీయగ్నిలోనికిఁ బ్రవేశించెను. ఇట్టిసాహసమే కదా వైరాగ్యసంపదకు మూలము. నేనును మహాప్రస్థాన మొనరించి, పుణ్యమును సంపాదించెదఁగాక!' అతఁడిట్లు నిశ్చయించుకొని దీక్షఁబూని, వలలోఁజిక్కుకొనియున్న పక్షులవిడిచిపుచ్చి, వల ఉరులు మొదలైన యుపకరణములఁ గూడ దూరముగఁ బాఱవైచి, అచటినుండి వెడలిపోయెను.

వలనుండి విడువఁబడిన కపోతి తనభర్త నిప్పులోఁ బడుటకు మిగుల దుఃఖించి, కన్నీరుకాల్వలుగట్ట గద్గదస్వరమున నతనిగుణములగూర్చి పలువిధములఁ బ్రస్తుతించుచు; ఆయగ్నియందె తానును జొచ్చి, దేవతలు గొల్చుచుండ మహావైభవముతో దివ్యవిమానముపైఁ బోవు తనభర్తను జేరెను.

కనుక, కష్టదశలోనుండితనయిల్లు వెదకికొనుచువచ్చిన పగవానినైన నాదరముతోఁ జేరఁదీసి, కాపాడుట యుత్తమ ధర్మము. అట్లొనరించినవారికి రెండులోకముల సర్వసౌఖ్యములు చేకూరును.

క॥ ఉపకారికి నుపకారము,
విపరీతముగాదు సేయ, వివరింపంగా
నపకారికి నుపకారము,
నెపమెన్నక చేయువాఁడు నేర్పరిసుమతీ.

మహాప్రస్థానము = గొప్పప్రయాణము పస్థితిమరణము. నెపము=తప్పు.

# 14. కృతఘ్నుని మాంసముఁ గుక్కలును దినరోయు.

---

గీ॥ బాగు చేసినవానికి నోగుచేఁత
యరయ మిక్కిలి పాతక మండ్రు బుధులు,
ఉపకరించిన కొంగకు నపకరించి
పాఱుఁడొక్కఁడు నింద్యుఁడై భంగపడఁడె?

ఒగు=కీడు, చేఁత=చేయుట, బుధులు=విద్వాంసులు, పాఱుఁడు=బ్రాహ్మణుఁడు, భంగపడఁడె=అవమానపడఁడా?

### నాడీజంఘోపాఖ్యానము.

పూర్వ మొక బ్రాహ్మణుఁడు కులాచారముల విడిచి బోయదాని నొకతెం బెండ్లాడి, చెంచులతోఁ గూడ వేఁటకుఁ బోవుచు, వారితోఁ గలిసి మద్యమాంసములఁ గూడఁ దినుచుండెడివాఁడు. ఆ పాపాత్ముఁడు యథేష్టముగ సుఖముల ననుభవింప నుద్దేశించి ద్రవ్యమును సంపాదింపఁగోరి. కొందఱు కోమట్లు వ్యాపారమునకై దేశాంతరమునకుఁ బోవుచుండ, వారితోడఁ బ్రయాణమయ్యెను. వారందఱేకమై యొకయడవిలోఁ బోవునపుడు, అడవియేనుఁగొక్కటి యా గుంపులోని కుఱికి, వారిని గాలఁ జమర మొదలిడెను. అపుడెక్కడివారక్కడఁ బరుగిడిరి. ఆ బ్రాహ్మణాధముఁడెట్లో తప్పించుకొని, ఉత్తరదిక్కుముఖమై పరుగెత్తుచు, గుబురుగ నుండు నొక్కమఱ్ఱిచెట్టును జూచి, దానినీడఁ గొంతసేపు

విశ్రమించి బడలికఁదీర్చికొన బుద్ధిపుట్ట నట్లు కావించెను.

ఇంతలో బ్రహ్మదేవుని యనుగ్రహమునకుఁ బాత్రమైన దియు, 'నాడీజంఘుఁడు, రాజధర్ముఁడు' అను పేళ్లం బరఁగు నొక్కకొంగ, ఆమఱ్ఱిచెట్టుపై వాసము చేయునది కాన నచ్చోటికే తెంచి, బడలియున్న యావిప్రునిజూచి, 'నీవెవరవు? ఎందుండి వచ్చితివి? ఎందులకరిగెదవు? ఇపుడు నా కతిథివైతివి. నీచరిత్రము సాంతముగఁ జెప్పుము.' అని ప్రియముతో నడిగెను. ఆ పాఱుఁడు, "నేను మధ్యదేశీయుఁడను. గౌతముఁడను బ్రాహ్మణుఁడ. ఒక మహనీయుని పుత్త్రుఁడ. పురాకృత కర్మవశమునఁ గులాచారముల విడిచి, బోయదానిఁ బెండ్లియాడి, బోయలనుగలిసి తిరుగుచు, ధనార్జనమునకై బేహారులతోఁగూడఁ బోవుచుండ వనగజము తఱుముకొనిరా నిట్లు పరుగిడితిని' అని చెప్పెను.

అంత రాజధర్ముఁ డాతని సత్కరించి, 'నీకు మేలగుఁగాక. నీదారిద్ర్యమును బోఁగొట్టెదను' అని చెప్పి, మధురఫలములఁ దెచ్చి తృప్తియగునట్లాతనికొసఁగెను. పిదప రాత్రియగుటయు, ఆ కొంగ చిగుళ్లు పూలు మొదలగువానిచే మెత్తనిశయ్య నమర్చి, అందాతని శయనింపఁ గోరెను. ఆపాఱుఁ డందుశయనించి సుఖనిద్ర నొందెను. బకము మఱునాఁడు వేకువనే మేల్కొని యాబ్రాహ్మణుని సమీపించి యిట్లనియె.

'మనుజుని దారిద్ర్యమును బోఁగొట్ట మిత్త్రుఁడు, వెండి, బంగారము, బుద్ధి, అను నాల్గురు ముఖ్యసాధనములని పెద్దలనెదరు. వానిలో మిత్త్రుఁడెక్కుడు. కాశ్యప పుత్త్రుఁడనైన

నేను నీకాప్తమిత్రుఁడనయ్యు, నీపేదఱికమును బోఁగొట్టఁజాల కుందునా? నామిత్రుఁడు 'విరూపాక్షుఁడు' అను పేరుగల రాక్షసరాజు ఇచటికి మూఁడామడదూరములో నుండు మఘవ్రజ పురమున వాసముచేయుచున్నవాఁడు. నీవాతనికడకుఁ బోయి, నేను బంపితినని చెప్పుము. అతఁడు ప్రీతుఁడై, నీకు వలసినధనము నొసఁగి పంపును.' అని చెప్పి యాపట్టణమునకు మార్గముచూపెను.

ఆ బ్రాహ్మణుఁడప్పుడే పయనమై మఘవ్రజపురంబున కరిగి, రాక్షసరాజును దర్శించి 'రాజధర్ముఁడు పంపఁగా వచ్చితిని' అనిచెప్పి తనకోరికను దెలిపెను. ఆ రాజు ఈ విప్రుని చందమరసి, 'ఈతఁడధమ గుణుఁడుగఁ గనఁబడుచున్నవాఁడు. అడిగి తెలిసికొనెద' నని తలఁచి 'ఓయీ! నీకులవృత్తముల తెలుఁగెఱిఁగింపుము' అనెను. అతఁడును సంకోచింపక తన సమాచారము నంతయు, పూసగ్రుచ్చినట్లు తెలిపెను. అప్పుడా రాక్షసరాజు సంశయ నివృత్తుఁడై, 'ఈతఁడెట్టి వాఁడైన నేమి? నాడీజంఘుని స్నేహితుఁడఁట. ఆ మహనీయుని సాంగత్య ప్రభావమునఁ బరిశుద్ధుఁడు గాకుండునా? కనుక నితనికిఁ దృప్తియగునట్లు ద్రవ్యమొసఁగెదఁగాక' అని నిశ్చయించెను.

ఆతఁడట్లు నిశ్చయించి మఱునాఁడు కార్తిక పౌర్ణమాసియైనందున వేనవేలు బ్రాహ్మణులు తనయింటఁ బసిఁడిపళ్లెరముల భోజనములుచేయను, బహుళదక్షిణల గ్రహింపను దటస్థించిన, ఆమహాజనులతో నాబ్రాహ్మణునిఁగూడఁ గలిపి యత్యంతాదరమున భోజనముఁబెట్టించి, ఆతఁడు భుజించిన

బంగరు పళ్లెరముతోఁగూడ నతఁడు మోయలేనంత ధన మొసఁగి పంపెను.

ఆపాఱుఁడా ద్రవ్యమును గొని సంతసించి, మెడ వీపు మూఁపులు నొవ్వ, దాని నెట్లో మోచికొని యాబకమున్న తావునకుఁ దిరిగి వచ్చెను. ఆ కొంగయు నట్లేగుదెంచిన యాతనిఁగని, తనఱెక్కలచే మెల్లఁగ వీచి, అతని మార్గశ్రమమును బోఁగొట్టి. ఆహారమొసఁగి, రాత్రియగుడు సుఖనిద్ర నొందెను. ఆదుర్బ్రాహ్మణుఁడు రాజధర్మునిచేనట్లుసత్కరింపఁబడియు శయనించి యిట్లు చింతించెను. 'రేపటి ప్రయాణమున కాహారము గావలసియున్నదికదా! ఏమిచేయవచ్చును? ఈ కొంగ శరీరము మిక్కిలి క్రొవ్వియున్నది. దీనియందు మాంసము మెండుగఁ గలదు. ఇది మైమఱచి నిద్రించుచున్నట్లున్నది. కనుక నిపుడే దీనిని జావమోఁది, చెండుకొని పోయెదఁ గాక.' ఇట్లు కృతనిశ్చయుఁడై యాపాపాత్ముఁడు దుడ్డుకఱ్ఱ నొకదానింజేఁబూని, ప్రయత్నముతో దానిమెడయుఁ దలయుఁ బెక్కుమాఱులు మోఁది, చచ్చినదని నిశ్చయించి, ఈఁకల నూడ్చి నంజు డంతయుఁబొదివి మూటగట్టుకొని, తెల్లవాఱక మునుపే పయనమైపోయెను.

మఱునాఁడు దైత్యరాజు వాడుకప్రకారము వేకువనే లేచి ప్రాతఃకాల కృత్యములఁ దీర్చుకొన యత్నింప మనసు కలఁకఁబాఱెను. దానికిఁ గారణ మూహింపలేక తహతహపడుచుండ జాముప్రొద్దెక్కెను. అపుడతఁడు రాజధర్మునిఁ దలఁచి 'ప్రతిదిన మింతకుముందె యిచ్చటికి వచ్చునామిత్రుఁ

డీదినమింకను రాకపోవుటకు హేతువేమై యుండును? ఆలో చింప నిన్నటి బ్రాహ్మణుఁడు దుర్మార్గుండని యెంచితినిగదా! అతఁడేమి కీడుతలఁచెనో! ఆరాజధర్ముఁడు కపట మెఱుంగనివాఁడగుటచే నందఱను నమ్మును' అని శంకించి కొందఱ భటులను నాడీజంఘుని సమాచారమును దెలిసికొని వచ్చుట కై పంపెను.

వారును శీఘ్రగమనమున నామఱ్ఱికడకుఁబోయి, బక ముడొక్కఁగని, వెంటనే తమరాజున కాసమాచారముఁజెప్పి పుచ్చి, ఆబ్రాహ్మణుఁడు పోయినత్రోవఁబట్టి కొందఱుపోయి, కొలఁది దూరములోనే యతనిఁబట్టుకొని పెడతెక్కలు విఱిచికట్టి తమరాజునొద్దకుఁదెచ్చిరి. దైత్యరా జాతనిఁ జూచినంతనే 'ఈపాపాత్ముని నాయొద్దకేలఁ దీసికొని వచ్చితిరి? అక్కడనే మీరితనిఁ జంపి తిని రాఁగూడదా? అనెను. సేవకు లామాటకు 'ప్రభూ! ఈ దురాత్ముని మేనికండల నములుటకు మేమంతటి నీచులమా? మాకును ఘోరపాప మంటదా?' అనిరి. అంత నారాజు మీఱీతనిఁ దినుఁడు. తినకుండుఁడు. ఇంక నొకనిమిషమైన జాగుసేయక యితనిని దూరముగఁ దీసికొనిపొండు ' అని గద్దించి పలికెను. అపుడు భటులానీచుని ఊరివెలుపలికిఁగొంపోయి కండతుండములుగావించి కుక్కలకు వైచిరి. ఆశ్వానము లాఁకటిబాధచే నకనక లాడుచున్నను నాదురాత్ముని మాంసమును దినుటకురోసి, మగిడిపోయెను. కృతఘ్నుని మాంసమును గుక్కలుగూడఁ దిన నొల్లవనుట యిట్టిదియ కాఁబోలు?

పిమ్మట నారాక్షసరాజు పురపురపొక్కుచు స్నేహితులతోఁగూడ నాబకము శవమున్నచోటికేగి, దాని కగ్ని దరికొల్పి వచ్చెను. కొంతసేపటికి దేవేంద్రుఁ డాతని సన్నిధికిరాగా దైత్యరాజాతని గౌరవించి, కన్నీరు మున్నీరై పాఱఁ బలవించుచు, తనసఖుని బ్రతికింపుమని వేఁడుకొనెను. ఇంద్రుఁ డాతనిదైన్యమును జూచి, 'ఓయీ! దుఃఖింపవలదు. నీమిత్రుఁడు సజీవుఁడై నీసన్నిధి కిప్పుడే రాఁగలఁడు. ఆ వృత్తాంతమును జెప్పెద వినుము. నీవట్లు అగ్నిసంస్కార మొనరించి వచ్చినంతనే దాపున నొకగోవు తనదూడకుఁ బాలిచ్చుచుండ, గాలితాఁకున నాదూఁడనోటినుండి యొక నురుఁగుతుప్పర యాచితిపైఁ బడెను. వెంటనే నాడీజంఘుఁడు సజీవుఁడయ్యె. ధర్మపరుల కెపుడును హానిగలుగఁబోదు. ఒకవేళ కారణాంతరమున నేదైన నొకకీడు సంభవించెనేని, అదిసుఖపర్యవసానమే యగుట నిశ్చయము' అని చెప్పెను.

ఇంతలో రాజధర్ముఁడు చనుదెంచి, దైత్యరాజును సంతోషపెట్టెను. పిమ్మట నాతఁడు తనవలన నాబ్రాహ్మణునకుఁ బాటిల్లినయాపదను విని జాలినొంది, 'ఆవిప్రుని బ్రతికింపుమా!' అని దేవరాజును బ్రార్థించె. ఇంద్రుఁ డాతని వేఁడికోలు నంగీకరించి, విప్రుని సజీవునిఁ గావించెను. ఆవల రాక్షసరాజొసఁగిన ధనమునంతయు నాడీజంఘుని మూటపై మరల నాతనికే చేర్చిరి. ఆ పాఱుఁడును దానిని మూటఁగట్టుకొని మరలి మరలి చూచుచు శీఘ్రముగ దారిఁబట్టెను.

రాజధర్ముఁడును రాక్షసరాజునొద్ద సెలవు దీసికొని నిజ నివాసమునకుఁ బోయెను.

కనుక, చేసినమేలు మఱచి యుపకారి కపకారముఁ జేయఁబూనుటకంటె ఘోరపాపము వేఱొండులేదు. అట్టివాఁడధోగతి పాలగుట నిజము.

గీ॥ అవనిలోనఁ గృతఘ్నత యరసిచూడఁ,
పాతకంబులలో ఘోరపాతకంబు,
కాఁగఁ జేసిన వారికి నోగుచేయు
వారి నెప్పుడు దేవుండె పాడుచేయు.

అవనిలోనన్=భూమిలో, కృతఘ్నత=చేసినమేలు మఱచుట, అరసిచూడన్==విచారింపఁగా, ఓగు=కీడు.

పాతకములు 5. బంగారు దొంగిలించుట, కల్లుద్రాగుట, బ్రాహ్మణునిజంపుట, గురువునకు ద్రోహముచేయుట, ఈ గుణములుగలవారితో స్నేహముచేయుట, అనునవి.

తా॥ విచారింపఁ జేసినమేలు మరచుట యనునది పాతకములలో గొప్ప పాతకము. ఉపకారము చేసినవారికి అపకారముచేయువారిని దేవుడే పాడుచేయును.

# 15. మితిమీఱి మెక్కరాదు.

గీ॥ ఒడలెఱుంగక మితిమీఱి యోగిరంబుఁ
దినినయాతఁడు తప్పక తెవులుఁ జెందు,
అగ్నిదేవుఁడు శ్వేతకి యజ్ఞమందు
నాజ్యమమితంబుగాఁ గ్రోలి యందె రుజను.

ఓగిరము=ఆహారము, తెవులు=రోగము, ఆజ్యము=నెయ్యి, క్రోలి=త్రాగి, రుజను=రోగమును, ఒడలెఱుంగక=ఒళ్ళు తెలియక.

## అగ్నిదేవుని యజీర్ణరోగము.

పూర్వము 'శ్వేతకి' యనురాజుండెను. అతఁడు మిగుల బలపరాక్రమములు గలిగి, శాస్త్రమందుఁ జెప్పఁబడిన విధమునఁ బెక్కుయాగములఁ జేసెను. దాతృత్వమున నతనితో సమానులెవ్వరును లేరు. ఆతని కెప్పుడును యాగకార్యము లొనరించుటయందును దానధర్మములఁ జేయుటయందును దప్ప, మనసు మఱొకపనియందుఁ బ్రవేశించునది కాదు. ఆతనిజీవితకాలమంతయు యజ్ఞములఁ జేయుటయందె గడచుచుండెను. ఇట్లుండఁ గొంతకాలమునకు ఋత్విజులు పొగచేఁ గన్నులు కలఁకబాఱి, ఆరాజును విడిచిపోయిరి.

ఆవలఁ గొన్నిదినములకా శ్వేతకి నూఱువత్సరములు చేయఁగూడిన యొక సత్త్రయాగమును సలుపసమకట్టి, మరల నాఋత్విజులఁ బ్రార్థించెను. వారతని వేఁడికోలును నిరాకరించిరి. అంత నారాజు హిమాచలమునకుఁ బోయి, శివునిఁ

గూర్చి ఘోరతపము చేసెను. ఆతని యుగ్రతపస్సునకు మెచ్చి, ఈశ్వరుఁడు ప్రత్యక్షమై "పురుషసింహమా! నీతపస్సునకు సంతసించితిని. నీకు శుభమగుఁగాక. కోరినవరమడుగుము. ఇచ్చెదను" అనెను. అపుడు శ్వేతకిరాజు శంకరునకు సాష్టాంగదండప్రణామము లాచరించి, "దేవదేవా! నీవు సర్వలోకరక్షకుఁడవు. నీకసాధ్యమైన దేదియులేదు. నీకు నాయెడ వాత్సల్యము గలదేని నీవె నాయాగమును జేయింప విజయము చేయవలయు," అని వేఁడికొనెను.

భగవానుఁడగు పరమేశ్వరుఁ డాతని వేఁడుకోలు నంగీకరించియు, "యజ్ఞముచేయించుటనునది బ్రాహ్మణుల పనియై యున్నది. కనుక నేనె నీయాగమును జేయింప నెట్లువత్తును? అయినను భూలోకమున నాయంశమునఁ బుట్టిన దూర్వాసుఁడను బ్రాహ్మణోత్తముఁడు, నాపంపున నీయజ్ఞమును జేయించును. నీవు పోయి సంభారముల సిద్ధపఱచుకొనుము." అని చెప్పి యంతర్ధానమొందెను. అనంతర మీశ్వరాజ్ఞచే దుర్వాసుఁడు ఆ శ్వేతకి సత్రయాగమును శాస్త్రోక్తప్రకారముగఁ జేయించెను. యాగము ముగిసినపిదప నారాజు బ్రాహ్మణాశీర్వాదములఁగొని నగరమును బ్రవేశించెను. పిమ్మట దుర్వాసుఁడును దక్షిణముమునులును, రాజునొద్ద సెలవుఁదీసికొని తమతమ నివాసముల కరిగిరి.

ఆ యాగకాలమందు నగ్నిహోత్రుఁ డాసతో నేతిధారల నెడతెగక త్రాగుటచే నతనికెన్నండులేని తృప్తిగలిగినది. పిదప నాతని కెచటను హవిస్సుఁ గైకొన మనసు

పుట్టదయ్యె. క్రమముగ నరుచియు హెచ్చసాగెను. దానిచే నతఁడు నానాఁట తఱిగిపోఁ జొచ్చెను. అజీర్ణరోగమువలనఁ దనకుఁ బాటిల్లిన దురవస్థను బోఁగొట్టుకొనఁ దలఁచి యెంత యో ప్రయత్నించెను. కాని ప్రయోజనము లేకపోయెను. అంత నాతఁడు బ్రహ్మదేవునికడకుఁ బోయి, "మహాత్మా! శ్వేతకిరాజు నాకెన్నఁడులేని తృప్తిని గలుగఁజేసెను. దానివలన నరుచిహెచ్చి, తేజమును దగ్గిపోసాగినది. దీనికిఁ దగిన ప్రతిక్రియ నుడివి నన్నుఁగాపాడుమా!" అని ప్రార్థించెను. అపుడు విధాత యగ్నినిజూచి, చిఱునవ్వుతో "హవ్యవాహనా! ఒడలెఱుఁగక యాజ్యాహుతులఁ గైకొనుటచేఁ గలిగిన యీవ్యాధినిగూర్చి చింతింపవలదు. శీఘ్రకాలములోనే నీవెప్పటియట్ల కాఁగలవు. తగినవేళ వచ్చినపుడు నీయరుచిని బోఁగొట్టఁగల యుపాయమును జెప్పెదను. ఇపుడు పెక్కుజీవరాసుల కునికిపట్టగు ఖాండవవనమును దహింపఁ గలిగితివేని యత్నింపుము" అని చెప్పెను.

చతుర్ముఖుని మాటలవిని ధైర్యముఁ దెచ్చికొని యగ్నిదేవుఁడు వేగముగ ఖాండవవనమును జేరి, శక్తికొలఁది యత్నించి దానిని బ్రజ్వలింపఁజేసెను. వెంటనే యింద్రునానతిచే మేఘములు వర్షించి యామంటను జల్లార్చినవి. ఇట్లేడుమాఱులు యత్నించియు నాతఁడు విఫలమనోరథుఁడయ్యె. పిమ్మట నగ్నిదేవుఁడు వ్యాకులమనస్కుఁడై యాసమాచారమును బ్రహ్మకెఱిఁగించెను. బ్రహ్మదేవుఁడు నాతని నూఱడించి, "వత్సా! నీవిపుడెంత యత్నించినను ఖాండవవనమును

దహింపఁజాలవు. కనుకఁ గొంతకాల మోర్పు వహించి యుండుము. తరువాత నరనారాయణులు లోకరంక్షణార్థము కృష్ణార్జును లను పేరుతో భూలోకమున నావిర్భవించెదరు. వారిసాహాయ్యమున దాని నవలీలగాఁ గాల్పఁగలవు. వేయేల? అప్పుడు దేవతలతోఁగూడి దేవనాథుఁడు వారించినను నీ కోరిక సఫలమగును. పొమ్ము. అని నుడివెను. అగ్నియు సమయమును నిరీక్షించుచుండెను.

ఇట్లుండ నొకనాఁడు కృష్ణార్జునులు ఖాండవవన సమీపమున విహరించుచుండిరి. అగ్నిహోత్రుఁ డాసమయమున బ్రహ్మచేఁ బ్రేరేపింపఁబడి, బ్రాహ్మణరూపముతో వారి కడకుఁ బోయి, "మహాత్ములారా! నే నగ్నిని. నాకుఁ దగిన యాహార మొసఁగుఁడు. ముఖ్యముగ నాకీ ఖాండవవనము దహింపవలయునని యెంతయో కాలమునుండి కోరిక గలదు. దీనిని దహింప నెన్నిమారులు ప్రయత్నించినను సఫలముగుట లేదు. మహాత్ముల రగు మీర లనుగ్రహించితి రేని నాకోరిక కొనసాగును" అని పలికెను. అపు డర్జునుఁ డగ్నితో "ఆర్యా! ఈమహాకార్యమును సాధింప నాకు దివ్యములైన యస్త్రములును, నాబాహుబలమునకుఁ దగిన ధనువును, మఱియు నక్షయములైన యమ్ముల పొదులును, వీనినన్నిటిని మోయఁ గలిగిన రథమును గావలసియున్నవి కదా!" అనెను.

అంత నగ్ని దేవుఁడు జలాధిపతియగు వరుణునిఁ బ్రార్థించి ఆతనికడనుండు గాండీవ మను పేరుగల ధనువును, అక్షయ తూణీరములను, కపిలాంఛనమగు రథమును దెచ్చి యర్జు

నుని కోసఁగెను. అతఁడు వానినన్నిటిని గైకొని, శ్రీకృష్ణుని సాహాయ్యమున నా వనమునకు నధికారియగు నింద్రుని ననాయాసముగ నోడించి, ఎట్టకేలకా వనమును హవ్యవాహనుఁడు తన యిష్టప్రకారము దహించునట్లు చేసి, ఆతని కోరికను నెఱవేర్చెను. దానితో నగ్నిహోత్రుని యజీర్ణ వ్యాధియు శమించెను.

కనుక, ఎవరికిఁగాని యాహార వ్యత్యాసమువలననే యన్నిరోగములును గలుగుచుండును. మితాహార మందఱకు నాయుస్సును బెంపొందించి, ఆరోగ్య మొసఁగూర్చును.

ఋత్విజులు=యజ్ఞముచేయించువారు, హవ్యవాహనుఁడు. అగ్నిహోత్రుఁడు, తూణీరము=అమ్ములపొది, చతుర్ముఖుఁడు=బ్రహ్మ.

గీ॥ అన్న మధికమైన నదియుఁదాఁజంపు, నా
యన్నమంటకున్న నాత్మ కొచ్చుఁ
జంపఁ బెంప బువ్వ చాలదా వేఱేల?
విశ్వదాభిరామ వినుర వేమ॥

# 16. అన్నదానఫల మనంతము.

గీ॥ అన్నదానఫలం బింతయంతయనుచు
శంకరున కేని వచియింప సాధ్యమగునె?
శబరుఁడొక్కఁడు చేరెడు చాఱపప్పు
**పాఱునకొసంగి రాజయి ప్రభవ మొందె.**

వచింపన్ = చెప్పుటకు, శబరుఁడు-బోయవాఁడు, పాఱునకున్ = బ్రాహ్మణునకు. ప్రభవమొందెన్ = పుట్టెను.

### బోయవాఁడు రాజుగఁ బుట్టుట.

పూర్వము పరిశుద్ధమనస్కుఁడగు నొక బ్రాహ్మణుఁ డుండెను. అతఁడు ధర్మపరుఁడు. నిరతాన్నప్రదాత. అతని భార్యయు నుత్తమురాలు. మగని యిష్టానుసారముగ వచ్చిన యతిథుల కాదరముతో నన్నదానము చేయుచుండెను. ఆ కారణముచే లక్ష్మీదేవి యా బ్రాహ్మణునియింటఁ గాపురముండినది. ఇట్లుండ నొకనాఁడా బ్రాహ్మణి భర్తతో "నాథా! మీరు నిత్యము నన్నప్రదానము చేయుచుందురు కదా! దానిచేఁ గలుగు ఫల మెట్టిదియో దయతో వివరింపుఁడు" అని యడిగెను. ఆ మాట కావిప్రుఁడు అన్నదానఫల మింతయని మున్నెన్నఁడును నేను విన్నది లేదు. బ్రాహ్మణోత్తముల రాసిమ్ము. వారినడిగి తెలిసికొందము" అనెను.

ఆవల నాబ్రాహ్మణుఁడు తనగృహమునకు వచ్చిన విప్ర

లకు సరసాన్నములఁ గుడువఁబెట్టి, వారుతృప్తినొంది సుఖము గనొకచోటఁ గూరుచుండినపిదప, భార్యతోఁగూడ వారికిసాష్టాంగపడి "మహాత్ములారా! అన్నదాన ఫలమెట్టిదియో దయచేసి వివరింపుఁడు!" అని సవినయముగా నడిగెను. వారును దానిఫలమింతయని చెప్ప వలనుపడక మిన్నకుండిరి. అపుడు అందొక ముసలిబ్రాహ్మణుఁడు "అయ్యా! అన్నదానఫల మింతయని చెప్పుటకెవరికి సాధ్యము? కాశికిఁబోయి శ్రీవిశ్వనాథస్వామి భార్యయగు అన్నపూర్ణాదేవిని నడుగుము. ఆదేవియే యీవిషయమును జెప్ప సమర్థురాలు" అని చెప్పెను.

తరువాత నాభూసురుఁడు, దివ్యక్షేత్ర సందర్శనము సంశయనివారణము నగునని తలఁచి కాశికిఁబోవ నిశ్చయించి భార్యతోఁ దన ప్రయాణమునుగూర్చి చెప్పి యిట్లనియె. "ప్రేయసీ! ఆఁకొని వచ్చినవారికెట్టితటినైనఁ బ్రీతితో నన్నముఁ బెట్టుచుండుము. ఇంటికి వచ్చిన యతిథి యుస్సురని చనినచోఁ గలుగు పాతక మెట్లును బోగొట్టుకొన శక్యము గానిది. మఱియు, ఎవరికిఁగాని యొకప్పుడేని అరకడుపు నకుఁ బెట్టకుము. అల్పాహార మిడుటవలన నాయువు క్షీణించునని పెద్ద లనెదరు. ఇట్లాబ్రాహ్మణుఁ డుపదేశించి పయనమై దీర్ఘప్రయాణములచేఁ గొంతకాలమునకు వారణాసికిఁ బోయి, గంగానదియందు స్నానముచేసి, ప్రతిదినమును విశ్వనాథస్వామిని దర్శించి పెక్కురీతుల నుతించుచు, శ్రీ విశాలాక్షీదేవిని భక్తితోఁ గొల్చుచుండెను.

ఇట్లుండ నొక్కనాఁడాదేవి యాతనియెడఁ గనికరించి

ప్రత్యక్షమై, "ఓ బ్రాహ్మణోత్తమా! నీభక్తికి మెచ్చితిని. ఏమి పనికై యిచ్చటికేతెంచితివి?" అని యడిగెను. ఆ విప్రుఁడు దేవికి నమస్కరించి, "తల్లీ! నేనొక ధర్మమును నీవలన నెఱుఁగఁగోరి వచ్చితిని. ఈ నగరమునఁ బ్రతిదినము నొక్కఁడైన పస్తుండనీయక, అందఱకును నీవాహారముఁబెట్టుదువట. దానిఫలమేమో చెప్పుమా!" అని విన్నవించెను.

అంతనా విశాలాక్షీదేవి యాతనితో నిట్లనినది. "అన్నదానఫలము నీశ్వరుఁడొక్కఁడుదక్క నితరు లెఱుఁగనేరరు. ముఖ్యముగ నీవావిషయమును దెలిసికొనఁగోరుదువేని, నేనొక్క యుపాయము చెప్పెదను. దానిచే నీసంశయ నివృత్తి యగును. హిమాచలప్రాంతమున 'హేమవతము' అనునొక పట్టణముగలదు. దానిఁబరిపాలించు 'అంగీరుఁడు' మిగులధర్మపరుఁడు. అతని భార్యయు గుణవంతురాలు. ఆదంపతుల కింకను సంతానముగలుగలేదు. నీవు వారికడకుఁ బోయి, 'మీకు సింహబలుఁడగు నొకపుత్త్రుఁ డుద్భవించును. పుట్టిన వెంటనే తల్లి మొదలగువారు లేకుండ, నన్నాశిశువును జూచుటకు సమ్మతింపుఁడు' అని కోరి, పిమ్మట ఆశిశువు జనించినతోడనే పురిటింటికేగి, 'అన్నదానఫలమెట్టిది?' అని యడుగుము. ఆశిశువువలన నీసంశయము తీఱును" అని వాక్రుచ్చె.

అంత నాపాఱుఁడు గౌరీదేవికి నమస్కరించి యనుజ్ఞఁగొని, ప్రయాణమై హేమవతనగరమునకుఁ బోవుచు, త్రోవఁదప్పి యొకయడవినడుమఁ దిరుగసాగెను. అచట వాసము

చేయుచున్న యొకబోయవాఁ డా బ్రాహ్మణునిఁ జూచి "అయ్యా! నీవెక్కడికిఁ బోయెదవు? సూర్యాస్తమయము గావచ్చినది. చాలదూరము పోయినఁగాని యీ యడవి దాఁట వీలులేదు. చీఁకటి పడినపిమ్మట నిందు సంచరింప నెవరికిని శక్యముగాదు. ఇక్కడి క్రూరజంతువు లెట్టివారినైన హింసింపక మానవు. కనుక, నీవిప్పూట ఇచ్చటనే యుండి, రేపుదయమునఁ బొమ్ము" అని ప్రార్థించెను. ఆవిప్రుఁ డద్దాని కంగీకరించి యీరాత్రి యచటనే యుండనిశ్చయించుకొనెను.

ఆవల నాకిరాతుఁడు ప్రియముతో చేరెఁడు చాఱపప్పును గొంచెము తేనెయు నిచ్చిన, ఆ భూసురుఁడు వానిని భగవన్నివేదనముచేసి యారగించెను. పిదప నాబోయమంచెపై మెత్తనియాకులు కొన్నిపఱచి, ఆ విప్రుని దానిమీఁదికెక్కించి పవ్వళింపుమని చెప్పి, అతనికి నిద్రాభంగము గలుగకుండఁ దాను విల్లునమ్ములఁ బూని, అచ్చటి క్రూరజంతువులను రానీయక యదలుచుండెను. ఇట్లుండ నరుణోదయమయ్యెను. 'ఇంక భయములేదు' అని యెంచి యీ చెంచు యించుక కనుమూసెను. ఇంతలోఁ దటాలున నొక పెద్దపులి వచ్చి యాతనిఁ జంపిపోయినది.

ఆ బ్రాహ్మణుఁ డాచప్పుడు విని లేచి, కిరాతుఁడు మరణించియుండుటఁగని, మంచెదిగివచ్చి మిక్కిలి దుఃఖించి, చేయునదిలేక, ఆ శవమున కగ్నిసంస్కారముగావించి, వెంటనే బయలుదేరెను. అతఁ డట్లు వెడలి కొంతకాలమునకు హేమవతపురమును జేరి, పార్వతీదేవి చెప్పినప్రకార మా

రాజుతో నేకాంతమున మాటలాడి, అతని యంగీకారమును బడసి, ఆ యూరిలోనుండు నొక శివాలయములో జపము చేసికొనుచుఁ గాలము గడపుచుండెను. ఇట్లుండ నొకనాఁడా రాజునకు కొడుకు పుట్టెననువార్త వినవచ్చినది. అపుడె యా పుడమిసురుఁడు వెడలి పురిటిల్లుచేరి, అందఱ నావలకుఁ బొండని చెప్పి, ఆశిశువును జేరి "అన్నదానఫలమెట్టిదియో వివరింపుమా!" అని యడిగెను.

ఆ బిడ్డఁడు కలకలనవ్వుచు నిట్లనియె. "స్వామీ! ఆఁకలిగొన్నవారి కన్నమిడినచోఁ గలుగుఫల మిట్టిదని నేనుజెప్ప నేర్తునే? అన్నదానఫల మనంతమని తమకుఁ దెలియనిదా? అయిన నొకవిశేషమును జెప్పెదను. వినుఁడు. ఆ నాఁటి సాయంకాలమున మీరు నేనుండుచోటునకు వచ్చినపుడు కొంచెము తేనెయు, చేరెడు చాఱపప్పును, మీకుఁ బ్రియముతోఁ బెట్టితినిఁగాదా! దానిమహిమచే నింద్రుని రాజ్యమున కీడగు నీ సామ్రాజ్యమునకుఁ బ్రభువునై పుట్టితిని. దేవా! అల్పదానమువలన నాకిట్టి యైశ్వర్య మబ్బినపుడు, నిరతాన్నప్రదాతవైన నీకెట్టిఫలము చేకూరునో నుడువుట కాపరమశివునకుఁ దక్క నన్యులకు సాధ్యమా!" అని పలికి యూరకుండెను.

తరువాత నాబ్రాహ్మణుఁడు అచటినుండి వెడలి, అంగీరునికడ సెలవుఁగైకొని మరలఁ గాశికిఁబోయి, పార్వతీదేవిని సందర్శించి మ్రొక్కి, "తల్లీ! నీవానతిచ్చినట్లుపోయి ఆశిశువువలన 'అన్నదానఫల మనంత'మని తెలిసికొంటిని" అని విన్నవించెను. అపుడు భవానీదేవి సాక్షాత్కరించి, "విప్ర

వర్యా! నీకోరికసిద్ధించె. గృహస్థులకుఁ జాలకాలము ప్రవాసము కూడదు. అతిథులు గృహస్థుని వాకిటికివచ్చి, సత్కారముల నొందక పోయిరేని, ఆగృహస్థుని ధర్మములన్నియు నిష్ప్రయోజనము లగును. మఱియు, ఆ యతిథులొనరించిన పాపములన్నియు నాగృహస్థుని, అతఁడొనరించిన పుణ్యము లాయతిథులను జేరును. కనుక నాలస్యముచేయక నీవింటికిఁ బొమ్ము" అని యానతిచ్చెను.

అంత నాబ్రాహ్మణుఁడెడతెగని ప్రయాణములచేఁ గొలఁదికాలముననే తనయూరిఁజేరి, యానద్వృత్తాంతమును దనభార్యకుఁ జెప్పెను. ఆయమయు మనస్సున నెంతయు నానందమొందెను. ఆదంపతులు విడువక తమవ్రతమును సలుపుచు ధనధాన్యసమృద్ధియు, పుత్రపౌత్రాభివృద్ధియుఁ గలిగి సుఖముగ జీవించుచుండిరి.

కనుక, కులరూపాదుల విచారణమునకుఁ బూనక, ఆఁకలిగొని యింటికివచ్చిన వారికిఁ దమశక్తి కొలఁది నాహార మొసఁగుట సర్వోత్తమ ధర్మము. దీనితో సమానమైన దానము మఱొండులేదు.

ఆ॥ ఇంచుకంత బోన మీశ్వరార్పణమన్న
పుణ్యలోకములకుఁ బోవు నరుఁడు,
అన్నదానముకన్న నధికదానము లేదు
విశ్వదాభిరామ వినర వేమ॥

ఇంచుకంత=కొంచెము. బోనము=అన్నము. నరుఁడు=మనుష్యుఁడు.

# 17. పెట్టనివారికిఁ బుట్టని దేసాక్షి.

గీ॥ ఇందుఁ జేసినపుణ్యం బె యందుఁగుడుచు
లేనిచో నట నేమియు లేదు తలఁప
ఇందుఁ బెట్టనికతమున నందులేక,
మేనికండల శ్వేతుఁడు మెక్కఁగాఁడె?

తా॥ ఈలోకమునఁ దనమోపినకొలఁది నితరులకు మేలుచేసినవాఁడె పరలోకమున సుఖింపఁ గల్గును. శ్వేతుఁడనురాజు తనజీవితములో నొకప్పుడేని యితరులకు సహాయము చేయనికారణముచేఁ బరలోకమునఁ దినుటకాహారము దొరకక తనశరీరమాంసము తిని జీవింపవలసినవాఁడాయె.

## శ్వేతరాజోపాఖ్యానము.

పూర్వము విదర్భాపురము నేలు సుదేవుఁడను రాజశ్రేష్ఠుఁడు మిగులఁ బ్రసిద్ధిఁగాంచియుండె. ఆతని కిద్దఱు భార్యలుండిరి. ఇద్దఱకు నిద్దఱు కుమారులు పుట్టిరి. అందు, పెద్దవాఁడు 'శ్వేతుఁడు' అనుపేరుగలవాఁడు. రెండవయాతఁడు 'సురథుఁడు' అను నతఁడు. సుదేవునియనంతరము శ్వేతునకు మంత్రులు రాజ్యాభిషేకము చేసిరి. ఆతఁడు ధర్మమార్గమునఁ బెక్కువేల సంవత్సరములు రాజ్యపాలన మొనరించెను. ఆరాజొకప్పు డొకసిద్ధునివలనఁ దనమరణకాలమును దెలిసికొని యున్నవాఁడగుటచే, తనకు నవసానము సమీపించుటెఱిఁగి, ముందుగనే తనతమ్మునకు రాజ్యాభిషేక మొనరించి, మనుష్యసంచారములేని యొకవనమునకుఁబోయి, ఒక కొలనిగట్టునఁ దపస్సు చేసికొన నారంభించెను.

ఇట్లాతఁడు మూఁడు వేలసంవత్సరములు ఘోరముగఁ దపముచేసి, పిమ్మట సత్యలోకమును జేరెను. అక్కడను నాతని నాఁకలిదప్పులు విడిచినవికావు. అందులకారాజు మిగుల నాశ్చర్యపడి బ్రహ్మయొద్దకుఁజని యిట్లనియె. "దేవా! ఇది బ్రహ్మలోకమనియు, ఇచట నాఁకలిదప్పు లుండవనియు, విని యున్నాఁడను. అట్లుండ నే నిట్లు క్షుత్పిపాసాయత్తుఁడ నగుటకుఁ గారణమేమో చెప్పుదురా? మఱియు, నాకిచట నాహారమేమి? దయతో నీవిషయముల విశదీకరింపవలయు."

బ్రహ్మదేవుఁ డాతనిమాటలవిని యిట్లనియె. "ఓ శ్వేతా! నీవు భూలోకమునఁ దపస్సులతోనె కాలముగడపుచు అతిథుల కొక్కనాఁడైన నన్నమిడినవాఁడవు కావుకదా! బుద్ధిమంతుఁడా! విత్తనమునాఁటకుండఁ జెట్టు ఎట్లుమొలచునని తలఁచితివి? కనుక నే నీకిచటను ఆఁకలిదప్పు లడఁగినవికావు. నీవిటుపైని మంచిమంచియాహారములచే బాగుగఁ బోషింపఁబడియున్న నీ శరీరమాంసమునే తినుచుఁ దృప్తినొందుచుండుము. పుణ్యవశమున నెప్పుడైన నీ పూర్వశరీరమున్నచోటునకు నగస్త్యమునీంద్రుఁడు వచ్చుట తటస్థించెనేని, నాఁటితో నీకాకష్టము నివారణమగును. ఆ మునీంద్రుఁడు దేవతలను గూడఁ దరింపఁజేయఁగల సామర్థ్యము గలవాఁడు. నీక్షుత్తు నణఁచుట యామహాత్మునకొక గొప్పకార్యముగాదు"

అంత నారాజు బ్రహ్మదేవు నానతిప్రకార మగస్త్యుని రాకకై యెదురుచూచుచు, ప్రతిదినమును సరోవరతీరమున నుండు తనశవమునుజేరి, దానియందలి మాంసమునుదినుచు,

కాలమును గడపుచుండినవాఁడు. ఇట్లెన్నియో వత్సరములు గడచినవి; కాని యాతనికిఁ దృప్తికాని, ఆ శవశరీరమునకు క్షయముగాని కలిగినదికాదు. ఇట్లుండ నొకనాఁడు శ్వేతరాజు శవమాంసమును దినుచుండు సమయమున, మహాత్ముఁడగు నగస్త్యమునీంద్రుఁ డచటికివచ్చెను. ఆ మునివరుఁడు శ్వేతుని కృత్యమునుజూచి యబ్బురపడి "ఓదివ్యపురుషా! నీవెవరవు? ఇట్టి తుచ్ఛమైన యాహారమును దినుట కేమికారణము?" అని యడిగెను. ఆ రాజాముని అగస్త్యునిఁగ నెఱిఁగి వినయముతోఁ దనవృత్తాంతమునంతయుఁ జెప్పి, తనయొద్దనున్న యొక యాభరణమునుజూపి యిట్లనియె. "మునీంద్రా! ఈ భూషణము కోరినకోరికల నిచ్చుసామర్థ్యముగలది. దీనిం గైకొని నీవు నన్నిట్టులైన ఈకష్టమునుండి తప్పింపుమా!" అతఁడట్లు వేఁడుకొన దయాళుఁడగు నగస్త్యుఁ డా యాభరణమును గైకొనెను. తోడనే యారాజున కంతవఱకుండు శరీరము నశించెను. పిమ్మట నతఁడు సంతోషముతోడ స్వర్గమునకుఁ బోయెను.

కనుక నెవరుగాని తనకున్నకబళములోనె కొంతభాగ మితరులకుఁ బంచిపెట్టి, భుజించుట శ్రేయస్కరము. తాను దినినది తనకు లేనట్లును, ఇతరుల కిచ్చినదిమాత్రమే తన కున్నట్లును భావింపనగు.

ఆ॥ తాము బలిమిఁ బెట్టఁ, దమకుఁదామే కల్గు,
అడుగ నిడినఁ, దాము నడుగఁ గలుగు,
ఎట్లు నీనివాని కెట్లును లేదయా, (విశ్వ)

# 18. యాగమునకన్న దానము మేలు.

గీ॥ డంబమును వీడి శుద్ధ మనంబుతోడ,
నిచ్చుదానము మేలగు నిష్టికంటె,
ధర్మపుత్త్రుని యశ్వమేధంబుకన్న
విప్రుఁడొసఁగిన సక్తువు పెద్ద యయ్యె.

సక్తుప్రస్థ చరిత్రము.

పూర్వము దీనజనులపాలి చింతామణియగు ధర్మరాజు మహావైభవముతో నశ్వమేధయాగ మొనరించుచుండెను. వేనవేలు బ్రాహ్మణోత్తము లేతెంచి, ప్రతిదినము మహారాజ భోగ్యములగు భక్ష్యభోజ్యాదుల నాప్యాయనముగా బంగరు పళ్లెరంబులలో నారగించి, వలసినన్ని ధనధాన్యములఁ గైకొని, సంతసముతోఁ బోవుచుండిరి. ఒక్కనాఁ డొక ముంగిస తన పార్శ్వ మొక్కటి మేలిమిబంగరుచాయతో వెలుఁగుచుండ, తన సొరంగమునుండి వెడలి ధర్మరాజు యాగశాలను బ్రవేశించి, బ్రాహ్మణులు భుజించి వెడలినచోట నెంగిలిపళ్లెరముల నుండి జారిన నీళ్లులలో చేఁపవలె నిటునటు పొర్లుచుండెను. అచటనుండువారు దానింజూచి యాశ్చర్యపడి, అప్పుడేపోయి యావృత్తాంతమును ధర్మరాజునకుఁ దెలిపిరి. ఆరాజశ్రేష్ఠుఁడు వారిమాటల విని యబ్బురపడి, వెంటనే ముంగిసయున్నచోటు నకు వచ్చి, ఆదరముతో దానిఁ జూడసాగెను. ఆ నకులము ధర్మరాజు ముఖవైఖరిని గనిపెట్టి, అతఁడే తన్నుగినడిట్లు,

అక్కడనుండువారు వింతతోఁ జూచుచుండ, మనుష్యవచనముల నిట్లు చెప్పఁదొడఁగెను.

"రాజేంద్రా! నీవీయాగమునఁ జేయు బ్రాహ్మణ సంతర్పణమునకును, విస్తార దానమునకును, తగినఫలము గాన్పింపదు. ఈయజ్ఞమునకుఁగా నీవుసేకరించియున్న పదార్థరాసులు, ఈ బ్రహ్మాండమునుగూడ నిండింపఁ జాలినవై యున్నయవి. కాని, నీచిత్త విత్త పారిశుద్ధ్యమునుగూర్చి యెవరి కేమెఱుక? ఈ నీత్యాగము ఉంఛవృత్తి బ్రాహ్మణుఁ డొనరించిన సత్తుపిండి దానమునకు సాటిరాదని మాత్రము చెప్పక తప్పినదికాదు. మహారాజా! నేనెఱిఁగిన యావిషయమును జెప్పెదను. సావధానుఁడవై యాలకింపుము. ఆ సమాచారముఁ దలఁచుకొన్న నాశరీర మిప్పుడును గగుర్పాటుఁ జెందెడి.

'నిరుపేదయుఁ గుటుంబియు శాంతుఁడు నగు నొక బ్రాహ్మణుఁడు, భార్యయు కొడుకును కోడలును పొరపులేక తన్ననుసరించి మెలఁగుచుండ, భిక్షాటనముచేసి కుటుంబ పోషణము చేసికొనుచుండెడివాఁడు. ఇట్లుండఁ, అనావృష్టిదోషముచే నతనికిఁ గ్రమముగా జీవయాత్ర జరుగుటయు దుర్ఘటమయ్యె. అంత, నలువురు నాలుగువైపులకుఁ బోయి, గడ్డిధాన్యము నేఱి తీసికొనివచ్చి, చూర్ణముచేసి దానితో నెట్లో ప్రాణధారణ మొనరించుకొనుచుండిరి.

ఒకనాఁడు వీరు వెతకితెచ్చిన ధాన్యమును పిండిచేసి నలువురు సమముగాఁ బంచుకొని భుజింపఁబోవుచుండ, ఒక యతిథి యాఁకటిచేఁ గడుపు వీపున కంటుకొనిపోవఁ దూలుచు

వచ్చి వాకిట నిలువఁబడెను. ఆ గృహస్థుఁడా యతిథిని జూచి నంతనే సమీపించి, ఆదరముతోఁ దోడ్కొనివచ్చి, సపర్యలొనరించి, ఆసనముపైఁ గూర్చుండఁజేసి, ప్రీతితోఁ దనభాగమగు సక్తుపిండి నిచ్చి "మహాత్మా! దీనిచే తమయాఁకలిఁ దీర్చుకొని నన్నుఁ గృతార్థునిఁ జేయుఁడు" అని ప్రార్థించెను. ఆ పాఱుఁడు దానిని భుజించి తృప్తిఁ గాంచక యుండెను. దాని నెఱిఁగి యావిప్రుఁ డపుడేమి చేయుటకుఁ దోఁచక, ఈ యతిథి నెట్లు తృప్తునిఁ గావించుట?' అని విచారించుచుండెను. ఇంతలో నతనిభార్య పతిమనస్సు దెలిసి "స్వామీ! నాపాలి సక్తువునొసఁగెదను. దీనిచే నీ యతిథిని సంతోషపెట్టుఁడు" అని వేఁడుకొని, ఎట్టకేల కాతని నొడఁబఱచి, తనభాగము నొసఁగెను. ఆవిప్రుఁ డాసక్తుపిండి నతిథికిఁ బ్రియముతోనీయ, దానిని దినియు నాతఁడు తృప్తినొందలేకపోయెను. భూసురుఁ డది తెలిసి, తన పేదఱికమునకై వగచుచుండ, తండ్రిమనసెఱిఁగి, ఆ విప్రసుతుఁడు సంతసముతోఁ దనభాగమునుగూడ నిచ్చెను. ఆపిండిని బుచ్చుకొనియు నా వచ్చినయతిథి యాఁకలితీఱినవాఁడుగాఁ దోఁచకపోవుటచే, ఆ బ్రాహ్మణుఁడు లోలోనఁ బరితపించుచుండెను. అంత నాతనికోడలు ప్రీతితోఁ దనభాగమును మామగారిచేతనిచ్చి 'దీనిచే నతిథిని సంతోషపెట్టుఁడు' అని చెప్పెను. ఆమె వేఁడికోలు నంగీకరించి, ఆ పిండినిగూడ నాపాఱుఁ డా యతిథికి సమర్పించెను. అంతటితో నాతఁడు తృప్తుఁడై పోయెను. ఆ గృహస్థుఁడు ఉపవాసకృశుడైనను సంతోషముతో నారాత్రి శేషమును గడపెను.

నే నాఁకటిబాధ కోర్వఁజాలక, ఆ యతిథి వెడలిపోయిన కొంతసేపటికి, నా నివాసమునుండి వెలువడి, సక్తువాసనను బట్టి యాచోటునకుఁ బోయి, ఆయతిథి విడిచిపోయిన యెంగిలిదొప్పయున్న చోటఁ గూర్చుండినంతమాత్రముననే ఇదే చూడుమా! ఈ నాకుడిప్రక్క బంగరుచాయ గలదయ్యె. ఎడమప్రక్కఁగూడ నట్లొనరింప నుద్దేశించి, అదిమొదలు నిద్రాహారములుగూడ మాని యత్నించుచుంటిని; కాని కష్ట మొక్కటే మిగిలినదాయెను. ఇపుడు మహాత్ముఁడవైన నీవు గొప్ప యాగమును జేయుచుండుట విని, 'నాకోరిక నేఁటి కీడేరినదికదా!' అని సంతసించి, కొండంతయాశతో వచ్చి బ్రాహ్మణులు భుజించినచోటఁ బ్రవేశించి, ఎంగిలినీళులఁ జాలసేపు పొర్లితిని; కాని నాశరీరమందించుకైనఁ బైడిచాయ కనఁబడదయ్యె. కనుక నే నీయాగము సక్తుపిండిదానమున కీడురాదంటిని."

ఇట్లా ముంగిస చెప్పి వెడలిపోయెను. ధర్మరాజును ముంగిసవచనములు సత్యములని తలఁచి స్వస్థచిత్తుఁడాయెను.

కనుక, డంబము వీడి ప్రతిఫలమాశింపక మంచిమనస్సుతోఁ జేయు స్వల్పదానమైనను, కోటిముడుఁగుల ఫలమొసఁగఁజాలునని తెల్లమయ్యెడి.

గీ॥ చిత్తశుద్ధిగల్గి చేసిన పుణ్యంబు
కొంచెమయిన నదియుఁ గొదవగాదు,
విత్తనంబు మఱ్ఱివృక్షంబునకు నెంత, (విశ్వ)

ఇష్టి=యజ్ఞము, సక్తువు=పేలపిండి.

# 19. ఇచ్చినదానమును బుచ్చుకొనరాదు.

---

గీ॥ తొలుత దానమిచ్చినదానిఁ దెలియకైనఁ
గైకొనుటకంటెఁ బాపము గనఁగ లేదు,
తానొరున కొసఁగినయావు తప్పి రాఁగ
నొండొకనికిచ్చి నృగరాజు తొండ యయ్యె.

—నృగమహారాజు చరిత్రము.—

ఇక్ష్వాకువంశమునఁ బుట్టిన నృగమహారాజు యాచకులపాలిటి కల్పవృక్షమై, ప్రజలను గన్నబిడ్డలనువలెఁ బాలించుచుండె. ఇసుకరాశినినైన లెక్కింపనగును; కాని ఆ రాజేంద్రుఁడు బ్రాహ్మణులకు దానమొసఁగిన గోవుల నిన్నియని లెక్కింప, ఆ పితామహునకును సాధ్యము గాదనియే చెప్పవలసియుండును. బంగారు గిట్టలుగలిగి, మంచిదూడలతోఁ గూడిన తొలిచూలావులను, వేదాధ్యయనపరులై కర్మనిష్ఠులగు పేద బ్రాహ్మణులకు నారాజు వేనవేలొసఁగెను. మఱియు, న్యాయార్జితమైన ధనముచే నాతఁడు *సప్తసంతానముల నెలకొల్పి, మిక్కిలి ప్రసిద్ధిఁగాంచెను.

ఇట్లుండ, ఆరాజు మున్నొకప్పుడు కశ్యపుఁడనెడి బ్రాహ్మణునకు దానమొసఁగినగోవు, తప్పించుకొనివచ్చి యతని

---

* సప్తసంతానములు—తటాకము, నిధి, అగ్రహారము, దేవాలయము, వనము, ప్రబంధము, పుత్త్రుఁడు.

మందలోఁ జేరెను. ఆరాజది తెలియక మరల నాగోవునే మఱొకవిప్రునకు దానమిచ్చెను. ఆ బ్రాహ్మణుఁ డాయావును దోలుకొనిపోవుచుండ, కశ్యపుఁడు చూచి కుపితుఁడై యాతని నడ్డగించి, "ఇది నా యావు. దొంగిలియు జంకులేక నడివీథిని దోలుకొనిపోవు నిన్నేమనవచ్చును?" అనెను. అప్పు డా పాఱుఁడు "ఓయీ! తొందరపడెద వేల? ఇప్పుడే నే నీయావును రాజువలన దానముగొని తీసికొనివచ్చుచుండ 'నాది' యని దారినడ్డగించు నీ సామర్థ్యము మెచ్చుకొనవలదా!" అని నుడివెను.

పిమ్మట నిరువురకును గొప్పవివాదము జరిగెను. అంత వారు రాజుకడకుఁబోయి తమవిన్నపములఁ జెప్పుకొనిరి. అపుడు కశ్యపుఁడు నిజమెఱిఁగి రాజునుజూచి, "రాజేంద్రా! ప్రజలను ధర్మమార్గమున నడపింపవలసిన నీవే, మొదట నీయావును నాకు ధారవోసి, ఇది తప్పించుకొని యెట్లో మందలోనికిఁ జేరినంతనే, మరల దీనినే యీయాతనికి దానమొసఁగితివి. దాతవు, హర్తవు. అయిన నిన్నే మనఁగవచ్చు?" అని కోపముతోఁ బలికెను.

అంత నారాజేంద్రుఁడు కశ్యపుఁడాడిన కఠినపుమాటలకుఁ గలఁతనొంది, "బ్రాహ్మణోత్తమా! తెలియక పొరపాటునఁ జేసిన యీ తప్పిదమును మన్నింపుఁడు. ఈ యావునకుఁగా మీకు లక్షగోవుల నొసఁగెదను" అని సవినయముగా వేఁడుకొనెను. ఎన్నివిధములుగ నాతఁడడుగుకొనినను, పాషాణహృదయుఁడగు నాకశ్యపుఁడు వినక, 'నాకుఁ దొలుత నీవొసఁగిన

గోవు నిచ్చితివా సరి; లేదా! నీరాజ్యమంతయు ధారపోసినను నాకుఁబనిలేదు!' అని పిడివాదముగ మాటలాడి యక్కడ నుండి వెడలిపోయెను. తరువాత రెండవ బ్రాహ్మణునిఁగూడ నట్లే బతిమాలెను. ఆతఁడును దనపట్టువిడువక 'నాకీగోవు దప్ప నాయెత్తు ధనము పోసినను నాకుఁ బనిలేదు.' అని నిలువక దురదుర పోయెను.

పిమ్మటఁ గొంతకాలమున కారాజేంద్రునకు మరణకాలము సమీపించె. అపుడు యమకింకరు లాతనిఁ గొంపోయి తమ రాజు ముందట నిలిపిరి. పితృపతి యారాజునుగాంచి, "రాజోత్తమా! నీవొనరించిన దానధర్మములచేఁ గలిగినకీర్తి మూఁడులోకములయందును బ్రసిద్ధమై వెలిఁగెడి. అయినను, ఏరికిఁగాని విధితప్పింపఁ దరమా? కనుక ముందుగ నీవుసలిపిన దత్తాపహరణ దోషమునకుఁ దగినఫల మనుభవించి, ఆవలఁ బుణ్యానుబంధములైన సౌఖ్యములఁ బొందుము." అని చెప్పి యచటనుండి క్రిందికి నెట్టించెను. వెంటనే యారాజు నీచమైన యూసరవెల్లిరూపము నొంది యొక పాడుబావిలోఁబడెను.

ఇట్లుండ, ఒక్కనాఁడు శ్రీకృష్ణుని పుత్త్రులగు గద సాంబ భానులు మొదలగు యదుకుమారులు విహారార్థము వనమునకుఁబోయి, అచట నిష్టానుసారముగ నాటలాడి, దప్పిగొనినవారై నీరుండు చోటును వెతకుచువచ్చి, ఆ పాడు నూతిలోఁ గొండవలెఁ బడియుండిన ముసలితొండనుజూచిరి. వారట్లుచూచి యాశ్చర్యపడి, దానిని వెలికిఁదీయ నాసగలుగ, అందఱేకమై కూయిడుచు, దానికిఁ ద్రాళ్ళుగట్టి లేవఁదీయ

యత్నించిరి; కాని గూతొండ యించుకైనఁ గదలదయ్యె. అంత వారు శీఘ్రగమనమున నింటికేఁగి, ఆ సమాచారమును దమతండ్రికెఱిఁగించిరి. కృష్ణుఁడావృత్తాంతమునువిని యచ్చెరువొంది, ఆ పాఁడుబావికడకు వచ్చి, అందున్న యూసరవెల్లిని గడ్డిపఱకనుబోలె నెడమచేత లేవనెత్తి గట్టునవైచెను.

లోకారాధ్యుఁడైన శ్రీ కృష్ణభగవానుని కరస్పర్శము వలన నాయూసరవెల్లి దివ్యరూపముఁదాల్చి నిలిచి, కృష్ణునకు సాష్టాంగ దండప్రణామము లాచరించెను. అపుడు కృష్ణుఁడు 'నీవెవరవు? ఇట్టి నీచరూపమునొందఁ గారణమేమి?' అని యడుగ నాతఁడు తనవృత్తాంతమునంతయు నందఱు వినునట్లు చెప్పి, 'దేవాది దేవా! నీ సందర్శన సంస్పర్శనములవలనఁ బాప విముక్తుఁడనైతిని' అని పెక్కురీతుల నుతించి, కృష్ణుని యొద్ద సెలవుదీసికొని స్వర్గమునకుఁ బోయెను.

కనుక, అన్నిపాపములలో ఇచ్చినదానమును మరలఁ గైకొనుటకంటె మహాపాతకము వేఱొండు లేదు.

గీ॥ దానమని యిచ్చి మొదట, నద్దాని మరలఁ
గైకొనఁ దలంచుటయు, ఘోర కలుష మండ్రు
చెనకి దత్తాపహరణంబుఁ జేయువాని
కెట్టిపాపము గలుగునో యెఱుఁగ వశమె?

ఘోరకలుషము=మిక్కిలి పాపము, చెనకి=పూని, దత్తాపహరణము=ఇచ్చినదానిని బుచ్చుకొనుట.

# 20. సత్యముతో సాటి ధర్మము లేదు.

గీ॥ ప్రాణములు పోవుతఱినైనఁ బరగ నెవఁడు
సత్యమును గాచు; నాతఁడు సౌఖ్యమొందు,
ఆవొకటి మున్ను పులియొద్ద నాడినట్టి
పలుకు నెఱవేర్చి సుఖమును బడసెఁ గాదె?

### గో వ్యాఘ్ర సంవాదము.

ఒక బ్రాహ్మణుని హోమధేనువు సత్యవ్రత శీలయై, సద్గుణములతో నొప్పుచు, వలసినపుడెల్లఁ దనయజమానునికిఁ బాల్గురియుచు, ఆతనిచే మిక్కిలి గారాబముతోఁ బెంపఁబడుచుండెను. ఆ యావొకనాఁ డొకవనములో మేయుచుండ, ఒక పెద్దపులి పొంచియుండి తటాలున దానిమీఁది కుఱికెను. అపుడాగోవు "ఓహో! నిలు నిలు. దయతో నామాట యొక్కటివిని, పిదప నీయిష్టముచొప్పున సలుపుము." అనెను.

అపుడాబెబ్బులి యాశ్చర్యపడి "నిన్నుఁదిని యాఁకలిఁ దీర్చుకొనఁ బ్రయత్నించిన నన్నేల వారించితివి? నీవు చెప్పఁదలఁచిన మాటయేమి?" అని యడిగెను. అంత నా గోవు, "అయ్యా! నాకొక ముద్దులపట్టి పుట్టి యేడెనిమిదినాళ్లుమాత్రమే యైనది. ఆ బిడ్డఁ డింకను పూరిగూడ మేయనేరఁడు. నేను పోయి వానికిఁ గడుపారఁ బాలిచ్చి, మరల శీఘ్రముగ నిటకువచ్చెదను. పోయిరమ్మని చెప్పి పుణ్యము గట్టుకొనుమా!" అనెను.

అంత నా శార్దూలము నవ్వుచు "గోవా! నన్ను మోసపుచ్చి పోవఁ జూచెదు. నీవు కోడుకున్నచోటునకుఁ బోయి మరల వత్తువనుమాట యెన్నటికైన నిజమగునా? ఏ జంతువునకైనఁ బ్రాణము చేదగునా? అడవిలో నున్నంతనే యింతమాత్రము నాకు తెలివిలేదని తలఁచితివి కాబోలు," అనెను. అంత నా గోవు 'పులికించుకయైన వివేకము లేదే' యని మనసులో విచారించుచు నిట్లనియె.

"అయ్యా! శీఘ్రముగ మరలివత్తుననిన నమ్మజాల కుంటివి. నీవు తలంచినట్లు మోసపుచ్చుట సాధులక్షణమా? అసత్యమునకంటె మహాపాతకము మఱొండు లేదని వినలేదో? మఱియు, ఆడినమాట దప్పువాఁడు చండాలుఁడుగ నెన్నఁ బడును. జాతిచండాలునికంటెను నీతఁడే మిగుల నింద్యుఁడని పెద్దలందురు. అబద్ధము చెప్పినవాఁడు చండాలుఁడైననుబూ జ్యుఁడేయగును. కనుక, నీవీసమయమున నన్ను నమ్మి పోనిచ్చితి వేని, పోయి నాకొడుకునకుఁ గడుపారఁ జన్నిచ్చి బుజ్జగించి, ఇక్కడనున్నట్లుగా వచ్చెదను. కాదు కూడదంటివేని నేనేమి చేయఁగలను?"

ఇట్లాగోవు దీనాతిదీనముగఁ బలికిన, పులి జాలినొంది యిట్లనియె. "మంచిది. నిన్నిపుడు విడిచి పెట్టిన నీవింటికిఁ బోయి రాక మసలితివేని, నే నాఁకటి కెట్లోర్వ గలను? గనుక శీఘ్రముగ మగిడివత్తునని శపథము చేసినఁగాని నిన్ను నమ్మఁజాలను" అపు డా గోవిట్లు శపథములు పలికినది. "నేనిం టికరిగి మరల శీఘ్రముగ రాకుందునేని, మధ్యస్థము చేయవచ్చి

పక్షపాతముఁ జూపినవాఁడు చను దుర్గతికిని, పీటలమీఁది పెండ్లి భంగము చేయువాఁడు పోవుదుర్గతికిని, గోవులను దప్పులేకనే కొట్టినవాఁడు చను దుర్గతికిని, పూజ్యులను బాధించువాఁడు గనుదుర్గతికిని, తల్లిదండ్రులమాట నతిక్రమించువాఁడు పోవుదుర్గతికిని, అపరాహ్ణసమయమున నింటికివచ్చిన యతిథికి నన్నము పెట్టనివాఁడు పోవుదుర్గతికిని, వాగ్దానమొనరించిన ధనమును ఇచ్చుట కిష్టములేక పలుమాఱులు త్రిప్పెడివాఁడు పోవుదుర్గతికిని, నేనును బోవుదానను.''

ఇట్లు కఠినముగా శపథములు చేసిన గోవునుజూచి, పులి ''నీవు ధర్మవేత్తవని నామనసున నమ్మకము కుదిరె. శీఘ్రముగఁ బోయిరమ్ము.'' అని చెప్పెను.

అంత నా యావు వాయువేగమున నిల్లుచేరి, తనకొడుకునకుఁ గడుపారఁ బాలిచ్చెను. అపుడా యావుబిడ్డఁడు పొట్టనిండినతోడనే తల్లిని వదలి, పెద్దపరువున వీధిలో నిటునటు పాఱుచు, అడ్డమువచ్చిన పసిబిడ్డల బెదరించుచుఁ బెక్కురీతుల బాల్యక్రీడలు సలుపుచుండెను. అపుడా గోవు కన్నీరు గార్చుచు ''ఈపసికూనను నేట్లు దిగవిడిచి పోదును? దైవము నన్నిట్లుచేసెనే? వీని యీడుకోడెలు తమతల్లులు వచ్చునపుడు, ఎదురుగఁ బరుగెత్తుచుండ, ఈపసిపాపఁడును బాఱి, తల్లిని గానక యెంత దుఃఖించునో కదా! నే నిచట నింకను ఆలస్యముచేసినచో, పులి నన్నసత్యవాదినిఁగఁ దలఁచి తిట్టుచు నాఁకటితోఁ బోవునేమో! కనుక నిఁకనిచట మసలరాదు.'' అని యూహించి, కొడుకును జేరఁబిలిచి, ఇట్లు బుద్ధులు చెప్పెను.

"అన్నా! ఇన్నాళ్లు నేను నీకుఁ బాలిచ్చి పెంచితిని. నేటితో మనకు ఋణము తీఱినది. నాబుద్ధులను వినుము. ఎప్పుడుఁగాని యసత్య మాడకుము. దుష్టులతో సహవాస మొనరింపకుము. నిన్నితరులు దూషించినచో వినియు వినని యట్లె నటించి తొలఁగిపొమ్ము. ఒంటరిగాఁ బొలమునఁ దిరుగకుము. కయ్యమునకుఁ గాలుద్రవ్వు నాబోతులఁ గదియకుము. ఇన్నాళ్లు నేనుండుటచే నిన్నందఱును ముద్దుచేయుచుండిరి. ఇఁక మీఁద నిన్నెల్లరును జులుకఁ జేయుదురు. గడ్డిపఱకకంటెను, దూది పింజకంటెను, తల్లిలేని బిడ్డ చులుకనయని వినవా? కనుక నీవు బుద్ధిమంతుఁడవై మెలఁగుచుండుము."

ఆ గో విట్లుపదేశించుచుండ నా బిడ్డఁడు "అమ్మా! నేఁడిట్లేలఁ జెప్పఁ దొడఁగితివి? ఈ బ్రాహ్మణుఁడు నిన్ను ధన కాంక్షచే నితరులకు విక్రయింపఁ దలఁచెనా! నీవెందుఁ బోయిన నేనును నీవెంట వత్తును." అనుచు వెక్కి వెక్కి యేడువఁ దొడఁగెను. అప్పుడాయావు కన్నీరుగార్చుచు, పులికిని దనకును జరిగిన సంభాషణమును జెప్పి, అదివిని క్రిందఁబడి పొర్లుచు నేడ్చుచున్న కొడుకును జేరఁదీసి మెల్లఁగా నిట్లనియె.

"నా ముద్దులపట్టీ! నీవిట్టులేల శోకించెదవు? నేను సత్యవాక్యసహాయముగాఁ బులినోరనెడి మార్గమున, స్వర్గసుఖముల ననుభవించుటకై పోవుచున్నదానను. కనుక నీకిది సంతోష సమయముగాని, దుఃఖించుతఱి కాదు. పుట్టినపిమ్మట చావు నిశ్చయము. వృథామరణము నొందుటకంటెఁ గీర్తిపుణ్యములు

గలుగునట్టి చావు శ్రేష్ఠమైనదికదా! నామాటవిని శోకమును విడిచిపెట్టుము,'' అని బుజ్జగించి యెట్టకేలకుఁ దనపుత్త్రిని సమ్మతిపఱచి, పులియున్నచోటునకు వచ్చుచుండెను.

అట శార్దూలము గోవు రాక మసలినందుకు విచారించుచు, "నాచేతికిఁ జిక్కినపుడే పొడువక దానిమాటలకు మోసపోయి విడిచితినిగదా! ఇపుడనుకొన్న ప్రయోజనమేమి? ఏనాఁటికైన నొకనాఁడు దానిఁబట్టి నాకసి దీర్చుకొనకున్న నేను నొక పులినాదునే?'' అని యనుచుండెను. ఇంతలో నాగోవు పులిని సమీపించి "మహాత్ముఁడా! నీదయవలన నా కుమారునిఁ జూచి బుజ్జగించి రాఁగల్గితిని. ఇఁక నాలస్యము చేయక నామాంసమును దిని నీయాఁకలిని దీర్చుకొనుమా!'' అని చేరఁబోయెను. అపుడాపులి నివ్వెఱపోయి "నేను బుట్టి పెరిగి యింతవాఁడనైతిని. ఇట్టి సత్యవ్రతుల నెందును జూడను. ఇట్టిదాని కపకారమొనరించి, మహాపాతక' మనుభవింపఁ జాల. నాకు వేఱొకచోట మాంసము దొరకదా! నన్ను బుట్టించిన దేవుఁడు నాకు తిండినీయక పూరిమేపునా?'' అని తలఁచి, ఆ యావును జూచి, "గోరత్నమా! నీ సత్యనిష్ఠకు మిక్కిలి మెచ్చితిని. నిన్నుఁ జంపఁజాలను. నీవు నీకొడుకు నొద్దకుఁబోయి సుఖింపుము'' అని చెప్పెను.

అపుడాగోవు "పుణ్యాత్ముఁడా! నన్నుఁ బరీక్షింపఁదలఁచి ఇట్లు పలికితివి కాఁబోలు. నామనస్సు మెత్తనిది కాదుసుమా! ఈశరీరమును మున్నేనీకు వాగ్దత్తము చేసితిని. నాకోరిక వ్యర్థము చేయక నీయాఁకలిని వేవేగ తీర్చుకొనుమా! నేనును గృతార్థురాల నగుదును'' అని పలుకుచు గంగడోలు బిగియ

మెడ యెత్తుకొని, పులిచెంతకుఁ బోయెను, శార్దూలమపుడు వెనుక వెనుకకుఁ బోవునుగాని, ఆయావునుజంప నిష్టపడదయ్యె. ఆ గోవు తినుమని మఱిమఱి వేఁడఁగా, పులి "నాకాఁకలి కాదు. వలదు" అనియే చెప్పఁదొడఁగినది.

ఆ సమయమున గోవుసత్యనిష్ఠకును, పులిదయకును మెచ్చి మహావిష్ణువు గరుడవాహనారూఢుఁడై, వాని నడుమ సాక్షాత్కరించి, "మీ సచ్చరిత్రములకు మెచ్చితిని. చెరియొక వర మొసఁగెదను. కోరుకొనుఁడు" అనెను. అపుడా గోవ్యాఘ్రములు లక్ష్మీశ్వరునకుఁ జాఁగిలఁబడి "దేవా! నీ దివ్యలోకము మాకు ననుగ్రహింపుమా!" అని యేకగ్రీవముగాఁ జెప్పెను. 'ఇచ్చితిని' అని యాభగవంతుఁ డంతర్హితుఁడయ్యె. ఆవల శార్దూలమును, గోవును, తమ తమ నివాసములకుఁ బోయి సుఖముండి, కడపట శాశ్వతమైన విష్ణుపదము నొందెను.

కనుక, తనకెట్టి కష్టదశ సంప్రాప్తియైనను, సత్యవ్రతమును వీడకున్నచో నాతనియెడల దేవతలును సంతుష్టులగుదురు. అట్టివాని కెల్లెడల సౌఖ్యములు చేకూరును.

క॥ వెలయంగ నశ్వమేధం
 బులు వేయును నొక్కసత్యమును నిరుగడలం
 దులనిడి తూఁపఁగ, సత్యము
 వలనన మునుసూవు గౌరవంబున పేర్మిన్.

అశ్వమేధము=గుఱ్ఱమును జంపిచేయు యజ్ఞము, తులన్=త్రాసునందు, సత్యమువలనన=సత్యమున్నదైపుననే, గౌరవంబున పేర్మిన్=ఎక్కువ బరువుచేత.

# సుభాషితములు.

### తల్లిదండ్రులు.

క॥ జననియు జనకుఁడు నెవ్వని
యనువర్తనమునఁ బ్రియంబు నందుదు రెదఁ, ద
త్తనయుఁడు ధర్మముఁ గీర్తియు
ననూనముగఁ బొంది, పొందు నక్షయగతులన్॥

### నడవడిక

క॥ పురుషుండు రెండు తెఱఁగుల
ధర నుత్తముఁ డనఁగఁ బరగుఁ, దా నెయ్యెడలం
బరుసములు పలుక కునికిన్
దురితంబులు ఘోరయుపనులు దొఱఁగుట కతనన్.

### సజ్జనులు.

క॥ తను లోకము గొనియాడఁగ
విని యుబ్బఁడు సజ్జనుండు, వెండియుఁ గడు మే
లొనరించుఁ, గీడొకించుక
యును దన దెసఁ దోఁపనీక యుడుపుచు వచ్చున్॥

### దుర్జనులు.

క॥ కోపము నుబ్బును గర్వము
నాపోవక యునికియును దురభిమానము ని
ర్వ్యాపారత్వము ననునివి
కాపురుష గుణంబు లండ్రు కౌరవనాథా.

### తగని పనులు.

క॥ విను మధురాహారంబులు
గొనుటయుఁ, బెక్కండ్రు నిద్ర గూరినయెడ మే

ల్కని యునికియుఁ, గార్యాలో
చనముఁ, దెరువునడచుటయును, జన దొక్కనికిన్ —

అసూయ

క॥ పరులధనమునకు విద్యా
పరిణతికిం దేజమునకు బలమునకు మనం
బెరియఁగ నసహ్యపడు న
న్నరుఁడు దెవులు లేని వేదనంబడు నధిపా!

స్నేహము.

క॥ సమ శీల వ్రతయుతులకు,
సమ ధనవంతులకు, సమ సుచారిత్రులకున్,
దమలో సఖ్యము వివా
హము నగుఁ గా, కగునె రెండు నసమానులకున్?

పలుకు.

క॥ ఎదిరికి హితమును బ్రియమును
మది కింపునుగాఁగఁ బలుకుమాటలు పెక్కై
యొదవినను లెస్స, యటు గా
కిది యది యన కూరకునికి యెంతయు నొప్పున్.

శాంతము.

క॥ అలిగిన నలుగక, యొగ్గులు
పలికిన మఱి విననియట్లు ప్రతివచనంబుల్
పలుకక, బన్నమువడి యెదఁ
దలఁపక, యున్న యతఁడచూవె తత్త్వజ్ఞుఁ డిలన్.